ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 211 | విజయవాడ, మంగళవారం 1 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



ఉద్దానం సమస్యపై సిఎం చంద్రబాబును కలిసిన పవన్ కళ్యాణ్

అక్టోబర్ నుంచి
ప్రజల్లోకెళ్తా

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- నేను టిడిపికి రహస్య మిత్రుడిని కాదు
- గరగపర్రు విషయం నా దృష్టికి రాలేదు
- ఉద్దానం సమస్య పరిష్కారానికి సిఎం సానుకూలం
- ముద్రగడ పాదయాత్రకు అనుమతిచ్చి ఉండాల్సింది
- నంద్యాల ఉప ఎన్నికపై నిర్ణయం తీసుకోలేదు

2

ఉద్దానం కోసం ఎంతైనా వెచ్చిస్తాం

ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్య శాశ్వత పరిష్కారానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రూ 15 కోట్లతో శ్రీకాకుళంలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధక బృందంతోపాటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో సిఎం సమావేశమయ్యారు. నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించిన పవన్ ప్రభుత్వానికి పలు మిగతా 9లో

34 లక్షల మంది...
ఇదీ మన నిరుద్యోగ సైన్యం

- ఇందులో 24 లక్షలమంది ఎస్సీ, ఎస్టీ, బిసిలే
- లక్షల మంది ఇంటర్, గ్రాడ్యుయేట్లు
- ఐటిఐ, పాలిటెక్నిక్ చేసినా నిరుపయోగమే



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 34 లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం లెక్కతేల్చింది. ఉపాధి కల్పనా కార్యాలయాల ద్వారా నమోదైన వారు కేవలం 8.80 లక్షల మంది వరకు ఉండగా, తాజాగా ఇతర సర్వేల్లో తేలిన అంకెల మేరకు 34 లక్షల మంది వరకు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన ప్రజా సాధికారత సర్వేలో 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగులు 34 లక్షల వరకు ఉన్నట్లు తేలింది. 35 ఏళ్లకు మించిన వారు మరో పాతిక వేల మంది వరకు ఉన్నారని గుర్తించారు. నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు ఇటీవల సిద్ధం చేసిన గణాంకాల్లో సుమారు తొమ్మిది లక్షల మందే నిరుద్యోగులున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి భారీ సంఖ్యలో వారున్నట్లు స్పష్టమవుతోంది. అందుకే ఇటీవల చేసిన ప్రజాసాధికారత సర్వే గణాంకాల్ని వెలికి తీసి, వాటిల్లో ఉన్న నిరుద్యోగుల వివరాల్ని క్రోడీకరించగా, దాదాపు 34 లక్షల మంది ఉన్నట్లు తేలింది. ఈ సంఖ్య కూడా ఇంకా పెరిగే అవకాశాలుంటాయని భావిస్తున్నారు. సర్వే లెక్కల మేరకు ఉన్న 34 లక్షల మంది నిరుద్యోగుల్లో అట్టడుగు వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు చెందిన వారు 24 లక్షల మంది ఉండగా, ఇతర కులాలకు చెందిన వారు 10 లక్షల మంది వరకు ఉన్నట్లు సర్వే లెక్కలు చెబుతున్నాయి. అలాగే ఇంటర్, డిగ్రీ చదివిన వారే ఎక్కువ నిరుద్యోగులుగా కనిపిస్తున్నారు. మొత్తమ్మీద చూస్తే 35 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగులు 34 లక్షల మంది, 35 నుంచి 40 మధ్య వయసున్న వారు 13 వేల మంది, 40 నుంచి 45 మధ్య ఉన్న వారు 10 వేల మంది, అంతకన్నా ఎక్కువ వయసున్న నిరుద్యోగులు 17 వేల మంది వరకు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం నిరుద్యోగుల వివరాల్ని పరిశీలిస్తే 35 ఏళ్లలోపు ఉన్న వారిలో అత్యధికంగా బిసి నిరుద్యోగులు 16 లక్షల వరకు ఉండగా, ఎస్సీలు 6 లక్షల మంది, గిరిజనులు 1.40 లక్షల మంది ఉన్నారు. విద్యార్హతల వారీగా చూస్తే అత్యధికంగా 12 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఇంటర్ చదివిన వారు 10.45 లక్షల మంది ఉండగా, పదో తరగతి అర్హత కలిగిన వారు 6.25 లక్షల మంది, పాలిటెక్నిక్, ఐటిఐ వంటి సాంకేతిక అర్హతలు కలిగిన వారు 2.89 లక్షల మంది, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇతర అర్హతలు కలిగిన వారు మరో 2.07 లక్షల మంది ఉన్నట్లు సర్వేలో తేలింది.

ఇంటర్ వరకు చదివి మానేసిన 10.45 లక్షల నిరుద్యోగుల్లో కూడా వెనుకబడిన వర్గాలకు చెందిన మిగతా 9లో

35 ఏళ్లలోపు నిరుద్యోగుల వివరాలు

విద్యార్హత	ఎస్సీ	ఎస్టీ	బిసి	ఇతరులు	వికలాంగులు	మొత్తం
టెన్త్	1,21,933	29,112	3,16,845	1,55,908	1,586	6,25,384
ఇంటర్	2,06,820	51,357	5,08,197	2,76,462	2,442	10,45,278
గ్రాడ్యుయేట్	1,93,680	40,769	5,61,554	4,03,921	4,024	12,02,951
వృత్తి విద్య	56,417	12,001	1,46,875	70,153	3,027	2,89,470
పిజి	32,459	5,089	87,352	81,728	604	2,07,232
మొత్తం	**6,11,309**	**1,38,328**	**16,20,823**	**9,88,172**	**11,683**	**33,70,315**

83% ఉద్యోగులకు కత్తెర..!

- స్నాప్‌డీల్ కసరత్తు
- ఫ్లిప్‌కార్ట్‌తో డీల్ రద్దు

6

రెండు వారాల్లోగా
పరిష్కరించండి
దళితుల సమస్యలపై 10 వామపక్షపార్టీల డిమాండ్

- విజయవాడలో రాష్ట్ర సదస్సు
- దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలకు పిలుపు
- ఏడు తీర్మానాలు ఆమోదం



దళితుల సమస్యలపై తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితుల సమస్యల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, రెండు వారాల్లోగా పరిష్కరించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. దళితులపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్రప్రభుత్వం వారి భూములపైనే కన్నేసిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు భూముల్ని పంచకపోగా, వారు అనుభవిస్తున్న భూముల్ని లాక్కొన్నే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందన్నారు. చాపరాయిలో 16 మంది గిరిజనుల మరణం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దళితులపై దౌర్జన్యాలు జరుగుతున్న ప్రాంతాల్లో వామపక్ష పార్టీలు పర్యటించి, వారికి సంఘీభావాన్ని వ్యక్తం చేస్తాయన్నారు. దళితులు సాగించే పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. దళితులపై దాడులు - కులవివక్షతను మిగతా 2లో

ఆరు లక్షల ఎకరాల్లో
తగ్గిన సాగు

- 27 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- 'నీరు-ప్రగతి' టెలికాన్ఫరెన్స్‌లో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 27 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆరు లక్షల ఎకరాల్లో సాగు తగ్గిందన్నారు. వర్షపాతం 5.8 శాతం తక్కువగా నమోదయ్యిందన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవగా, విజయనగరం, అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలో లోటు ఉందని చెప్పారు. 'నీరు-ప్రగతి'పై సోమవారం ఉదయం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లో వీలైనన్ని ఎక్కువ చెక్ డ్యాంలు నిర్మించాలన్నారు. ఎప్పటికప్పుడు రెయిన్ గన్స్‌తో పంట పోలాలకు తడులు ఇవ్వాలని, పైర్లు ఎండిపోకుండా కాపాడాలని సూచించారు. రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం 35 శాతమే జరిగిందని, గతేడాది కంటే 6 లక్షల హెక్టార్లలో తక్కువగా సాగు నమోదయ్యిందని చెప్పారు. వేరుశనగ సాగు గణనీయంగా తగ్గిందన్నారు. ఎగువ వర్షాలు తక్కువగా ఉండటంతో శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు నీటి చేరిక ఆశించిన స్థాయిలో లేదని చెప్పారు. పంట సంజీవని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.100 కోట్లతో మొబైల్ లిఫ్టులకు ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏ సీజన్‌లో ఏ పనులు చేయాలో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుని, ఉపాధి కూలీలను మళ్ళించాలన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో జరుగుతున్న 50వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు, 10 వేల ఎకరాల్లో అవెన్యూ ప్లాంటేషన్ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. పనులు ప్రారంభమైన 2.17 లక్షల పంట కుంటల తవ్వకం వేగంగా పూర్తి చేయాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం 129 శాతానికి చేరుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 5 జిల్లాలను ఓడిఎఫ్ జిల్లాలుగా అక్టోబరు 31కి మార్చాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 7 జిల్లాలను ఓడిఎఫ్‌గా మార్చాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శులు రాజశేఖర్, జవహర్‌రెడ్డి, జలవనరుల శాఖ సిఇ వెంకటేశ్వరరావు, సెర్ప్ సిఇఒ కృష్ణమోహన్, జిల్లా కలెక్టర్‌లు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులే సమీక్షించి పురోగతి చెప్పాలి

పోలవరం సమీక్షలో సిఎం చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు పనులపై ఇక నుంచి అధికారులే సమీక్షలు నిర్వహించి, పురోగతిని తనకు వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అధికారులు సమీక్షలు నిర్వహిస్తే అవసరమయ్యే పరిష్కారాలు తాను సూచిస్తానన్నారు. పోలవరం, ఇతర ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై సిఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం సహా రాష్ట్రంలోని 28 ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణానికి తలెత్తే ఇబ్బందులను మిగతా 9లో

నితీష్ నిర్ణయాన్ని అంగీకరించలేను



- బీహార్ పరిణామాలపై శరద్ యాదవ్

న్యూఢిల్లీ : బీహార్ పరిణామాలపై జెడి(యు) సీనియర్ నేత శరద్ యాదవ్ ఎట్టకేలకు మౌనం వీడారు. నితీష్ కుమార్ తీసుకున్న నిర్ణయం దురదృష్టకరమని, ప్రజా తీర్పుకు వ్యతిరేకమని పేర్కొంటూ తాను ఈ నిర్ణయంతో ఏకీభవించలేక పోతున్నానని సోమవారం పార్లమెంట్ వద్ద విలేకరులతో అన్నారు. కాంగ్రెస్, లాలూ యాదవ్‌తో కలిసి రెండేళ్ళుగా మహాకూటమిలో కొనసాగిన నితీష్ కుమార్ దానికి తిలోదకాలిచ్చి బిజెపి పంచన చేరిన సంగతి తెలిసిందే. అవినీతి అభియోగాలున్నప్పటికీ లాలూ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకపోవడాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో తాను పనిచేయలేక పోతున్నానని చెప్పి ముఖ్యమంత్రి పదవికి నితీష్ రాజీనామా చేశారు. అయితే 14 గంటల్లోనే తిరిగి బిజెపి మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై పలువురు జెడి(యు) నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై శరద్ యాదవ్ మౌనం వహించినప్పటికీ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ పలు ట్వీట్లు చేశారు. 2019లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను మిగతా 9లో

గ్యాస్ సబ్సిడీకి
మంగళం
దశలవారీగా ఎత్తివేతకు నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రజలకు కేంద్రం సబ్సిడీలు రద్దు చేసే కార్యక్రమాల్లో భాగంగా వంటగ్యాస్‌పై ప్రతి నెల రూ.4 పెంచాలని నిర్ణయించి, ప్రభుత్వ ఇంధన రంగ సంస్థలకు ఆ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలిపారు. రూ.14.2 కిలోల రాయితీ వంటగ్యాస్ సిలెండర్‌పై నెలకు రూ.2 చొప్పున పెంచాలని ఇంధన రంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలకు ఏడాది క్రితమే సూచించినట్లు తెలిపారు. తాజాగా దాన్ని రెట్టింపు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రాయితీని తొలగించాలని భావిస్తున్నట్లు ధర్మేంద్ర పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఈ పెంపుదల అమలు చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ ధరల పెంపుదల కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో రాయితీ గ్యాస్ సిలెండర్ ధర రూ.477.46గా ఉంది.

హిందుస్థాన్‌ను
'లించిస్థాన్'గా మార్చొద్దు

- జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో అకారణ హత్యలు
- లోక్‌సభలో కాంగ్రెస్ విమర్శ

8

ప్రజ్ఞ

1. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ పోటీలు ఎక్కడ జరగనున్నాయి?
2. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన తెలుగు జవాన్ ఎవరు?
3. మహారాష్ట్ర ప్రభుత్వం సైకిల్ ట్రాక్‌లను ఎన్ని నగరాల్లో ఏర్పాటు చేయనుంది?
4. ప్రపంచంలో మొదటి 'గ్రీన్ మెట్రో'గా గుర్తింపు పొందిన మెట్రో ప్రాజెక్టు ఏది?
5. ఉత్తర కొరియాతో ఇక చర్చలు లేవని ప్రకటించిన దేశం ఏది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రెండు వారాల్లోగా పరిష్కరించండి

మొదటి పేజీ తరువాయి

నిరసిస్తూ పది వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర సదస్సు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించారు. సదస్సు తీర్మానాలను ప్రవేశపెట్టిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ ఇలపర్రు, దేవర పల్లి, చిత్తూరు జిల్లాల్లో మహాభారతం, గరగపర్రు ఘటనలు పైకి కనపడుతున్న సమస్యలని, ఇవి కాకుండా తీవ్రమైన సమస్యల్ని దళితులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దళితుల సాగులో ఉన్న భూముల్ని నీరు-చెట్టు, ఆక్వా సాగుకు ప్రభుత్వం లాక్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లాలో మంత్రి కామినేని శ్రీనివాస్ నియోజక వర్గంలో అనేక గ్రామాల్లో అడ్డగోలుగా చేపల చెరువులు తవ్వారని, జిల్లాలో లక్ష ఎకరాల భూమిని పెత్తందార్లు ఆక్రమించుకున్నారన్నారు. తల్లిదండ్రులు లేని బిడ్డలుగా దళితులు బతకాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పెత్తందార్లు తప్పించుకుంటూ దళితులపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని గ్రామాల్లో పకడ్బందీగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకొచ్చాక దళితులు, మైనారిటీలు అభద్రతా భావానికి గురవుతున్నారని, ప్రత్యక్షంగా వారిపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూమతోన్మాదులు జరిపిన దాడుల్లో దేశవ్యాప్తంగా 28 మంది మరణించారన్నారు. చంద్రబాబు అధికారంలో కొచ్చాక మూడేళ్ళల్లో దళితులకు ఒక్క కార్యక్రమమైనా చేశారా అని ప్రశ్నించారు. దళితుల భూముల్ని లాక్కొనేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారని, పథకం ప్రకారం దళితులపై దాడులకు పూరికొల్పుతున్నారన్నారు. లక్షలాది ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్న ప్రభుత్వం పేదల భూముల్ని లాక్కోవడం దారుణ మన్నారు. కొంతమంది కుహనా వాదులు రిజర్వేషన్ల వల్ల దళితులు బ్రహ్మాండంగా జీవిస్తున్నారంటున్నారని, అలాంటివారు గరగపర్రు గ్రామాన్ని సందర్శించాలని సూచించారు. 400 కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగి కూడా లేరన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు వైసాంబశివరావు మాట్లాడుతూ దళితుల విషయంలో చంద్రబాబు మోసకారిగా వ్యవ హరిస్తున్నారన్నారు. గరగపర్రులో సాంఘిక బహిష్కరణ జరిగి రెండు నెలలు తర్వాత ముఖ్యమంత్రికి తెలిసిందన్నారు. హిందూ రాజ్యం పేరుతో దళి తులు, మైనారిటీలు, క్రైస్తవులపై హిందూ మతోన్మాద శక్తులు దాడుల్ని తీవ్రతరం చేస్తున్నాయన్నారు. సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు గుర్రం విజయ కుమార్ మాట్లాడుతూ దళిత, బలహీన వర్గాల వనరుల్ని కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ నేతలు వారిపై దాడులకు పాల్పడుతున్నారని విమ ర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో నేరేళ్ళ ఘటనపై కూడా పోరాటం సాగుతోందన్నారు. శ్రమ జీవులు, ప్రజల సమస్యలు పాలకవర్గాలకు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడుస్తున్నా దళితులు, బలహీన వర్గాలకు మాత్రం ఇంకా స్వాతంత్ర్యం రాలేదన్నారు. మానవులుగా జీవించే హక్కు ఒక వర్గానికి లేకుండా


సదస్సులో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పోతోందన్నారు. ఓట్ల కోసమే అంబేద్కర్ విగ్రహాల్ని ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. దళితులపై దాడుల్ని పాలకవర్గాలు ప్రోత్సహిస్తున్నాయని, వీటిని ప్రతిఘటించాలని పిలు పునిచ్చారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గరగపర్రు, దేవరపల్లి జాతీయ సమస్యగా మారిందన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడడం వల్లే ప్రభుత్వం కదిలి వచ్చిందన్నారు. దళితులు కూలీ,కూడు కోసం ఆందోళన చేసిన సమయంలో వారిపై ఎటువంటి దాడులూ జరగలేదన్నారు. భూమికోసం, ఆత్మ గౌరవం కోసం ఆందోళన ప్రారంభించిన చోటే సామూహిక హత్యలకు పాల్పడుతున్నారన్నారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగర్రావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు, సామ్రాజ్యవాదులకు బిజెపి, టిడిపి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎస్‌యుసిఐ(సి) రాష్ట్రనాయకులు గోవిందరాజులు మాట్లాడుతూ వివక్ష, మతోన్మాదం రెండూ వికృత రూపానికి పుట్టిన కవలలన్నారు. పేదలకు భూములు పంచే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కుల దాడులు, మతోన్మాద దాడులు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు సుందరరామరాజు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్ని ప్రభుత్వం అణచివేస్తోందన్నారు. గరగపర్రు సందర్శనకు వెళ్తున్న వామపక్ష నాయకుల్ని పోలీసులతో అణిచివేసేందుకు ప్రయత్నించిందన్నారు. గరగపర్రు సమస్యకు చర్చలు పరిష్కారం కాదని, గ్రా మ కంఠాల భూమిని గతంలో సాగుచేసుకుంటున్న వారికే హక్కు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీ జరగలేదు : గరగపర్రు బాధితులు


దత్తుల మార్కు

తమ గ్రామంలో అగ్రవర్ణాలకు, తమకు మధ్య ఎటువంటి రాజీ జరగలేదని గరగపర్రు బాధితులు దత్తుల మార్కు, దాసరి లక్ష్మి స్పష్టం చేశారు. రాజీ అయ్యిందని మంత్రులు, ప్రజా ప్రతినిధులు చెప్పారే తప్ప అటువంటిదేమీ లేదన్నా రు. తమకు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఇప్పటికీ తమను పనులకు పిలవడం లేదన్నారు. తమ భూముల్ని కూడా ఇవ్వలేదన్నారు. కుటుం బానికి రూ.లక్ష ఇస్తామని, పాఠశాల నిర్మాణం, వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్లే ఈ సమస్యలొచ్చాయని వారు పేర్కొన్నారు.

సదస్సు తీర్మానాలు

- పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- దేవరపల్లి దళితుల భూముల్ని వెంటనే దళితులకు అప్పగించాలి.
- చిత్తూరు జిల్లా మహాభారతం ఉత్సవాల్లో కుల వివక్షలేకుండా ఒప్పందం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.
- వివిధ ఆందోళనల సందర్భంగా అక్రమంగా పెట్టిన కేసుల్ని వెంటనే ఉపసంహరించుకోవాలి.
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
- కుల వివక్షను నిర్మూలించడానికి వీలుగా అన్ని జిల్లాల్లోనూ దశలవారీగా ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలి.
- అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల్ని తిరిగి దళితులకు అప్పగించాలి.

జులై 20 దేవరపల్లికి బ్లాక్ డే

జులై 20 దేవరపల్లి గ్రామానికి బ్లాక్ డే అని గ్రామానికి చెందిన బాధితుడు జూపూడి రోశయ్య అన్నారు. ఆ రోజు అర్ధరాత్రి ప్రొక్లెయిన్లతో తమ భూముల్ని దున్ని, బయటకొచ్చిన గ్రామస్తుల్ని పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు.

కౌలుదారుల వివరాలు సేకరించండి

ఎస్ఎల్‌బిసి సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూములను సొంతగా సాగు చేస్తున్న వారు ఎందరు, కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న వారు ఎందరు తదితర వివరాల్ని సేకరించి మదింపు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో బ్యాంకర్లతో సమీక్షా సమావేశాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. కృష్ణా, గంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో కౌలు రైతులు అధికంగా ఉన్నారని వీరి గణాంకాలను బ్యాంకర్లు సేకరించి, వారి స్థితిగతులపై అధ్యయనం చేయాలన్నారు. లక్ష రూపాయాల్లోపు రుణాలపై ఎటువంటి ఆంక్షలు విధించవద్దని, సరళంగా వ్యవహరించాలని బ్యాంకర్లకు సిఎం సూచించారు. రైతులకు ఇది చాలా కీలకమైన సమయమని, వారికి రుణాలు ఇవ్వడంలో కఠినంగా ఉండొద్దన్నారు. భూయజమానులు, కౌలు రైతుల వివరాలు తనకు సమర్పించాలని ఆదేశించారు. రుణాలు ఇచ్చే విధానాన్ని సరళీకరించాలని, ఏ ప్రాతిపదికన ఇవ్వాలనే అంశంపై తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. వ్యవసాయం లాభసాటిగా మారాలన్నది ప్రభుత్వ విధానమన్నారు. వ్యవసాయం ఉపాధిని కల్పించేదిగా, ఆదాయాన్ని పెంపొందించేదిగా ఉండాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కౌలు రైతులు ఎందరున్నారో జిల్లాల వారీగా గణాంకాలు సేకరించాలని సిఎం కోరారు. చిన్న సన్నకారు రైతులు నష్టపోకుండా వారికి సీజన్ ముగియకముందే సకాలంలో రుణాలు అందించాలన్నారు. బ్యాంకులతో అనుసంధానమైన సంక్షేమ కార్యక్రమాల వివరాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో సిఎంకు వివరించారు.

అక్టోబర్ నుంచి ప్రజల్లోకెళ్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్టోబర్ నుంచి ప్రజల్లోనే ఉంటానని, రాజకీయాలకు పూర్తి స్థాయిలో సమయాన్ని కేటాయిస్తానని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలిపారు. గరగపర్రు విషయం తన దృష్టికి రాలేదని, తెలిసిన తరువాత వెళ్లాలంటే భద్రతాపరమైన సమస్యలున్నాయని తెలిపారు. ప్రజల్లో సంఘ విద్రోహకశక్తులు చొరబడి వినాశనానికి పాల్పడే అవకాశముందని, అందువల్లే అక్కడకు వెళ్లలేదని చెప్పారు. పైగా జనసేనకు నేతల్లేరన్నారు. దళితుల సాంఘిక బహిష్కరణ నేరమని పేర్కొన్నారు. ఉద్దానం కిడ్నీ సమస్యపై హార్వర్డ్ వైద్యబృందంతో కలిసి సోమవారం వెలగపూడి సచివాలయంలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన అనంతరం విజయవాడలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడారు. తాను టిడిపికి రహస్య మిత్రుడిని కాదని, నంద్యాల ఉప ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతివ్వాలనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా, ప్రజలకు నష్టం కలిగించే విధంగా తుందుర్రు ఆక్వా పార్కు ఏర్పాటు చేస్తే దానిని కచ్చితంగా వ్యతిరేకించాల్సిందేనన్నారు. ఈ దేశం అనేక కులాల, మతాల సమూహమని, కులాలు, మతాల ఆధారంగా సమాజాన్ని నిర్మించాలనుకోవడం ప్రమాదకరమన్నారు. అంబేద్కర్, గాంధీ, అల్లూరి సీతారామరాజు వంటి మహా నేతలను ఒక కులానికో, మతానికో పరిమితం చేయడం మంచి పరిణామం కాదన్నారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యను పరిష్కరించేందుకు సిఎం సానుకూలంగా స్పందించారని, అక్కడ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అంగీకరించారని తెలిపారు.


విజయవాడలో అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్

బాబు, పవన్ భాయీ భాయీ : ఎంపి జెసి

పవన్ కళ్యాణ్, చంద్రబాబు భాయీ.. భాయీ అని అనంతపురం ఎంపి జెసి దివాకర్ రెడ్డి అన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అదృష్టం ఎన్నటికీ లేదని ఆయన పేర్కొన్నారు. నంద్యాలలో టిడిపి గెలుపు ఖాయమన్నారు. నిధుల్లేక పోయినా చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాడని తెలిపారు. ఉద్దానం విషయంలో ఎంతో కృషి చేసిన పవన్ కల్యాణ్‌ను అభినందించాల్సిందేనన్నారు.

సిట్ విచారణలో హీరో తనీష్

- నాలుగు గంటల పాటు ప్రశ్నించిన అధికారులు
- అఖిల్ చౌదరి, నిరుపమ రెడ్డినీ ప్రశ్నించిన సిట్
- నందుతో ముగియనున్న విచారణ పర్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మత్తుపదార్థాలు తీసుకునే అలవాటు తనకు లేదని యువ హీరో తనీష్ అల్లడి అన్నారు. చిన్నతనం నుంచి సినీ పరిశ్రమతో అనుబంధం ఉందని, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కుటుంబ ప్రోత్సాహంతో ఈస్థాయికి వచ్చానని చెప్పారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ వ్యవహారం గురించి తెలియదన్నారు. ఇప్పుడిప్పుడే సినిమాల్లో నిలదొక్కుకుంటున్న తనకు ఈ పరిణామాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయని ఆయన సిట్ అధికారుల సమక్షంలో బాధను వెలుబుచ్చారు. డ్రగ్స్ కేసు విచారణలో నోటీసులందుకున్న తనీష్ సోమవారం సిట్ ఎదుట హాజరయ్యారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ప్రశ్నించారు. సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ తనీష్ నేరుగా జవాబులు చెప్పారు. కెల్విన్‌తో పరిచయాలపై ప్రధానంగా అడిగినట్లు తెలిసింది. నేరుగా ఆయనతో సంబంధాలు లేవని అయితే సినిమా ప్రమోషన్ సందర్భంగా ఒకటి,రెండు సార్లు మాట్లాడానని సిట్ విచారణ బృందానికి తనీష్ చెప్పినట్లు తెలిసింది. చిన్నతనం నుంచి సినిమాల్లో నటించడంతో తరుణ్‌తో చాలా దగ్గర సంబంధాలున్నాయని, తరుణ్‌తో కలిసి విదేశాలకు వెళ్ళలేదని పేర్కొన్నారు. నవదీప్‌తో పెద్దగా స్నేహం లేదని, ఆయనతో కలిసి పార్టీలకు హాజరుకాలేదని తెలిపారు. సినీ పరిశ్రమలో పరిచయాలు చాలా ఎక్కువేనని అయితే వారి వ్యక్తిగత విషయాలు అలవాట్లు తెలియవని సిట్‌కు స్పష్టంచేశారు. తనీష్‌తో పాటు అఖిల్ చౌదరి, నిరుపమ రెడ్డిలను కూడా సిట్ ప్రశ్నించింది.

అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పా : తనీష్

డ్రగ్స్ కేసులో సిట్ అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పినట్లు తనీష్ మీడియాకు వెల్లడించారు. విచారణ అనంతరం ఆబ్కారీ కారాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకం ప్రమాదకరమని, 'సే నో టు డ్రగ్స్' కోసం అంతా కలిసికట్టుగా ప్రయత్నిద్దామని పిలుపునిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే సిట్‌కు సమాధానం ఇవ్వాలని కోరారు. ఈ విచారణలో తనకు తెలిసిన వివరాలను సిట్ అధికారులకు చెప్పానన్నారు. సిట్ విచారణ నేపథ్యంలో మీడియా ప్రసారం చేసిన నిరాధార కథనాలతో తమ కుటుంబం చాలా మనోవేదనకు గురయ్యిందని చెప్పారు. మీడియా సంయమనం పాటించాలని కోరారు. ఊహాగానాలు కాకుండా జరిగిన విషయాన్ని ఉన్నదున్నట్లు ప్రజలకు చేరవేస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

నేడు సిట్ ముందుకు హీరో నందు

డ్రగ్స్ కేసు విచారణలో చివరిగా హీరో నందు అలియాస్ ఆనందకృష్ణ మంగళవారం సిట్ ఎదుట హాజరవుతున్నారు. ఈకేసులో నోటీసులు తీసుకున్న 12 మంది సెలబ్రెటీల్లో నందు చిట్టచివరి వ్యక్తి. నందుతో సిట్ విచారణ పూర్తవుతుంది. త్వరలోనే విచారణకు సంబంధించిన వీడియో రికార్డులన్నింటినీ సిట్ కోర్టుకు సమర్పించనుంది. సిట్ విచారణలో వెల్లడయిన వివరాలతో అధికారులు రెండో జాబితా కూడా రూపొందించారు. ఇందులో చాలామంది ప్రముఖుల పేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఉత్తరాంధ్రపై ఆవర్తనం

కోస్తా, సీమల్లో అక్కడక్కడా వర్షాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

పశ్చిమ మధ్య బంగాళాఖాతం, నైరుతి బంగాళాఖాతం మీదుగా దక్షిణ కోస్తాంధ్రకు ఆనుకుని 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు ఉత్తరాంధ్ర పైనా మరో ఉపరితల ఆవర్తనం 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఆవరించి ఉన్నట్లు తెలిపింది. ఒడిశా నుంచి కోస్తా మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన ఓ మోస్తరు నుంచి చెదురుమదురు జల్లులు కురుస్తాయని తెలిపింది. రాయలసీమలో మంగళవారం అక్కడ క్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. సోమవారం ఉదయానికి వెంకట గిరిలో 6.8, పలాస 6.5, పాలకొండ 6.0, గూడూరు 5.8, తెర్లాం, మెరకముడిదాం 4.2, పాలకోడూరు 3.6, సాలూరులో 3.5, తడ 3.0, వీరఘట్టం 2.9, కందుకూరులో 2.7, భీమవరం 2.6, చీపురుపల్లి 2.5, నర్సాపురం, యలమంచిలి, పాతపట్నం 2.4, మందస 2.2, రాయలసీమలోని తొట్టంబేడులో 7.8, శ్రీకాళహస్తి 7.6, ఆరోగ్య వరం 7.3, పాకాల 6.5, మదనపల్లె 5.9, తిరు పతి 5.7, పుంగనూరు 4.8, చిత్తూరు 4.5, వెంక టగిరి 2.8, జమ్మలమడుగు 2.6, తంబల్లపల్లె, నంద్యాల, నంబులిపులికుంట, రాజంపేట 2.5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. సోమవారం సాయంత్రం కూడా రాష్ట్రంలో పలు చోట్ల ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్ హాజరైన ఎమ్మెల్యేలు, నేతలు

11 నుంచి ప్రజల వద్దకు వైసిపి

- అక్టోబర్ నెలాఖరులో జగన్ పాదయాత్ర
- విస్తృత సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 11వ తేది నుంచి అక్టోబర్ 25 వరకూ వైసిపి ప్రజల వద్దకు వెళ్లనుంది. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర కూడా ప్రారంభం కానుంది. సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఆగస్టు 11 నుండి మూడు విడతలుగా ప్రజల వద్దకు వెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఆగస్టు 11 నుంచి 29 వరకూ పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు వెళ్లి కలుస్తారు. జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన తొమ్మిది ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అభిప్రాయాలు సేకరిస్తారు. సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 2 వరకు వైఎస్సార్ కుటుంబం పేరుతో పార్టీ సభ్యత్వ కార్యక్రమం చేపడుతారు. అక్టోబర్ 2 నుంచి 25 వరకు విజయ శంఖారావం పేరుతో కార్యక్రమం ప్రారంభిస్తారు. పోలింగ్ బూత్ పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి జగన్ ఎందుకు పాదయాత్ర చేస్తున్నారో ప్రజలకు వివరిస్తారు. ఆ తరువాత అక్టోబర్ 26 లేదా 27 తేదీల నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభిస్తారు.

నేడు 'ఇ-ప్రగతి'ని ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ పాలనను అందించేందుకు ఐటి శాఖ రూపొందించిన 'ఇ-ప్రగతి'ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఇ-ప్రగతిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి విడతగా 120 మందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐబిఎస్)కు ఈ బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే.

దక్షిణాది రాష్ట్రాల మధ్య మిగులు విద్యుత్ సర్దుబాటు

- విధివిధానాలకు ఉన్నతస్థాయి కమిటీ
- ఎస్ఆర్‌పిసి సమావేశంలో నిర్ణయం
- 20న కేరళలో ఎస్ఆర్‌పిసి సమావేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దక్షిణాది రాష్ట్రాల్లో మిగులు, లోటు విద్యుత్ ఉన్నా, సర్దుబాటు చేసుకొనే విధంగా విధి విధానాల్ని ఖరారు చేయాలని దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ కమిటీ (ఎస్ఆర్‌పిసీ) నిర్ణయించింది. ఈ విధానం దేశంలోని విద్యుత్‌రంగానికి మార్గదర్శకంగా ఉండాలని, దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ విషయాల్లో పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకోవాలని తీర్మానించారు. సోమవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో ఎస్ఆర్‌పిసి సమావేశం సోమవారం తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. దక్షిణాది రాష్ట్రాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ పంపిణీ కోసం చేసుకోవాల్సిన ఒప్పంద అవసరాలు, దానివల్ల కలిగే ప్రయోజనాలపై చర్చించారు. ప్రస్తుతం మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు దాన్ని అమ్మాలన్నా, కొనాలన్నా పవర్ ఎక్స్ఛేంజ్ ద్వారానే లావాదేవీలు నడపాల్సి ఉంటుందని, దీనికి ఒకరోజు ముందుగా సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుందని ప్రభాకరరావు వివరించారు. విద్యుత్ డిమాండ్ అంచనాలు తగ్గితే ఆయా రాష్ట్రాలు విద్యుత్‌ప్లాంట్లను బ్యాకింగ్‌డౌన్ చేయాల్సి వస్తోందని, దీనివల్ల ఫిక్సెడ్ ఛార్జీల భారం తిరిగి విద్యుత్ సంస్థలపైనే పడుతున్న విషయాన్ని వివరించారు. దీనికి భిన్నంగా దక్షిణాది రాష్ట్రాలు ఇకపై పరస్పర ఒప్పందాలకు వస్తే, ఎక్కడ మిగులు, లోటు విద్యుత్ ఉన్నా దక్షిణాది లోడ్ డిస్పాచింగ్ సెంటర్ (ఎస్ఆర్ఎల్‌డిసి)కు సమాచారం ఇస్తే, లోటు రాష్ట్రానికి తక్షణం విద్యుత్ సరఫరా చేసే విధంగా ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ విక్రయించే, కొనుగోలు చేసే రెండు రాష్ట్రాలకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ ప్రతిపాదనకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. అయితే విద్యుత్‌కొనుగోలు ఒప్పందాలు, విధివిధానాలను ఖరారు చేసేందుకు ఎస్ఆర్ భట్ నేతృత్వంలో ఓ కమిటీని నియమించాలని నిర్ణయించారు. ప్రాథమిక ముసాయిదాకు ఎస్ఆర్‌పిసిలోని సభ్యరాష్ట్రాలన్నీ ఆమోదం తెలిపాయి. ఆగస్టు 20న కేరళలో జరిగే ఎస్ఆర్‌పిసి సమావేశంలో తుది ముసాయిదాపై చర్చించి, నిర్ణయం తీసుకోవాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. సమావేశంలో సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్, కర్ణాటక ట్రాన్స్‌కో మేనేజింగ్ డైరెక్టర్ జావెద్ అక్తర్, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో డైరెక్టర్ నాగరాజు స్వామి, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎమ్‌డీ డాక్టర్ కె ఎలంగోవన్, తమిళనాడు ట్రాన్స్‌కో ఎమ్‌డీ ఎస్ షణ్ముగం, సదరన్ రీజియన్ లోడ్ డిస్పాచ్ సెంటర్ జనరల్ మేనేజర్ అంబునెసన్ పాల్గొన్నారు.

నీటి మూటలు.. 'గరగపర్రు' హామీలు!

- అమలుకు నోచని మంత్రుల బృందం హామీలు
- ఇప్పటికీ కౌలుకు భూములు ఇవ్వని దుస్థితి
- పనులకూ పిలవడంలేదు
- రూ.లక్ష పరిహారం అందజేతపై అయోమయం
- అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపై ఇంకా రాజకీయం
- కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణ



పనులు ప్రారంభించకపోవడంతో మురికి కూపంగా ఉన్న దళిత పేటలోని రోడ్లు

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

సాంఘిక బహిష్కరణకు గురైన పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు గ్రామ దళితులకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆధ్వర్యాన మంత్రుల బృందం ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మారాయి. గ్రామస్తులతో చర్చలు జరిపి వారం రోజులు కావొస్తున్నా ఏ ఒక్క హామీ అమలుకు నోచని దుస్థితి నెలకొంది. హామీల అమలు కోసం దళితులంతా మరోసారి పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. జులై 25న మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, పితాని సత్యనారాయణ, జవహర్, ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్, ఎంఎల్ఎ వేటుకూరి శివ రామరాజు గరగపర్రులో పర్యటించారు. సాంఘిక బహిష్కరణకు గురైన దళితులకు న్యాయం చేసేందుకు తాము వచ్చామని మంత్రులు చెప్పారు. దళితులు, ఆధిపత్యకులాల పెత్తందారులతో విడివిడిగానూ, కలిసీ కూర్చోబెట్టి చర్చలు జరిపారు. సాంఘిక బహిష్కరణకు గురైన దళితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందంటూ పలు హామీలిచ్చారు. గరగపర్రులోని 360 దళిత కుటుంబాలకూ రూ.లక్ష చొప్పున పరిహారం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. వారం రోజులు కావొస్తున్నా చిల్లిగవ్వ అందలేదు. ఎప్పటికిస్తారో సమాధానమూ చెప్పడం లేదు. రేషన్ కార్డుల ప్రాతిపదికన పరిహారం అందిస్తామని ప్రకటించారు. 60 దళిత కుటుంబాలకు రేషన్ కార్డులే లేవు. వెంటనే కార్డులిస్తామని చెప్పారు. ఇప్పటివరకూ 30 కార్డులే ఆన్‌లైన్‌లో వచ్చాయి. మిగిలిన కార్డులు ఎప్పటికిస్తారో తెలీని పరిస్థితి నెలకొంది. కార్డు లిచ్చేదెప్పుడో పరిహారం అందించేదెప్పుడో తెలీని పరిస్థితి నెలకొంది.

కౌలుకు పొలాలివ్వలేదు.. పనులకూ పిలవలేదు..

మంత్రుల బృందం సమక్షంలో జరిగిన చర్చల్లో ప్రధాన డిమాండ్ వెనక్కి తీసుకున్న కౌలుకు భూములు తిరిగి ఇవ్వడం. కౌలుకు భూములు ఇస్తామని ఆధిపత్య కులాలకు చెందిన వారు మంత్రుల చర్చల్లో ఒప్పుకున్నారు. ఇప్పటికీ ఏఒక్కరికీ తిరిగి కౌలు భూమి ఇవ్వలేదు. ఒకవైపు నాట్లు పూర్తి కావొస్తున్నా.. అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో దాదాపు 60 మంది దళిత కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనులకు పిలుస్తామని చెప్పినా అదీ జరగడం లేదు. ఇళ్లలో పాచిపని చేసే ఒకరిద్దరిని పిలవడం మినహా వ్యవసాయ పనులకు పిలవడం లేదని, దీంతో బతుకుదెరువు కోసం దూరప్రాంతాలకు పనికెళ్తున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంఘిక బహిష్కరణలో ప్రధాన సమస్యలుగా ఉన్న కౌలు భూములు ఇవ్వడం, పనులకు పిలవడం జరగకుండా సాంఘిక బహిష్కరణ ఏవిధంగా తొలగిపోయినట్లో ప్రభుత్వమే చెప్పాలని దళితులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని ఆధిపత్యకులాలకు చెందిన వ్యక్తి వద్ద ఎలక్ట్రికల్ పనిచేసే దళిత యువకులను సైతం తిరిగి పనిలోకి పిలవని పరిస్థితి కొనసాగుతోంది.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపైనా కొనసాగుతున్న రాజకీయం

గరగపర్రులో వివాదం పెరగడానికి ప్రధాన కారణం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును పెత్తందారులు అడ్డుకోవడమే. దళితులు తొలుత చెరువు గట్టుపై విగ్రహం ఏర్పాటు చేశారు. పెత్తందార్లు ఆ విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించడంతో గొడవ మొదలైంది. తర్వాత నరసాపురం సబ్‌కలెక్టర్ వచ్చి తాత్కాలికంగా పంచాయతీ భవనం ఎదుట విగ్రహాన్ని పెట్టించారు. మంత్రుల బృందం చర్చలు సందర్భంగా ప్రస్తుతం ఉన్న పంచాయతీ ప్రాంతంలోనే విగ్రహాన్ని ఉంచాలని దళితులు కోరారు. అందుకు మంత్రుల బృందం సైతం అంగీకరించింది. మర్నాడుకు మాటమారింది. నూతనంగా పంచాయతీ భవనం నిర్మించాల్సి ఉందని విగ్రహాన్ని చెరువు గట్టుపైనే పెట్టనున్నట్లు చెప్పారు. చెరువుగట్టుపై విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోంది. విగ్రహం ఏర్పాటుకు ప్రత్యేక జిఒ జారీ చేయాలని దళితులు కోరారు. లేకపోతే పంచాయతీ భవనం వద్దనే ఉంచాలన్నారు. జిఒ విడుదల చేయిస్తామని మంత్రులు చెప్పినా, నేటికీ అది జరగలేదు. కోర్టులో ఉన్న ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు జిఒ ఇస్తుందా.. కావాలనే ప్రభుత్వం నాన్చుతోందా అనే అనుమానాలు దళితుల్లో వ్యక్తమవుతున్నాయి.

మిగిలిన హామీలూ అంతే..

దళితపేటలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదు. శ్మశాన ఆక్రమణలు తొలగిస్తామని చెప్పినా పట్టించుకోవడం లేదు. చెరువుగట్టు వద్ద దళిత మహిళలకు ఇబ్బంది కలిగించేలా పెత్తందార్లకు చెందిన వ్యక్తులు వ్యవహరిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని దళితులు కోరారు. ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా అడుగు ముందుకు పడలేదు. మంత్రుల బృందం ఇచ్చిన హామీలు ఏవీ అమలుకు నోచుకోలేదు. హామీలను రాతపూర్వకంగా ఇవ్వకపోవడం కారణంగానే ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని చెప్పొచ్చు. ఎప్పటికి పూర్తిచేస్తారో చెప్పకుండా హామీలిచ్చి మంత్రులు వెళ్లిపోయారని, అమలు పరిస్థితి ఏమిటని దళితులు వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పేవారే లేకపోయారు. మరోసారి పోరుబాట పట్టేందుకు దళితులంతా సమాయత్తమవుతున్నారు.

గరగపర్రు వెలిపై 4న సదస్సు

ప్రజాశక్తి-భీమవరం రూరల్

దళితులకు న్యాయం చేయాలని ఆగస్టు 4న భీమవరంలో సదస్సు నిర్వహించనున్నట్లు గరగపర్రు దళిత ఉద్యమ సంఘీభావ కమిటీ పేర్కొంది. భీమవరంలోని సిఐటియు కార్యాలయంలో సంఘీభావ కమిటీ నాయకులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ చట్టసభల్లో ప్రభుత్వాధినేతలు ఇచ్చిన హామీలకు దిక్కులేకుండా పోయిందని, నేడు మంత్రులు ఇచ్చిన హామీలు ఎక్కడ నెరవేరతాయని వారు ప్రశ్నించారు.. కుల తత్వాన్ని రెచ్చగొట్టి దళితులను బహిష్కరించిన వారి నుండే నష్టపరిహారాన్ని రాబట్టి దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ లోహ విగ్రహాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని కోరారు. 4న భీమవరంలో జరిగే సదస్సుకు రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘాలకు చెందిన ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు.

తాతల నాటి నుంచి చేస్తున్న కౌలు పొలం ఇవ్వలేదు

ఎరిచర్ల రాజేష్, గరగపర్రు



మా తాతల నాటి నుంచి ముదునూరి నాగరాజు పొలం రెండెకరాలు కౌలుకు చేస్తున్నాం. విగ్రహం గొడవ మొదలయ్యాక పొలం తీసేసుకున్నారు. మంత్రులు వచ్చినప్పుడు కౌలు భూములు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదు. నాట్లు సైతం వేసేశారు. పనులకు పిలకపోవడంతో 20 కిలోమీటర్ల దూరం పనులకు వెళ్లాల్సి వస్తోంది.

పొలమూ ఇవ్వలేదు.. పనులకూ పిలవడం లేదు..

కేరీదల అమృత, గరగపర్రు



20 ఏళ్లుగా నాలుగున్నర ఎకరాలు కౌలుకు చేస్తు న్నాం. విగ్రహం గొడవతో వెనక్కి తీసేసుకున్నారు. పొలం ఇవ్వలేదు. పనులకు పిలవడం లేదు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం.

పొలం లేక సినిమా హాలు వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నా

దండపాటి ఏసేబు, గరగపర్రు



ఎప్పటి నుంచో 3.60 ఎకరాల పొలం కౌలుకు చేస్తున్నాను. విగ్రహం గొడవతో వెనక్కి తీసేసుకున్నారు. పొలం తిరిగి ఇవ్వడం లేదు. పనులకు పిలవడం లేదు. దీంతో భీమవరంలోని ఓ సినిమా థియేటర్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాను. పొలం తిరిగిస్తే వ్యవసాయం చేసుకుంటాం.

హామీలు నెరవేర్చకపోతే నాలుగోతేదీ నుంచి పోరుబాట

పి.రామకృష్ణ, కెవిపిఎస్ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి

మంత్రులిచ్చిన ఏ ఒక్క హామీ ఇప్పటి వరకూ నెరవేర్చలేదు. కౌలుభూములు ఇవ్వడం, అంబేద్కర్ విగ్రహం ప్రభుత్వమే అధికారికంగా ఏర్పాటు చేయడం, రూ.లక్ష నష్టపరిహారం అందించడం, ఎత్తివేత వంటి హామీలను ఆగస్టు 4వ తేదీ లోపు నెరవేర్చాలి. లేకపోతే దళితులంతా కలిసి పోరాటానికి దిగుతాం.



నేషనల్ హైవే భద్రతపై ఆడిట్

విజయవాడ, విశాఖ, కడప, శ్రీకాకుళంల్లో సర్వే పూర్తి

ఆగస్టు 2న తూర్పు గోదావరిలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించేందుకు, ప్రయాణికులకు భద్రత కల్పించేందుకు రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలనకు ఆడిట్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది ప్రమాదాలకు కారణాలు, ప్రమాదకర మలుపులు, గోతుల గుర్తింపు, ఆయా పట్టణాలు, నగరాల నుంచి హైవేకి ఎక్కే సమయంలో ప్రమాదాలు ఎక్కడ జరుగుతున్నదీ పరిశీలిస్తుంది. పరిశీలనానంతరం రాష్ట్ర ప్రభుత్వ, జాతీయ రహదారుల ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తుంది. ఇప్పటికే శ్రీకాకుళం, విజయవాడ, విశాఖపట్నం, కడప నగరాలకు సంబంధించిన జాతీయ రహదారుల పరిశీలనను రవాణా శాఖ ఆడిట్ బృందం పూర్తి చేసినట్లు సమాచారం. మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ సమస్యలను అధ్యయనం చేసేందుకు సెప్టెంబరు 30 గడువు తేదీగా నిర్ణయించారు. జాతీయ రహదారులపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్ పేరుతో అధికారులు ప్రత్యేకంగా గుర్తించే పనిలో పడ్డారు. ఆగస్టు 2న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, ఇంజినీరింగ్ కళాశాలల్లో బెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉన్న నిపుణులతో కళాశాల విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు.

సర్వర్స్ మెజర్‌మెంట్ ద్వారా పరిశీలన

జాతీయ రహదారులపై సర్వర్స్ మెజర్‌మెంట్ ద్వారా ప్రమాదాలను నివారించే అంశాన్ని రవాణాశాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం. వాహనాలు ప్రయాణించే సమయంలో వాహనం ఎంత వేగంగా ప్రయాణిస్తుందనే అంశాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు మెజర్‌మెంట్ వ్యవస్థ చక్కగా ఉపయోగపడుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

విజయవాడలో స్పీడ్ గన్స్‌తో వేగ నియంత్రణ

విజయవాడలో వాహనాలు అతి వేగంతో ప్రయాణించకుండా ఉండేందుకు పోలీసు శాఖ స్పీడ్ గన్స్‌ను ప్రయోగాత్మకంగా మహాత్మాగాంధీ రోడ్డు, కారల్ మార్క్స్ రోడ్డులో ఏర్పాటు చేసింది. ద్విచక్ర వాహనాలను 40 కిలోమీటర్లు దాటి వేగంగా నడిపితే వారి ఇళ్లకు చలానాలు పంపడం ప్రారంభించారు. ఇటీవల నగరంలో పలువురికి వేగంగా వెళ్తున్నారనే కారణంతో అపరాధ రుసుములకు సంబంధించిన చలానాలు పంపారు.

తిరువూరు కౌన్సిల్‌లో రసాభాస

ఐదుగురు వైసిపి సభ్యుల సస్పెన్షన్

ప్రజాశక్తి - తిరువూరు

కృష్ణాజిల్లా తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ రసాభాసగా మారింది. కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఛైర్‌పర్సన్ మరకాల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదనలతో దద్దరిల్లింది. చివరికి ఐదుగురు వైసిపి సభ్యులు సస్పెండ్ అయ్యారు. గత సమావేశంలో ఆమోదించిన 2016-17కు సంబంధించిన 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన 26 పనులను రద్దు చేసి వాటి స్థానంలో వేరే పనులు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం తీసుకొచ్చారు. ఒకసారి ఆమోదించిన పనులను రద్దు చేసే అధికారం కౌన్సిల్‌కు లేదని వైసిపి ఫ్లోర్‌లీడర్ రామవరపు లక్ష్మణరావు పేర్కొన్నారు. దీనిపై అధికార పక్షానికి చెందిన షేక్ హుస్సేన్, వైస్‌ఛైర్మన్ సోమ వరపు వెంకట నరసింహారావులు రద్దు చేయవచ్చునని సమాధానమిచ్చారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో ఐదుగురు వైసిపికి చెందిన కౌన్సిలర్లను మూడునెలలపాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు.

సబ్‌ప్లాన్ నిధుల దారిమళ్లింపుపై కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-జంగారెడ్డిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ పరిధిలో దారిమళ్లిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల విషయంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి అధ్యక్షతన సోమవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం అజెండాలో రూపొందించిన సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ 15వ వార్డు కౌన్సిలర్ పసుమర్తి రమాదేవి డీసెంట్ అందజేశారు. దీనిపై స్పందించిన రెండోవార్డు కౌన్సిలర్ అభివృద్ధి పనులను అడ్డుకునే ఉద్దేశంతో ఇచ్చిన ఈ డీసెంటును పరిగణనలోకి తీసుకోరాదని ఛైర్‌పర్సన్‌ను కోరారు. దీనిపై ఘాటుగా స్పందించిన మరో కౌన్సిలర్ చింతల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో నగర పంచాయతీకి వచ్చిన రూ.8 కోట్ల సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులో నిబంధనలు ఉల్లంఘించారని తాను ఇచ్చిన డీసెంట్‌ను గుర్తు చేశారు. దీనిపై ఉన్నతాదికారులు జరిపిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలన్నారు. పాలకవర్గ సభ్యునిగా, ఫిర్యాదుదారుడిగా తాను అడిగిన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌ప్లాన్ నిధులను ఇష్టానుసారంగా కేటాయించింది ఎవరనే విషయం తెలియజేయాలని పట్టుబట్టారు. దీనిపై ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈసారి సబ్‌ప్లాన్ నిధులను కేటాయించే సందర్భంలో పాలకవర్గ ప్రమేయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఎంఎల్ఎ సుజాతను కోరతామని కౌన్సిలర్లకు సర్దిచెప్పారు.

ఖాళీ పోస్టుల భర్తీ ఎప్పుడు?

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు

ప్రజాశక్తి- నెల్లూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తొలుత గాంధీ బొమ్మ నుంచి విఆర్‌సి మీదుగా కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెసి ఎఎండి ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు మాట్లాడుతూ బాబు వస్తే జాబు వస్తుందని ఎన్నికల ముందు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. జాబు రాకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు అధికారం చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని చెప్పారు. నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న హామీనీ అమలు చేయలేదన్నారు. కమలనాథన్ కమిటీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1.42 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలోని ఉపాధి కార్యాలయంలో నమోదైన నిరుద్యోగులు 52 వేల మంది ఉన్నారని తెలిపారు. వారంతా రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించి పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటూ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాదీ డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పారని, మూడేళ్లయినా ఆ ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 9 వేల పాఠశాలలను మూసివేశారని విమర్శించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.బాలసుబ్రహ్మణ్యం, పి.కిరణ్, నగర, రూరల్ కార్యదర్శులు ఉడతా ప్రసాద్, ఒంగోలు సుధీర్, డివైఎఫ్ఐ జిల్లా మహిళా కన్వీనర్ దేవి, నగర నాయకులు ఫయాజ్, నవనీతం పాల్గొన్నారు.

అన్ని కేడర్లకూ వేతనాలు పెంచాలి

- చంద్రన్న సంచార చికిత్స(104) ఉద్యోగుల దీక్షలు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- వినతి పత్రాల అందజేత



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 సిబ్బంది

ప్రజాశక్తి - యంత్రాంగం

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జిఒ 151 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు చేపట్టిన దీక్షలు సోమవారమూ కొనసాగాయి. 104 కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద చేపట్టిన దీక్షల్లో కూర్చున్న నాయకులు, ఉద్యోగులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కడపలో జరిగిన దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ.. జిఒ 151 ప్రకారం అన్ని కేడర్లకూ వేతనాలు పెంచాలన్నారు. చంద్రన్న సంచార చికిత్స పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని పేర్కొన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా డైలీఫుడ్ అలెవెన్స్ రూ.150 పెంచాలన్నారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం ప్రారంభించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు సంఘీభావం తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద దీక్షలో కూర్చున్న నాయకులు, ఉద్యోగులు ప్రభుత్వం తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతపురంలో దీక్షలకు మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వీరికి సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో రాష్ట్ర అసోసియేటెడ్ ప్రెసిడెంట్ వి.ఆర్.ఫణికుమార్, జిల్లా అధ్యక్షులు అన్రోజ్‌ఖాన్‌లు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ బి.లక్ష్మీకాంతంకు వినతిపత్రం అందజేశారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలనుద్దేశించి యూనియన్ గౌరవాధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడారు. అనంతరం జెడ్‌పి వరకూ ప్రదర్శన నిర్వహించి గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందచేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ ప్రారంభించారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షల్లో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యసారధి, కెజిహెచ్.నాగరాజు మాట్లాడారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలో 104 కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎన్.సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.



రజతోత్సవ సభలో ప్రసంగిస్తున్న హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రాహ్మణి

నాణ్యతకు మారుపేరు హెరిటేజ్ : బ్రాహ్మణి

ప్రజాశక్తి - చంద్రగిరి(చిత్తూరు)

హెరిటేజ్ డెయిరీ నాణ్యతకు మారుపేరని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కాశిపెంట్లలోని హెరిటేజ్ డెయిరీలో రజతోత్సవ వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాహ్మణి పాల్గొని ప్రసంగించారు. వెనుకబడిన రాయలసీమలో రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1992లో హెరిటేజ్‌ను స్థాపించారన్నారు. 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాడి రైతుల మధ్యనే రజతోత్సవ వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పాడి రైతుల కృషి, సిబ్బంది అకుంటిత దీక్షతోనే హెరిటేజ్ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఇంధన పొదుపులో నాలుగుసార్లు అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 15 లక్షల పాల సేకరణ నుంచి 30 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యాన్ని పెంచబోతున్నట్లు చెప్పారు. వినియోగదారులకు ఆరోగ్యం, పాడిరైతులకు ఆదాయం సిద్ధాంతాలతో హెరిటేజ్ పని చేస్తోందన్నారు. ఇప్పటివరకు తమ సంస్థ 2500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలామందికి ఉపాధి కల్పించిందన్నారు. పాల సేకరణ అధికారి తులసీనాయుడు స్వచ్ఛమైన, శుభ్రమైన కల్తీ లేని పాలను సరఫరా చేస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైతులకు గృహోపకరణాలు పంపిణీ చేశారు. ప్రమాదంలో గాయపడిన హెరిటేజ్ కుటుంబ సభ్యులకు బ్రాహ్మణి చేతులమీదుగా ఆర్థిక సహాయం అందజేశారు.

ఇద్దరు చిన్నారులకు గుండె ఆపరేషన్లు సక్సెస్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



ఆపరేషన్ చేసిన చిన్నారులతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు చిన్నారులకు కర్నూలు పెద్దాసుపత్రిలో గుండె ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. సోమవారం కార్డియో థొరాసిక్ వైద్యులు కె.ప్రభాకర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాటల్లో.. తెలంగాణాలోని అయిజ మండలం బైనపల్లికి చెందిన ఏడేళ్ల బాలుడు ఇమ్రాన్ 13 కేజీల బరువున్నాడు. జీవనోపాధి కోసం తల్లిదండ్రులు కర్నూలు నగరానికి వచ్చి గొందిపర్లలో ఉంటున్నారు. ఇమ్రాన్‌కు పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఏర్పడింది. 5 నెలల వయసు ఉన్నప్పుడు వైద్యులు గుర్తించారు. హైదరాబాదులో వైద్యం చేయించారు. నయం కాలేదు. స్థానికుల సలహా మేరకు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పరీక్షించి గుండెలోని రెండు కర్ణికల మధ్య 2 x 2 ఇంచుల పరిమాణంలో రంధ్రం ఉన్నట్లు గుర్తించారు. దీనిని ఏట్రియల్ సెప్టాల్ డిఫెక్ట్ అంటారు. 28న బైపాస్ సర్జరీ చేసి గుండె చుట్టూ ఉన్న పెరికార్డియం పొరలోని కొంత భాగాన్ని తీసుకుని రంధ్రాన్ని విజయవంతంగా పూడ్చివేశారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడు. రాజోలి మండలం తుమ్మిల్ల రాజు, మాణిక్యమ్మ దంపతులకు కవల పిల్లలున్నారు. 11 నెలల అరుణ్‌తేజ బరువు 4 కేజీలు. వీరిలో అరుణ్‌తేజ్‌కి దగ్గు, ఆయాసం అధికం కావడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చూపించారు. చిన్నారిని పరీక్షించిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేటెంట్ డక్టస్ ఆర్టిరియాసిస్‌గా గుర్తించి 29న ఆపరేషన్ పూర్తి చేసి చిన్నారి ప్రాణాలను కాపాడారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సదుపాయాలున్నాయని గుండెజబ్బులున్న వారు చెప్పుడు మాటలు నమ్మి ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు.

వైసిపి వైపు శిల్పా చక్రపాణిరెడ్డి

చర్చలు ప్రారంభించిన టిడిపి, వైసిపి నేతలు



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి సోదరుడు, టిడిపి ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి వైసిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో మద్దతును కూడగట్టుకునేందుకు శిల్పా మోహన్‌రెడ్డి చక్రపాణిరెడ్డి ఇంటికి వెళ్లి సోమవారం ఉదయం చర్చలు జరిపారు. ఇన్ని రోజులూ చక్రపాణిరెడ్డిని పట్టించుకోని టిడిపి నాయకత్వం ఆయనతో చర్చలకు పూనుకుంది. ఈ మేరకు మధ్యాహ్నం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, రాజ్యసభ్యులు సిఎం.రమేష్ చక్రపాణిరెడ్డితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి 2019 సాధారణ ఎన్నికలకు సంబంధించి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని అధిష్టానం నుంచి గట్టి హామీని ఇప్పిస్తే టిడిపిలోనే ఉంటానని తేల్చి చెప్పినట్లు సమాచారం. టిడిపి నాయకులు చక్రపాణిరెడ్డితో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు బయటికి పొక్కగానే వైసిపి అధిష్టామూ రంగంలోకి దిగింది. రాష్ట్ర నాయకులు బొత్స సత్యనారాయణ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలు సాయంత్రం చక్రపాణిరెడ్డిని కలిసి వైసిపిలో చేరి మోహన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరినట్లు తెలిసింది. సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి టిడిపిని వదలి వైసిపిలో చేరినప్పటి నుంచి టిడిపి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న శిల్పా చక్రపాణిరెడ్డి ఎన్నికల నోటిఫికేషన్ రాగానే తన రాజకీయ భవిష్యత్తు కోసం ముందుకు వెళ్తున్నట్లు సమాచారం. ఈనెల 3న నంద్యాలలో జగన్ పర్యటన సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి టిడిపిని వీడి వైసిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

సంపాదకీయం

స్పష్టత ఇవ్వాలి!

ప్రభుత్వ ఉద్యోగుల ఫండమెంటల్, పెన్షన్ రూల్స్‌ను సవరించేందుకు లోపల్లోపల గుంభనంగా ప్రయత్నాలు సాగుతున్నాయని, అందుకు ఐదు ఉత్తర్వులు (జీవోలు) ముసాయిదాల రూపంలో ప్రతిపాదనలో ఉన్నాయని మీడియాలో వస్తున్న వరుస కథనాలు ఉద్యోగులను బెంబేలెత్తిస్తున్నాయి. ఉద్యోగి సర్వీసును 30 ఏళ్లకు కుదించడం, 50 సంవత్సరాలు పైబడిన వారి పనితీరుపై నిరంతర సమీక్షలు, సంతృప్త స్థాయిలో లేకపోతే బలవంతంగా ఇంటికి పంపడం వంటి అనేకానేక దుర్మార్గ నిబంధనలు బయటికి వెల్లడైన సదరు ముసాయిదా జీవోల్లో చోటు చేసుకున్నాయి. మసాయిదా ప్రకారం... 35-40 ఏళ్ల వయసు లోపు ఉద్యోగంలో చేరిన వారి పనితీరును వారికి యాభై సంవత్సరాలు నిండిన దగ్గర నుంచి అంచనా వేస్తారు. 40 సంవత్సరాల తర్వాత సర్వీసులో చేరిన వారి పనితీరును వారికి 55 ఏళ్లొచ్చిన నాటి నుంచి సమీక్షిస్తారు. అప్పటికి గడచిన పదేళ్లలో అవినీతి ఆరోపణలు, నిజాయితీ, సమర్ధత, పనితీరు అంశాలను సమీక్షకు ప్రాతిపదికగా చేసుకున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో విభాగాలవారీగా ఏర్పాటు చేసే విజిలెన్స్ కమిటీలు నిర్దేశిత సమయం నుంచి ఉద్యోగులపై నిరంతరం అంచనాలు కడతాయి. కొలబద్దలను అందుకోకపోతే మూడు నెలల జీతభత్యాలు చెల్లించి కొలువు ఊడబీకి ఇంటికి పంపుతారు. ఎలాంటి షోకాజ్ నోటీసులూ, చర్చలకు తావు లేదు.

ఇంత దారుణమైన రూల్స్ మన ఉద్యోగులకు బ్రిటిష్ వలస పాలనలో కూడా ఎదురై ఉండవు. నియంతల ఏలుబడిలోనే ఇలాంటి ఘోరాలు జరుగుతాయి. ప్రజలకు మంచి పరిపాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే ఉద్యోగుల్లేకుండా పాలన అందించడం జరగనిపని. ఉద్యోగుల పనితీరును మెరుగు పర్చేందుకు ఎన్నో మార్గాలున్నాయి. అవగాహన, చైతన్యం, శిక్షణ వంటివి చేపట్టి ఉద్యోగుల సమర్ధతను క్రమంగా మెరుగు చేయవచ్చు. అదేమీ లేకుండా ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకుమల్లే ఇష్టమొచ్చిన రీతిలో రూల్స్ పెట్టి ఉద్యోగులను బలవంతంగా తొలగించాలనుకోవడం అమానవీయం.

ఉద్యోగుల మెడపై పెర్ఫార్మెన్స్ కత్తి వేలాడదీసిన సర్కారుకు ఆ రహస్యం బయటపడేసరికి ఏం చేయాలో పాల్పోవట్లేదు. ముసాయిదా జీవోలు ఆర్థిక, న్యాయ, సాధారణ పరిపాలనాశాఖల ఆమోదం పొందాయని సాక్ష్యాధారాలతో సహా మీడియాలో పేర్కొనగా, తిమ్మినిబమ్మిని చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి యనమల పొంతనలేని ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యం. 'ఇంకా నేను సంతకం చేయలేదు, కేబినెట్ ఆమోదించలేదు, జీవో రాలేదు' అంటూ యనమల తప్పించుకోజూశారు. సిఎం అయితే వందంతులు నమ్మవద్దని, ఉద్యోగులపై తమకు వల్లమాలిన ప్రేమ ఉంది కాబట్టే రిటైర్మెంట్ వయసును 58 నుంచి 60 ఏళ్లకు పెంచామని అరిగిపోయిన రికార్డు వేశారే తప్ప ముసాయిదా జీవోలపై స్పష్టత ఇవ్వలేదు. అసలు ప్రభుత్వంలో ఆ ప్రతిపాదన ఉందా లేదా అనే విషయాన్ని ఇద్దరు ప్రభుత్వ ముఖ్యులూ దాస్తున్నందున ఉద్యోగుల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. కొంత మంది గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నేతలు సైతం తాము సిఎంకు ఫిర్యాదు చేశామంటున్నారు. దానర్థం ఏదో ఒక చోట ప్రతిపాదన ఉన్నట్లేగా? అసలు నిప్పే లేకపోతే పొగ రాదు కదా? ఈ సాధారణ సూత్రాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదంటే ఉద్యోగులను మోసం చేయడమే కదా?

తొమ్మిదేళ్లు సిఎంగా పని చేసిన చంద్రబాబును ప్రజలు పదేళ్లు ప్రతిపక్షానికి పరిమితం చేసింది ప్రపంచబ్యాంక్ ఆదేశిత విధానాలు అమలు చేసినందునే. తాను మారానని నమ్మించారు తప్ప అప్పటికీ ఇప్పటికీ ఏ మాత్రం మార్పు లేదని తన ప్రజావ్యతిరేక విధానాలతో నిరూపిస్తున్నారు. ప్రపంచబ్యాంక్ చెప్పిందని గతంలో శాశ్వత ఉద్యోగులను తగ్గించారు. నియామకాలు నిలిపేశారు. ఆయన కాలంలోనే ఔట్‌సోర్స్, కాంట్రాక్టు పురుడుపోసుకున్నాయి. ఎపి వ్యాన్, ఎపి స్వాన్‌లను అమలు చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మేందుకు సచివాలయంలో ప్రత్యేకంగా 'ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్' అనే విభాగాన్ని తెరిచారు. తన విధానాలతో ఉద్యోగులకు దూరమైన చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడానికి ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగుల పర్మినెంట్ వంటి హామీలిచ్చారు. మూడేళ్లలో నవ్యాంధ్రలో కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వాగ్దానం నెరవేర్చకపోగా వేలాది మందిని తొలగిస్తున్నారు. బాబు వస్తే జాబు వస్తుందన్న ఆయన ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ ఉద్యోగులను తొలగించేందుకు మంత్రాంగం సాగించడం ఘోరం. 'ఉద్యోగుల పనితీరు' జీవోల వలన మూడు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఒకటి తనకు నచ్చిన వారిని ఉంచుకొని నచ్చని వారిని బయటకు పంపవచ్చు. రెండు పెర్ఫార్మెన్స్ సాకుతో భయపెట్టి అనుకూలంగా లోబర్చుకోవచ్చు. మూడు ఉద్యోగులను తగ్గించవచ్చు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 58 నుంచి 55కు తగ్గించి ఎన్టీఆర్ చెయ్యి కాల్చుకున్నారు. ఉద్యోగులు, యువతతో పెట్టుకున్న చంద్రబాబు దశాబ్దంపాటు అధికారానికి దూరమయ్యారు. చంద్రబాబు గత అనుభవాలను గుణపాఠాలుగా తీసుకుని ఇప్పటికైనా ఉద్యోగుల ప్రభుత్వం 'పెర్ఫార్మెన్స్' జీవోలపై స్పష్టత ఇవ్వాలి.

మహనీయుల మాట



పేదరికం ఉన్నంత వరకూ నిజమైన స్వాతంత్ర్యం ఉండదు.
- నెల్సన్ మండేలా

జోహార్ కామ్రేడ్ సూర్జీత్



నేడు 9వ వర్ధంతి

జననం : మార్చి 23, 1916 మరణం : ఆగష్టు 1, 2008

గ్రామీణ భారతం వెలిగిపోవాలంటే...

ప్రజాగళం

కేంద్రంలోని బిజెపి విధానాలు గ్రామీణ జీవనానికి తీవ్ర అవరోధంగా మారాయి. పశుసంపదకు, వ్యవసాయానికి తగిన ప్రోత్సాహకాలు ఇస్తూ దేశ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలాగా కేంద్రం గాని రాష్ట్ర ప్రభుత్వాలు గాని చూడటం లేదు. పంట వచ్చినప్పుడు అవసరమైన మార్కెటింగ్ పెంపుదల, పంటకు మద్దతు ధర లేనప్పుడు స్టోరేజ్‌ల ఏర్పాట్లు వంటివి చేయడం లేదు. అసలు రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు. ఎటువంటి ప్రతికూల పరిస్థితులనైనా రైతు తట్టుకోవాలంటే గతంలో వున్న నిల్వ కేంద్రాలను పెంచాలి. అదనపు పంట వచ్చినప్పుడు ముఖ్యంగా కూరగాయల పంటల్లో కోల్డు స్టోరేజ్ అవకాశం లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వాటిని సన్‌రైజ్ టమాటాల్లాగా (ఇతర దేశాల్లో) వరుగులు చేసి, రైతుబజార్లో కూరగాయల్లాగా అమ్మే విధానాలు ప్రోత్సహించడం లేదు. గత దశాబ్ద కాలంగా వరుగుల తయారీకి డ్రయ్యర్లు ఏర్పాటు చేయకపోవడమే దీనికి కారణం. అంతేకాక గో సంరక్షణ పేరుతో అనేక వక్ర మార్గాలను అమలు చేస్తున్నారు. బిజెపి విధించిన గోవధ నిషేధంతో ఎంతోమంది పశువుల క్రయ, విక్రయాలకు అనుమతి కోల్పోయారు. మున్ముందు పశువులను పెంచుకునేం దుకు కూడా వెనకాడే పరిస్థితి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ విధానాలతో బిజెపి అన్ని రకాలుగా గ్రామాల ఉత్పత్తి మార్గాలను నిరోధిస్తోంది. ఇకనైనా ఈ కుత్ర మార్గాలకు స్వస్తి పలకాలి. గ్రామీణ భారతం మెరుగుపడేలా కృషి చేయాలి.

- రాము, విజయవాడ.

ప్రోత్సాహం వుంటే మరింత మంది 'మిథాలీ'లు

నేడు దేశంలో ఎక్కడ చూసినా వినిపిస్తున్న పేరు మిథాలీరాజ్! ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చి భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించిన హైదరాబాదీ. మహిళలు అంటే వంట గదికే పరిమితమని చెప్పిన మనువాదులకు మహిళలే దేశానికి ఆదర్శం అనేలా మిథాలీసేన గుర్తుచేసింది. పురుషులతో సమానంగా రాణిస్తున్న ఈ జట్టును చూసి మనువాదులు మేల్కొనాల్సిన అవసరం ఆసన్నమైంది. నేడు మిథాలీరాజ్, ఝులన్ గోస్వామి, స్మృతి మందన, హర్మన్ ప్రీత్‌కౌర్ వంటి క్రీడాకారిణులపై ప్రతి ఒక్కరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నాయా? మిథాలీరాజ్ లాంటి అమ్మాయిలు మన దేశంలో చాలా మంది వున్నారన్నది గమనంలో వుంచుకోవాలి. వారిని గ్రామీణ స్థాయి నుండి క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారా? కేవలం క్రికెట్‌లోనే కాదు అన్ని క్రీడల్లో ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టి క్రీడల్లో ప్రోత్సహించాలి. మహిళల రక్షణకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, హెల్ప్‌లైన్ కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, మహిళా ప్రాంగణాలు, ఆత్మరక్షణ శిక్షణా కేంద్రాల ఏర్పాటు మొదలైన వాటి కోసం చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక విద్య నుంచే బాలికలకు ప్రత్యేక క్రీడాస్థలాలు, ఆత్మరక్షణ విద్యలు, క్రీడల్లో మహిళలకు మొదటి ప్రాధాన్యత అందించేటట్లు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి. ఇప్పటికీ అనేక గ్రామాల్లో బాల్య వివాహాలు పెద్దసంఖ్యలో జరుగుతున్నాయి. ఈ కారణంగా ఎందరో ఆడపిల్లలు ఉన్నత చదువులకు దూరమౌతున్నారు. వీటిని ఆపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు గుళ్ళు,గోపురాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా మహిళాసాధికారతకు కృషి చేయాలి. పురుషులతో పాటు మహిళలకు చదువుల్లోనే కాక క్రీడల్లోనూ ప్రాధాన్యత కల్పించాలి. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను భారంగా భావించక మిథాలీరాజ్, పివి సింధు, మాలావత్ పూర్ణలుగా ఎదగడానికి ప్రోత్సహించాలి.

- దొడ్డి మల్లేష్

ముందస్తు చర్యలతో ఆరోగ్యం

మలేరియా, విషజ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్ చికున్‌గున్యా, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు ఏటా వందల మందిని బలి తీసుకుంటున్నాయి. నిరక్షరాస్యత, పౌష్టికాహార లోపం, రక్షిత మంచినీటి కొరత, పరిసరాల పరిశుభ్రత అవగాహనాలేమి ఒక ఎత్తయితే మూఢ నమ్మకాలతో మన్యం ప్రాంతాల ప్రజలు వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుని బలైపోతున్నారు. మరణాలు సంభవించినప్పుడు చుట్టం చూపుగా అధికారులు వస్తున్నారు. అప్పుడప్పుడు వచ్చే పాలకుల మెప్పు పొందడానికి సిబ్బంది చేసే హంగామా అంతా ఇంతా కాదు. ఆసుపత్రి చుట్టూ ముగ్గు చల్లడం, మంచాలపై ఉతికిన దుప్పట్లు పరచటం, గదుల్లో ఫినాయిల్ సువాసనలు వెదజల్లేలా లేని పోని హంగులు చేస్తారు. అయితే నిరంతరం ఈ విధమైన ముందస్తు చర్యలు తీసు కుంటూ, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమల నిర్మూలన, పందులు, కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలి. సంచార వైద్య వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తే ఎటువంటి వ్యాధులనైనా సరే ప్రారంభ దశలోనే అరికట్టవచ్చు.

- యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం.

వెంకయ్య 'టాక్ షో' - నిజానిజాలు



తెలకపల్లి రవి

సందర్భం

ఎన్‌డిఎ తరపున ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తున్న ముప్పవరపు వెంకయ్య నాయుడు తెలుగునాట ముఖ్య నగరాలన్నిటా హంగామా చేస్తూ పర్యటిస్తున్నారు. ఆయన వల్ల ప్రయోజనం పొందిన, పొందాలనుకుంటున్న రాజకీయ వ్యాపార వేత్తలు, ఆయన మూల కుదురు బిజెపి ఆరెస్సెస్ ప్రముఖులు పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనాలు అభినందనలూ నిర్వహిస్తున్నారు. పెద్ద పదవి లోకి వెళుతున్నారు గనక సన్నిహితులూ సంస్థలూ ఏదో చేస్తున్నాయంటే అదో తీరు. కాని ఈ సభలన్నిటిలోనూ ఆయన తప్పని సరిగా రెండు మూడు వివాదాస్పద విషయాలు ప్రచారం చేసుకుంటున్నారు. బిజెపి పరంగానూ, రాష్ట్రాలకు రావలసినవి సాధించే విషయం లోనూ, తన కుటుంబంపై వచ్చిన ఆరోపణల రీత్యానూ కూడా ఏకపక్షంగా మాట్లాడుతూ అదే పరమ సత్యమైనట్టు చలామణి చేసుకుంటున్నారు. మధ్య మధ్య తనవైన మసాలా పలుకులూ కన్నీటి సెంటిమెంట్లు కూడా దట్టిస్తున్నారు.

పెద్ద దిక్కు ఎవరికి?

వెంకయ్య ఉపరాష్ట్రపతి పదవి లోకి వెళ్లడంతో కేంద్రంలో తెలుగు వారికి పెద్ద దిక్కు లేకుండా పోయిందనే మాట అన్నిటికన్నా పెద్ద అవాస్తవం. విభజన సమయంలో తానే పదే పదే పట్టుబట్టి సాధించానని చెప్పుకుని ఎన్నికల ప్రణాళిక లోనూ వేసుకున్న ప్రత్యేక హోదాను మోడీ ప్రభుత్వం ఆదిలోనే సమాధి చేసినా వెంకయ్య అందు కోసం చేసింది పూజ్యం. నిజానికి ఆ అవకాశం లేదని తనే మొదట సన్నాయి నొక్కులు మొదలు పెట్టి తర్వాత వస్తుందని అనేక విధాల ఆశపెట్టి విశ్వసనీయత పోగొట్టుకున్నారు. తను చూసే పట్టణాభివృద్ధిశాఖ తరపున కొన్ని నిధులు విడుదల చేయించి అదే ప్రత్యేక సహాయం పద్దుల్లో చూపించేందుకు సిద్ధమైనారు. ఇదంతా విలువలు గల ఏ నాయకుడూ ఇన్ని పిల్లిమొగ్గలు వేయరు.ప్యాకేజీ అన్నది మిథ్య గనక కేంద్రం నుంచి ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వంటివారు ఆసక్తి చూపకపోయినా వెంటపడి వారిని రప్పించి చెప్పించి మసి పూసి మారేడు కాయ చేశారు. ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్నా కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలూ హానికర చర్యలపై బిజెపి నేతలు కూడా మండిపడుతుంటే తను మాత్రం ముఖ్యమంత్రి చంద్రబాబును అదేపనిగా పొగుడుతూ, పొగిడించుకుంటూ పరస్పర భజన సాగించారు. కేంద్రం నుంచి రెవెన్యూ లోటు గాని, రాజధానికి సహాయం గాని ఏ ఒక్కటి కనీసం సగమైనా రాకున్నా వచ్చినట్టే చెప్పేస్తూ వూరూరా సత్కారాలు చేయించుకున్నారు. ఈ క్షణంలో పోలవరంపై ఖర్చు పెట్టిన మూడు వేల కోట్లు ఇవ్వాలని రాష్ట్రం వెంటపడుతుంటే పట్టించుకునే దిక్కులేదు. డిపిఆర్‌లు కావాలని ఢిల్లీ నిలిపేస్తుంటే వాటిని పంపాలని రాష్ట్రాన్ని ఒత్తిడి చేస్తున్నదీ లేదు. ఎపికి చేసింది లేకపోయినా అంతా అక్కడికే ఇస్తున్నారని ఆరోపించే పరిస్థితి కల్పించింది మాత్రం వెంకయ్యే. తెలంగాణకూ పెద్దగా చేసింది లేదన్నది నిజం. అసలు నేను బయిటి రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యాను తప్ప తెలుగు రాష్ట్రాల ప్రతినిధినే గానని ఆయన చాలాసార్లు ప్రకటించారు. మరి వందిమాగధుల దృష్టిలో ఇవన్నీ వుండకపోవడం విచిత్రమే. ఢిల్లీలో ఆశ్రిత వర్గాలకు అస్మదీయులకు మాత్రం ఆయన పెద్ద దిక్కు అన్నది నిజం కావచ్చు గాని ప్రజల రాష్ట్రాల కోణంలో అంతగా పొగడాల్సింది లేదు. ప్రత్యేక హోదాకే దిక్కులేకపోయాక ఇలా చెప్పుకోవడం కూడా ఆశ్చర్యమే.

తెలుగు ఘనుడు ఈయనేనా?

తెలుగు వారు చాలామంది కాంగ్రెస్ కమ్యూనిస్టు జనతా పార్టీలలో ప్రాంతీయ పార్టీలలో జాతీయ ఖ్యాతి గడించారు. రాజనీతిజ్ఞులు, యోధులు అనిపించుకున్నారు. వారితో పోలిస్తే వెంకయ్య పాత్ర చిన్నది. విధానాలు పార్టీలూ వేర్వేరైనా నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, ఆచార్య రంగా, కొత్త రఘురామయ్య, ఎన్‌టిఆర్, పివి నరసింహారావు వంటి వారితో పోలిస్తే వెంకయ్య తక్కువే. తన సమకాలికులైన జైపాల్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, కెసిఆర్ తదితరులు (కాస్త ముందూ వెనకగా వచ్చిన వామపక్ష నేతలు కూడా) తక్కువ వారేమీ కాదు. వీళ్లలో చాలా మంది లౌకిక రాజకీయ పక్షాలలో పని చేస్తే వెంకయ్య మాత్రం ఆరెస్సెస్‌ను ఆశ్రయించుకుని గడిపారు. అది కూడా వాజ్‌పేయి నుంచి మోడీ వరకూ ఎవరు పైన వుంటే వారికి వంత పాడుతూ పబ్బం గడుపుకున్నారు. ఒకవైపున మోడీకి ఆయనంటే పడదని ప్రచారం జరుగుతుంటే మరోవైపున తనే ఆయనను దేవుడు, దేవదూత అంటూ పొగడ్డం తెలుగువారికి పరువు తక్కువ వ్యవహారమే. తను రెండుసార్లు శాసనసభకు గెలిచిన సంగతి తరచూ చెబుతుంటారు గాని 1978లో జనతా పార్టీ వూపులో నెగ్గారు. ఇక 1983 ఎన్టీఆర్ ప్రభంజనంలో నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్ భూస్వాములు కావాలని పార్టీలకు అతీతంగా ఆయనకు ఓటేశారన్నది వాస్తవం. ఇక ఎన్టీఆర్‌ను తొలగించినప్పుడు తనే వెంట వుండి మళ్లీ పునఃప్రతిష్టించినట్టు చెప్పుకోవడం ఆయనకే చెల్లింది. అప్పటికాయన ఒకే ఒక్క యువ శాసనసభ్యుడు. అండగా నిలిచింది కమ్యూనిస్టు నాయకులూ, ప్రధానంగా బెంగాల్ లోని జ్యోతిబసు ప్రభుత్వం, కర్ణాటక లోని రామకృష్ణ హెగ్డే ప్రభుత్వం. ఇప్పుడు టిడిపితో కలసి వున్నారు గనక అంతా తమ ఖాతాలో వేసుకుంటే కుదిరేపని కాదు. రాష్ట్రంలో తనకంటూ పట్టు లేదు గనక ఇతర చోట్ల నుంచి గెలిచి పదవి కాపాడుకుంటూ వచ్చారన్నది బహిరంగ రహస్యం.

అంతర్గత వాస్తవాలు

వెంకయ్య నాయుడు బిజెపిలో ఎల్‌కె అద్వానీ అనుయాయిగా పైకి వచ్చారు. వరుస రాజీనామాలతో బిజెపి సంక్షుభితమైనప్పుడు తరుణోపాయంగా ఆయన అధ్యక్షులైనారే గాని రాజ్‌నాథ్ సింగ్ లాగా కనీసం నితిన్ గడ్కరీ లాగా స్వంత పునాదితో కాదు. పైగా అప్పుడు హేమాహేమీలైన ఇద్దరి మధ్యనా ఆయన చేయగలిగిందీ లేదు. వాజ్‌పేయి ప్రధానిగా వున్నప్పుడు వారిద్దరినీ 'లోహ పురుష్, వికాస్ పురుష్' అని చెప్పి ఆయన ఆగ్రహానికి గురైనారు కూడా. మోడీ కూడా అద్వానీ చాటునే పెరిగి ఆయనకే ఎసరు పెట్టారు. ఈ ఝుంఝాటంలో వెంకయ్య అద్వానీకి దూరమైనా మోడీ విశ్వాసాన్ని మాత్రం సాధించలేదు గనకే అతిగా పొగుడుతూ పదవి కాపాడుకున్నాననుకున్నారు. కాని మోడీ అలా అనుకోలేదు గనకే అదను చూసి అప్రధాన స్థానంలోకి నెట్టారన్నది ఆ పార్టీలో ఎవరినడిగినా చెప్పే విషయం. దానికి ముందు రాష్ట్రపతిగా వెంకయ్య పేరు పరిశీలనలో వుందని అనుకూల మీడియా వూరికే వూదరగొట్టింది. ఇటీవలి సమావేశాల్లో ఆయనా చెబుతున్నారు. అయితే విలువైన సహచరులను వదులుకోలేనంటూ మోడీ ఆ ప్రతిపాదనను తిరస్కరించారట. ఉపరాష్ట్రపతిని చేయడానికి వదులుకుంటారు గాని రాష్ట్రపతిని చేయడానికి వదులుకోరా? ఈ మాటల్లో నిజమెంతో వేరే చెప్పాలా? తనకు ఉప పదవి ఇష్టం లేదని వెంకయ్య ఏడాది ముందే మొత్తుకున్నారు. మొర పెట్టుకున్నారు. జాతీయ పత్రికల్లో చాలా వివరంగా ఆయన నోటివెంటనే ఆ మాటలు ప్రచురించ బడ్డాయి. మొన్నటి ఎంపిక సమయంలోనూ ఆయన ఆక్రోశించినా మోడీ అమిత్ షా ద్వయం ఇసుమంతైనా పట్టించుకోలేదు. ఆ ఎంపిక జరిగిన సమయంలో ఆయన హావభావాలు (బాడీ లాంగ్వేజ్) చూసిన వారెవరికైనా ఎంత ఇబ్బందిగా వున్నారో అర్థమైపోతుంది. నాలుగు రాజ్యాంగ పదవుల లోనూ సంఘీయులే వుండాలన్న ఆరెస్సెస్ సూత్రానికి ఈ ఎంపిక సరిపోయింది గాని ఇప్పుడు ఆయన ప్రత్యక్ష రాజకీయ పాత్ర నిర్వహించగలిగింది లేదు. జాకీర్ హుస్సేన్, నారాయణన్, అన్సారీల వలె ఆయన వివాద రహిత రాజకీయ వేత్త కాదు. కనీసం వాజ్‌పేయి లాంటి పట్టువిడుపులైనా వున్నవారు కాదు. వెంకయ్య వాక్చాతుర్యం గురించి, ఉపన్యాస ధాటి గురించి చాలా మంది చెప్పే దాంట్లో కొంత నిజముండొచ్చు గాని విషయ పరంగా విజ్ఞత కన్నా వివాదాలే జాస్తి. కన్నయ్య కుమార్ వంటి విద్యార్థి నేతపైన, అర్థంతరంగా దూరమైన రోహిత్‌పైన కూడా విషం గక్కగల కరుడుగట్టిన ఆరెస్సెస్ ప్రతినిధి. అలాంటి వ్యక్తి నోరు కట్టేసుకుని వుండటం, రాజకీయ జోక్యాలు చేసుకోకుండా చేతలు కట్టేసుకోవడం ఆయనకు పరీక్ష ప్రజలకు ఉపశమనం అనుకోవాలి.

ఆరోపణలు కాదు, నిజాలే!

చివరగా ఆత్మీయ సత్కారాల్లో కూడా ఆరోపణలకు సమాధానమివ్వడం ఆయనకే చెల్లింది. ఇంతా చేసి అవి నిజం కాదని చెప్పింది లేదు. నెల్లూరు జిల్లాలో భూపరిమితి చట్టం కింద దళితులకు పంచాల్సిన భూములు తీసుకున్నట్టు వార్తలు వచ్చాక వెనక్కు ఇచ్చేసినట్టు ఆ రోజుల్లో చెప్పుకున్నారు. తెలంగాణ వచ్చాక 300 వాహనాలను ఆయన కుమారుడి డీలర్ షిప్‌లో కొన్నట్టు ప్రభుత్వం కూడా అంగీకరించింది. ఎటొచ్చి యుపిఎ నిర్ణయించిన రేటుకే ఇన్నోవా కంపెనీ ద్వారా మాత్రమే కొన్నారన్నది సమర్థన. ఆయన కుమార్తె నిర్వహించే స్వర్ణభారత్ ట్రస్టు(నిజానికి ఆయన పర్యటనల్లో సగం ఈ సంస్థ కార్యకలాపాలకే) కు కెసిఆర్ ప్రభుత్వం రెండు కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చిన మాట కూడా నిజమేనని తేలింది. దేశంలో ఎన్‌జివోలపై మోడీ ప్రభుత్వం విరుచుకు పడుతున్న సమయంలో ఇది మరీ ఆసక్తికరం. ఈ ట్రస్టుకు విదేశీ నిధులు రావడం లేదని వెంకయ్య అంటున్నా బడా వ్యాపారవేత్తలు చాలా మంది స్థలాలు భారీ విరాళాలు ఇచ్చి నడిపిస్తున్న మాట నిజం. ఆ భవనం విస్తీర్ణం నిర్మాణ వ్యయం కూడా తక్కువగానే చూపారని ఒక ఆరెస్సెస్ నాయకుడే నాతో అన్నారు. పెద్ద వయసులో పెద్ద పదవిలో కాలక్షేపం చేస్తే అదో తీరు గాని 'బ్రేక్‌లెస్ టాక్ షో'లు నడపడం అనవసరం. అలాగే వాటిపై ఇంతకన్నా విశ్లేషణ కూడా అనవసరమే. ఇదైనా కేవలం వాస్తవాల నమోదు కోసం మాత్రమే!



తెలంగాణ వచ్చాక 300 వాహనాలు ఆయన కుమారుడి డీలర్‌షిప్‌లో కొన్నట్టు ప్రభుత్వం కూడా అంగీకరించింది. ఎటొచ్చి యుపిఎ నిర్ణయించిన రేటుకే ఇన్నోవా కంపెనీ ద్వారా మాత్రమే కొన్నారన్నది సమర్థన. ఆయన కుమార్తె నిర్వహించే స్వర్ణ భారత్ ట్రస్టు (నిజానికి ఆయన పర్యటనల్లో సగం ఈ సంస్థ కార్యకలాపాలకే) కు కెసిఆర్ ప్రభుత్వం రెండు కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చిన మాట కూడా నిజమేనని తేలింది. దేశంలో ఎన్‌జివోలపై మోడీ ప్రభుత్వం విరుచుకు పడుతున్న సమయంలో ఇది మరీ ఆసక్తికరం. ఈ ట్రస్టుకు విదేశీ నిధులు రావడం లేదని వెంకయ్య అంటున్నా బడా వ్యాపారవేత్తలు చాలా మంది స్థలాలు భారీ విరాళాలు ఇచ్చి నడిపిస్తున్న మాట నిజం.

మోడీ ఏం చెప్తున్నారు? ఏం చేస్తున్నారు?

డాక్టర్ కత్తి పద్మారావు



దర్పణం

భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మన్ కీ బాత్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ 'క్విట్ ఇండియా స్ఫూర్తితో 2017 నుంచి 2022 లోపు దేశాన్ని పట్టి పీడిస్తున్న మతతత్వం, కులవాదం, ఉగ్రవాదం, అవినీతి, పేదరికం, మురికిని తరిమివేద్దాం. ఐదేళ్ళలో సరికొత్త భారతాన్ని నిర్మించుకుందాం..' అని పిలుపునిచ్చారు. నిజానికి భారతదేశం ఈనాడు మోడీ పరిపాలనలో రోగగ్రస్తమైంది. మోడీ అధికారానికి వచ్చిన తర్వాత పొగాకు మీద వచ్చే వ్యాధులకే మనం రు.16,500 కోట్లు ఖర్చు పెడుతున్నాం. పొగాకు ద్వారా భారతదేశానికి వస్తున్న ఆదాయం రు. 21 వేల కోట్లు. అంటే సుమారు నాలుగు వేల కోట్ల రూపాయల కోసం మనం ప్రజలను ఎందరినో బలిస్తున్నాం. మరి ఆరోగ్య భారతాన్ని రూపొందించాలంటే పొగాకు ఉత్పత్తులను, పొగాకు తాగడాన్ని మోడీ ఎందుకు నివారించలేకపోతున్నారు? అస్పృశ్యతా నివారణకు ఏవిధ మైన చర్యలు తీసుకున్నారో చెప్పాలి. గ్రామ బహిష్కరణలు, గోరక్షణ బృందాల హింసలు, స్త్రీలపై విపరీతమైన దాడులు కొనసాగిస్తూ ఈ ఐదు సంవత్సరాల్లో కుల నిర్మూలన చేస్తాననడం హాస్యాస్పదం. భారతదేశంలో మతోన్మాదం పెరగటమే కాక మత ఉద్రిక్తతలు ఆయన పాలనలో పెరుగుతున్నాయి. ఈ రోజున ప్రతి వంద మందికి 25 మంది నిరుద్యోగులు గా ఉన్నారు. మోడీ వచ్చిన తర్వాత యువకుల్లో అభద్రత పెరిగింది. పెద్దనోట్ల రద్దు తర్వాత కూలీలు, పేదలు, వృత్తిదార్లు, గుండెకోతకు గురయ్యారు. రూపాయి దొరకక అల్లాడారు. నల్ల కుబేరులంతా రక్షించబడ్డారు. చేనేత పరిశ్రమ కుంటుపడింది. మిల్లు వస్త్రాల జోరు పెరిగింది. బహుళ జాతి కంపెనీలు ఇతర దేశాల నుంచి ఇబ్బడి ముబ్బడిగా వస్త్రాలను దిగుమతి చేస్తున్నాయి. చేనేతలో ఉన్నవారికి కూలీ గిట్టడం లేదు. ఈ రోజున చేనేత కార్మికులు ఎంత కష్టపడినా నెలకు 2 వేలు రూపాయలు కూడా సంపాదించలేక పోతున్నారు. 15 వేల సహకార సంఘాలున్నా ఆదరణ లేదు. ఇక జిఎస్‌టి గురించి చెప్తున్నాడాయన! రాష్ట్రాల హక్కులను రద్దు చేసుకుంటూ వెళ్ళి, కేంద్రాల పట్టును పెంచుకుని, రాష్ట్రాలను సామంతులుగా మార్చుకుని ఫెడరల్ నిర్మాణాన్ని కూల్చాలన్నదే నరేంద్ర మోడీ ఎత్తుగడని మనకు అర్థమవుతోంది. ఇక ఆయన ప్రచారం చేసుకుంటున్న జన్ ధన్, భారత్ నెట్, ఉజాలా, భూసార కార్డులు, ముద్ర, గర్వ్, జన సురక్ష, ఉజ్వల పథకాలన్నీ ఆర్భాటానికే కాని అక్కడ ప్రజలకు ఒరుగుతున్నదేమీ లేదని అందరికీ తెలుసు. భారతదేశాన్ని పునర్నిర్మించాంటే ఉత్పత్తిని పెంచాలి, అందరికీ పని కల్పించాలి, యువకుల్లో నూతనోత్తేజం కల్పించాలి. వ్యవసాయ ఉత్పత్తులను విస్తృతం చేయాలి. అటువంటి ఉత్పత్తి చేసే సాంకేతిక నిపుణులను, జ్ఞానులను పక్కన పెట్టి, ఆరెస్సెస్ వాళ్ళందరికీ పదవులిస్తూ అసలు భారతదేశ పునాదులే తెలియని వారిని అనుచరులుగా పెట్టుకుంటూ ఎలా భారతదేశాన్ని అభివృద్ధి చేయగలరని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు భారతదేశానికి ఆయువు పట్టు అయిన గిరిజనుల ఆవాసాలను, నివాసాలను, వనరులను ప్రపంచ దేశాలకు తాకట్టు పెడుతున్న మీరు భారతదేశ మూలాలపై దెబ్బవేస్తున్నారా? భారతదేశాన్ని పునర్నిర్మించే కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నారా? అని ఇవాళ భారతదేశం మొత్తంగా మిమ్మల్ని ప్రశ్నిస్తుంది.

భారతదేశంలో 17 కోట్ల మంది ముస్లింలు ఉన్నారు. వారిలో మేధావులు, ఆలోచనాపరులు, తాత్వికులు, నిర్మాణ కర్తలు, ఎందరో ఉన్నారు. మరి వారందరి సేవలను ద్వేషంతో, మాత్సర్యంతో, క్రోధంతో మీరు నిరాకరిస్తే భారత దేశం ఎలా అభివృద్ధి చెందుతుంది. వారందరూ తయారుచేసే చిన్న చిన్న వస్తువుల మార్కెట్‌ను దెబ్బతీయాలని చూస్తే భారతదేశంలో సుదీర్ఘకాలం పరిపాలించిన మొఘలులు కాని హిందూ ద్వేషం చూపించి వుంటే భారతదేశ పరిస్థితి ఏమై ఉండేది? ముస్లింలు సాంకేతిక నిపుణులు, శ్రమజీవులు. వారిని ద్వేషించి మీరు భారతదేశాన్ని ఎలా అభివృద్ధి చేయగలరు? ఏ జాతిని ద్వేషించినా సంపద వారిలో ఉండే మహోన్నతమైన శిల్ప నైపుణ్యాలు మనకు అందవు కదా!



ఇకపోతే భారతదేశంలో అనేక భాషలు, జాతులను మీరు నిరాకరిస్తున్నారు. కేవలం హిందీనే అందరిపై రుద్దాలని చూస్తున్నారు. భాష కూడా ఒక ఉత్పత్తి సాధనమే. సవరులు, గోండులు, కోయలు, కొండదొరలు ఎందరో తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తెచ్చి అనుకూలించని పరిస్థితుల్లో ఉన్నారు. దేశీయ ఉత్పత్తులన్నీ ధ్వంసం అయిపోతుంటే మీరు ప్రపంచ మార్కెట్‌కు ద్వారాలు తెరుస్తున్నారు. భావపరంగా జనాభా నిష్పత్తిని బట్టి సీట్లు ఇవ్వాల్సిన మీరు మొన్న ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో ఒక్క ముస్లింకు కూడా సీటు ఇవ్వలేదు. ముస్లింలలో అనేక మంది దళితులు, బీసీలు ఉన్నారు. వారందరికీ సీటు ఇవ్వకపోవటం కులతత్వం కాదా అని సామాజిక శాస్త్రవేత్తలు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. సుమారుగా 21 శాతం ఉన్న దళితులను ఉప కులాలుగా చీల్చి పేకముక్క లాట ఆడారు. ఉత్తరప్రదేశ్‌లో 19 శాతం ఉన్న ముస్లింలపై శతృత్వాన్ని ప్రకటించారు. అంటే కుల, మతతత్వం లేనట్టా! పైగా దళిత ముస్లింల ఓట్లు ఆశించకుండా, అగ్రవర్ణాలను సమీకృతం చేశారు. అంటే మీకు కులం లేనట్టా! కులాన్ని నిర్మూలించే కార్యక్రమాలను రాజకీయంలో రూపొందిస్తు న్నట్టా!

ఇకపోతే మీరు దక్షిణాది రాష్ట్రాలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. కర్నాటకలో కరువు పీడితంగా వున్న 139 తాలూకాలను కేంద్ర ప్రభుత్వం ఏమీ ఆదుకోలేకపోయింది. ఇక కేరళ సంగతికి వస్తే ... 110 సంవత్సరాల్లో ఏనాడూ చూడని కరువును ఇప్పుడు చూస్తుంది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు చేసే కార్యక్రమాలకు కూడా మీరు ప్రోత్సహించటం లేదు. పైగా కేరళలో హిందూ మతోన్మాదంతో ఆరెస్సెస్ శ్రేణులను సైన్యాలుగా మార్చి అభ్యుదయ భావాలు వున్నవారిని హతమారుస్తున్నారు, అణచివేస్తున్నారు. ఇక తమిళనాడు రైతులు 40 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాలని పట్టుపడుతున్నారు. కరువు బారిన పడిన 21 జిల్లాలను ఆదుకోలేకపోయారు. పైగా ఇవన్నీ పన్ను అధికంగా చెల్లించే రాష్ట్రాలే. దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే నేరాలు తక్కువ. మతఘర్షణలు తక్కువ. విద్యాగంధం ఉన్నవారు ఎక్కువ. ఇదంతా బౌద్ధం విలసిల్లిన ప్రాంతం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేశారు. తెలుగు రాష్ట్రాల రైల్వేలు, రోడ్ల నిర్మాణాలు, మధ్యాహ్న భోజనం విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులన్నింటిలో గండి కొట్టారు. చంద్రబాబు గారిని తొత్తుగా మార్చుకుని ఎప్పుడూ ఢిల్లీ ఎదురుగా పోరాడే ఆంధ్రుల పాలక పక్షాన్ని, ప్రతిపక్షాన్ని లొంగతీసుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఆదివాసీయుల హక్కులను కాలరాస్తున్నారు. గిరిజనులు ఉత్పత్తులను దెబ్బతీస్తున్నారు. పంజాబ్‌లో యువకులను మత్తుమందులకు బానిసలుగా చేస్తున్నారు. చట్టాలకు తిలోదకాలు వదిలి ఫిరాయింపులను ప్రోత్సహించి కుల మతాలను రెచ్చగొట్టి మీకు వ్యతిరేకంగా పోరాడిన రామ్‌మనోహర్ లోహియా భావాలతో ఉండే నితీష్ కుమార్‌ను కూడా మీ పంచన చేర్చుకున్నారు. ఇవన్నీ 2107 నుంచి 2022 వరకు చేసే అభివృద్ధి కార్యక్రమాలా?! మోడీగారు ఒక్కసారి ఆలోచించండి. భారతదేశం రత్నగర్భం. భారత ప్రజలు లౌకికవాదులు. కుల నిర్మూలన కోసం పోరాడిన ఎందరో మహోన్నతులు ఇక్కడ ఉన్నారు. వాళ్ళ ఆలోచనలకు తిలోదకాలు ఇచ్చి కుల మతాలను రెచ్చకొడుతూ, ఉత్పత్తులను దెబ్బ తీస్తూ, మైనార్టీ మతాలపై ద్వేషం పెంచుకుంటూ వెళ్ళడం రాజ్యాంగబద్ధమైన నీతి కాదు. అందుకే ఉత్పత్తి శక్తులన్నీ ఏకమై భారతదేశ పునర్నిర్మాణానికి పతాకలెత్తటం చారిత్రక సత్యం.

(రచయిత నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు), 9849741695.

అల్లరి పిల్లలు అద్భుత చేష్టలు



పిల్లలు మనతో ఉన్నట్టే ఉంటారు. కానీ, వాళ్ళు తిరిగే ప్రపంచం వేరు. మన వేలు పట్టుకుని.. పక్కనే కుదురుగా నడుస్తున్నట్టే ఉంటారు. కానీ.. మనకు తెలియకుండానే.. పైనెక్కడో కొన్ని లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్షత్రాల్ని తెంపుకుని.. జేబులో దాచుకోగలరు. మనం 'సైలెన్స్ ప్లీజ్!' అనగానే.... బుల్లిమూతి మీద అడ్డంగా వేలేసుకుని బుద్ధిమంతుల్లా కూర్చున్నట్టు కనపడొచ్చు.. కానీ వారి ఊహల్లో మాత్రం.. ఎక్కడో శ్రీలంకX ఇండియా ఆడుతున్న క్రికెట్ మ్యాచ్‌లో.. తానూ ఓ జట్టు సభ్యుడిగా మారి, సిక్సర్లు మీద సిక్సర్లు కొట్టొచ్చు..! పిల్లల ప్రపంచం వేరు. ఆ ప్రపంచం చూడాలంటే.. పెద్దలే పసిమనస్సుల్లోని సున్నితత్వాన్ని అద్దుకుని.. పిల్లల ప్రపంచంలోకి ప్రవేశించాలి. వారితో కలిసి ఆడాలి.. వారిని స్వేచ్ఛగా ఎదగనివ్వాలి.







వాళ్లంతే పిల్లలు...ఏమైనా చేస్తారు. చిన్నదో, పెద్దదో కల కంటారు. అసలు పిల్లలంటేనే ప్రత్యేకం. వాళ్ల ప్రపంచం మరింత ప్రత్యేకం. ఊహ మొదలైనప్పటి నుంచీ తమదైన సుందర ప్రపంచాన్ని నిర్మించుకుంటూనే ఉంటారు. అల్లరి... వాళ్ల అస్థిత్వం. అల్లరి... వాళ్ల ఇష్టం. ఒక్కొక్కరూ ఎవరికి వారే ఓ ప్రత్యేకం. అందుకే, వాళ్లడిగే చిన్నచిన్న ప్రశ్నలకూ సమాధానం ఇవ్వండి.. గట్టిగా అరవనివ్వండి.. అలసిపోయేదాకా ఆడనివ్వండి.. పెద్ద ఆరిందాల్లా అడగనివ్వండి.. మొత్తానికి పిల్లలను పిల్లల్లాగానే ఉండనివ్వండి.. అలా ఉండనిస్తే చాలు.. వారంతా అద్భుతాలు అవుతారు.. మహాద్భుతాలు సృష్టిస్తారు.. సాధిస్తారు.

ఈ పిల్లలున్నారే!

పిండికొద్దీ రొట్టె అనడం.. తరచూ వింటుంటాం. పిల్లల అల్లరీ అలాంటిదే. వయసునుబట్టి పిల్లలు అల్లరి చేసే రేంజ్ ఆధారపడి ఉంటుంది. అంతేమరి.. ఎల్కేజీ బుడ్డోడు అల్లరి ఓమాదిరిగా ఉంటే.. అప్పుడే రెండోక్లాస్ ఫస్ట్‌క్లాస్‌లో పాసై మూడోక్లాసులోకి కాలరెగరేసుకుని అడుగుపెట్టిన చిన్నోడు / చిన్నది అల్లరి ఒకరకంగా ఉంటుంది. ఇక ఆపై క్లాసులు చదివే పిల్లల పరిస్థితి మరోరకం. కానీ సమయం వస్తే.. వయసు, పొట్టి, పొడవు, నలుపు, తెలుపు అనేది మరచిపోయి.. అంతా కిష్కింధకాండ లెక్కే అవుతారు. చెడ్డీ జారిపోయే బుడ్డోడూ.. ప్యాంట్ వేసుకున్న పెద్దపిల్లాడితో పోటీపడి మరీ అల్లరిచేస్తాడు. గౌను వేసుకున్న చిన్నది.. చూడీదార్ వేసుకున్న పెద్దమ్మాయితో కలిసే రాగం తీస్తుంది. అందుకే, పిల్లల అల్లరిని సుద్దముక్కతో గుండ్రంగా గిరిగీసి ఒకచోట కుదురుగా కూర్చోబెట్టలేం.

పిల్లలేగానీ.. ఆరిందాలే!

అనగనగా.. ఓ పదేళ్ళు.. పదిహేనేళ్ళు వెనక్కివెళితే.. అప్పుడు పెద్దగా.. కేబుల్ టీవీలు, సెల్‌ఫోన్ల ప్రాబల్యం, ప్రభావం లేని రోజులవి. అప్పుడు పిల్లలకు కావాల్సిన ఎంటర్‌టైన్‌మెంట్.. అమ్మానాన్న, ఇతర కుటుంబసభ్యుల నుంచి మాత్రమే అందేది. ఉయ్యాలతొట్లో.. అమ్మ ఉల్లల్లల్లాలో.. అనే పాటకావొచ్చు.. సుయ్యి సుయ్యి అంటూ రోకలి బండో, చాకలిబండో చేసే సవ్వడి కావొచ్చు. అప్పటి పిల్లలు.. అడుగులు పడీ పడకుండానే అమ్మనో, బామ్మనో అనుకరిస్తూ.. బకెట్టు నీళ్ళల్లో ఏదో ఒక బట్ట తడిపేసి.. ఉతికీ ఉతికీ తెగ సంబరపడి పోయేవాళ్ళు. అమ్మకొంగు పట్టుకునే వయసులోనే పెద్ద ఆరిందాల్లా.. బుల్లిపీటపై కాస్తంత పిండిముద్ద అతికించి.. బుల్లి చపాతీలు చేసేసీ వంటింట్లో మహామహా వంటగత్తెలు అయ్యేవారు. అమ్మ తల్లో పేలు చూడ్డం.. పాయలు తీసి జడలు అల్లడం.. నాన్న జుట్టుకు నూనెరాసి.. మీసాలు మెలేయడం.. ఒక టవల్ తీసుకుని.. నాన్నలా లుంగీ చుట్టుకోవడమో.. అమ్మలా చీర కట్టుకోవడమో.. ఇలా అన్నీ అరిందాపనులే ఉండేవి.

స్మార్ట్‌కానీ.. స్మార్ట్

ఇప్పుడు రోజులు మారాయి. సంప్రదాయ అనుకరణలు మారాయి. ఈ సెల్‌ఫోన్ యుగంలో.. స్పీడు పెరిగింది. నీళ్ళతో ఆటల్లేవు.. వర్షం పడ్డప్పుడు కాగితపు పడవల ఊసులూ లేవు. ఉన్నదంతా కళ్ళకు చత్వారం వచ్చేదాకా.. స్మార్ట్‌ఫోన్లో.. ఒకేసారి అరవై ఆరు గేమ్స్ ఆడుకోవడమే. ఆటంటే ఇది కాదు కదా?! ఆటంటే చెమట పట్టాలి.. ఆటంటే.. నలుగురు పిల్లలు వొళ్ళంతా మట్టి, బురద పూసుకునేలా ప్రపంచాన్ని మరచిపోయేలా సేదతీరాలి. వికాసవంతంగా గాల్లో తేలుతూ.. కాసిన్ని మేఘపు బుగ్గల్ని ఇంటికి తీసుకురావాలి.



అందుకే ఆడుకోనివ్వండి!

నిజానికి పిల్లలు చాలా చిన్న విషయాలకే అమితమైన ఆనందానికీ, బాధకూ లోనవుతారు. వాళ్లు పడుతుందనుకున్న వర్షం పడకపోయినా.. ఆదివారం ఆడుతున్నప్పుడు అకస్మాత్తుగా వాన పడినా.. అది వాళ్లకు బాధను ఇవ్వొచ్చు. మీరు ఎప్పటి నుంచో ప్లాన్ చేసుకున్న సినిమా ప్రోగ్రాం వాయిదాపడినా వాళ్ల తీవ్ర నిరుత్సాహానికి గురి కావొచ్చు. అయితే పిల్లలు చిన్నచిన్న ఆనందాలతో వాటిని అధిగమించగలరు. చిన్నచిన్న అల్లరి పనులతో ఆ బాధను మర్చిపోగలరు. ఒక్కొక్కరూ ఒక్కోలాంటి అల్లరి చేస్తారు. ఒకరికి మట్టిని వళ్ళంతా పూసుకుని ఆడటం ఇష్టం. ఇంకొకరికి బట్టల మీద నీళ్లను పోసుకోవడం ఇష్టం. మరికొందరికి చేతుల నిండా సబ్బు పులుముకుని బుడగలు వదలడం ఇష్టం. నిజానికి ఇలాంటివే వాళ్లకు అమితమైన ఆనందాన్ని ఇస్తాయి.

- జీవన డెస్క్

కార్తీక్.. ఓ అందమైన అల్లరి పిల్లోడు!

అనగనగా... విశాఖ జిల్లా పాయకరావు పేట ప్రభుత్వ పాఠశాల. ఒకటో తరగతిలో కార్తీక్ అనే అల్లరి పిల్లాడు ఉన్నాడు. అల్లరంటే అలాంటి ఇలాంటి అల్లరి కాదు. అక్షరాలు రాయమని పనిచెప్తే, రాస్తున్న పిల్లల అక్షరాలు కూడా చెరిపేసే రకం. చదవటం, రాయడం కార్తీక్‌కు అస్సలంటే అస్సలు నచ్చని పనులు. స్కూల్ స్టార్ట్ అయిన కాసేపటికే ఏదో ఒక వంక చెప్పి బయటకు వెళ్లి, మళ్లీ ఏ గంటకో కానీ తిరిగి రాకపోవడం. ఇది కార్తీక్ రోజూ చేసేపని.

ఓ రోజు కార్తీక్ వాళ్ల అమ్మ నేరుగా తన క్లాస్ టీచర్ విజయభాను దగ్గరకు వచ్చి "వీడు అస్సలు మాట వినడం లేదండీ! ఏదో ఒకటి చేయండి, అల్లరి బాగా ఎక్కువైంది. అవసరమైతే కొట్టండి" అని కంప్లైంట్ చేశారు. దీంతో ఆలోచనలో పడిన టీచర్ ఒక నిర్ణయానికొచ్చారు.



భాను టీచర్‌కు ప్రతిరోజూ పిల్లలకు కథలు చెప్పే అలవాటుంది. ఏ కథ చెప్పినా ఆ కథలోని పాత్రలన్నీ తరగతిగదిలోని పిల్లలతోనే ఉంటాయి. ఓ రోజు కథ చెప్తూ, చెప్తూ కార్తీక్ పాత్రను చాలా ఎక్కువ చేసి చెప్పారు. ఇక ఆ తర్వాత అందరితోనూ "నేనే.. ఆ కథలో ఎలా చేశానో చూశావా చూశావా..!" అని అందరికీ చెప్తూ మురిసిపోతున్నాడు. దాంతో చిన్ని పొగడ్తకే సంబరిపడిపోతున్న కార్తీక్‌ను తనవైపు ఎలా మలుచుకోవచ్చో భాను టీచర్‌కు అర్థమైంది. ఆ రోజు నుంచీ కథల్లో తన పాత్రల్లానే ఉండటం ప్రారంభించాడు కార్తీక్.

అంతకు ముందులా కాకుండా చకాచకా అక్షరాలు రాసేస్తున్నాడు. ఓరోజు భాను టీచర్ "ఈ నెలలో చెప్పిన పాఠాలన్నీ బాగా నేర్చుకున్న వాళ్లకు మంచి బెల్ట్ గిఫ్ట్‌గా ఇస్తా!" అన్నారు. అంతే ఇక కొద్దిమంది పిల్లలు అన్నీ త్వరగా నేర్చేసుకుని బెల్ట్ తీసేసుకుంటుంటే కార్తీక్‌కూ చాలా పట్టుదలే పెరిగింది. తనూ త్వరత్వరగా నేర్చేసుకుని, తనకు నచ్చిన రంగు బెల్ట్‌నే తీసుకున్నాడు. "అప్పుడు వాడి మొహంలోని ఆనందాన్ని చూడాలి... అది ఏమిచ్చినా దొరకదు" అని ప్రేమగా చెప్తారు భానూ టీచర్. అలా ఆరోజు బెల్ట్ తీసుకున్న కార్తీక్ "నేను మంచోడ్ని అయిపోయాగా.. మా అమ్మతో చెప్తరా?" అన్నాడు. వెంటనే భానూ టీచర్ కార్తీక్ వాళ్లమ్మకు ఫోన్ చేసి "మీ కార్తీక్ చాలా మారిపోయాడు. చక్కగా చదువుతున్నాడు.. రాస్తున్నాడు. అబద్ధాలు అసలే చెప్పడం లేదు.. ఎవ్వరినీ కొట్టడం లేదు" అని చెప్పారు. అంతే అవతలివైపు కార్తీక్ వాళ్లమ్మ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

మీకూ ఇలాంటి కార్తీక్‌లు ఎంతోమంది కనపడతారు. వాళ్లనూ గమనించండి. వాళ్లను వాళ్లలానే ఉండనివ్వండి. ఆకతాయివాడిగా ముద్రవేసి.. కొట్టడం లాంటి పనులు చేయకండి. వాళ్లు మిగతా పిల్లలతో పోటీపడగలరు.. గొప్పగా రాణించగలరు. భవిష్యత్తులో అద్భుతాలనూ సృష్టించగలరు.



మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే?!

మెదడును ఆరోగ్యంగా ఉంచుకుంటే అది రోజువారీ కార్యకలాపాలు సరిగా జరిగేలా చూస్తుంది. అంతేకాదు అల్జీమర్స్ వ్యాధి, ఇతర జ్ఞాపకశక్తి సమస్యలను కూడా తగ్గిస్తుంది. మెదడుని ఎలా ఆరోగ్యంగా ఉంచుకోవాలో నిపుణుల సూచనలివి.

- మీ ఇంటి తాళంచెవిని ఎక్కడ పెట్టారో మర్చిపోతున్నారా? మీ కిరాణాసరుకుల జాబితాలో ఏమి ఉన్నాయో మర్చిపోయారా? ఇలాంటి సమస్యలతో బాధపడేవారు ఎంతో మంది ఉన్నారు. ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడు కొన్ని విషయాలను మర్చిపోతుంటారు. మెదడు వేగంగా, చురుకుగా పనిచేసేలా చూసుకోవాలి.



- మెదడుని ఆరోగ్యంగా, చురుగ్గా ఉంచేది ఏరోబిక్ వ్యాయామం. ఈ తరహా వ్యాయామం చేయడం వలన కొన్ని రకాల మానసిక క్షీణతలను అధిగమించవచ్చని రుజువైంది. ఇది జ్ఞాపకశక్తిని పునరుద్ధరిస్తుంది.
- రంగురంగుల పండ్లలో, కూరగాయలలోనే కాకుండా బీన్స్, తృణధాన్యాలు, గింజలు, మసాలా దినుసుల్లో కూడా పుష్కలంగా యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇలాంటి పోషకాహారం తీసుకోవడం మెదడుకు చాలా ముఖ్యం.
- సహజంగా మెదడులో చురుకుదనం 30ఏళ్ల తర్వాత తగ్గుముఖం పడుతుంది. కానీ ఆధునిక అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే ఏ వయసు వారైనా వారికి కావాల్సిన శిక్షణను మనం మెదడుకు అందించుకోవచ్చు. దీనికోసం అవసరమయిందల్లా మనసుని తాజాగా ఉంచుకుని మంచి ఆలోచనలు రేకెత్తించే పుస్తకాలు చదవడం, సంగీతం వినడం అవసరం.
- మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రశాంతత కూడా చాలా ముఖ్యం. బాధాకరమైన ఒత్తిడి కి దూరంగా ఉండాలి ఇది మెదడు కణాలకు హానికల్గిస్తుంది. జ్ఞాపకశక్తి నిర్మాణంలో ప్రధానమైన కేంద్రమైన హిప్పోకాంపస్ అనే మెదడు భాగం, దీర్ఘకాలిక ఒత్తిడి వలన తీవ్రంగా నిస్త్రాణమైపోతుంది. అందువల్ల ప్రశాంతమైన స్థితి అవసరం.
- హాస్యం మెదడు భాగాలను ఉత్తేజితం చేసి "మంచి అనుభూతి" అనే రసాయన సమాచార నాడీ సంబంధిత రవాణా ఉపయోగపడుతుంది. నవ్వులు మెదడుకు ఆహ్లాదంగానే కాకుండా ఆనందాన్ని అందిస్తాయి.



మీ కోసం

మధుమేహంతో బాధపడేవారు ఆహారంలో వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే మేలు. వెల్లుల్లి గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచుతుంది.

జీవన సౌరభం

చిరునవ్వు మాత్రమే చూసిన మిత్రుని కన్నా, కన్నీళ్ల విలువ తెలిసిన మిత్రుడే మిన్న.

పదండి.. ప్రపంచాన్ని చూసొద్దాం!

నేహా అరోరా ఢిల్లీకి చెందిన యువతి. చిన్నప్పటి నుంచి నేహా ఇతర ప్రాంతాలకి ఎక్కడికీ వెళ్లలేదు. సెలవులను కూడా తను ఎంజాయ్ చేయలేకపోయింది. కారణం ఆమె తల్లిదండ్రులిద్దరూ వికలాంగులు. తల్లికి కంటిచూపు లేదు. తండ్రి వీల్‌ఛైర్‌కు అంకితమైపోయారు. నేహా చిన్నతనంలో ఆమెను అందరూ జాలిగా చూసేవారు. అందుకే ఎక్కువ శాతం ఆమె ఎవరితో మాట్లాడేది కాదు. అయితే చిన్నతనం నుంచే తల్లిదండ్రులను ఎక్కడికైనా బయటకు తీసుకువెళ్లాలని ఆమె మనసులో పాతుకుపోయింది. ఆ సమయం రానే వచ్చింది. ఔటింగ్స్ ప్లాన్ వేసింది. 'నేను పెద్దయిన తర్వాత నా తల్లిదండ్రులను వారు ఏ ప్రాంతాలను చూడాలని ఆశపడుతున్నారో వాటన్నింటినీ చూపించాలనుకున్నాను. అలా అన్నిప్రాంతాలనూ చూపించడానికి మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. కొంతమందైతే ఎందుకు ఇలా వారిని అలా తిప్పుతున్నావని క్లాస్ తీసుకున్నారు కూడా. ఈ పరిస్థితుల్లో ఉన్నవారిని తిప్పడం అవసరమా అని కూడా అన్నారు" అని నేహా అప్పటి క్షణాలను గుర్తుచేసుకుంటోంది.

అప్పట్లో వికలాంగులను టూర్స్‌కు తీసుకెళ్లేందుకు సంబంధించిన వివరాలు, సరిగా దొరికేవి కావు. ఈ కారణంగా నేహా తల్లిదండ్రులు చాలా సమస్యలనే ఎదుర్కొన్నారు.





తల్లిదండ్రులకు ఎలాంటి సంతోషాన్ని ఇవ్వలేకున్నానే భాధ నేహాలో మొదలైంది. చుట్టూ ఉన్నవారి కోసం ఆలోచించడం మొదలుపెట్టింది. తల్లిదండ్రుల కోసం మాత్రమే కాకుండా వికలాంగుల కోసం ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకుంది. నవంబర్ 2015లో 'ప్లానెట్ ఎబుల్డ్' అనే పేరుతో ఓ సంస్థను ప్రారంభించారామె. జనవరి 2016లో ప్లానెట్ ఎబుల్డ్ అధికారికంగా లాంచ్ అయింది. ప్రస్తుతం అందరి మన్ననలూ పొందుతోంది. ప్లానెట్ ఎబుల్డ్ అనేది శారీరక వైకల్యం ఉన్నవారికి ట్రిప్ అరెంజ్ చేయడానికి చేసిందే. ఆ సమయంలో ఆ వ్యక్తి వయసు, జెండర్‌ను వారి లిస్టులో రాసుకుంటారు.

ఈ ట్రిప్‌ను రెండురకాలుగా ఆర్గనైజ్ చేస్తారు. మొదటిది విభిన్నరకాల వికలాంగులను గ్రూపులుగా చేయడం. రెండోది, ఇందులో వికలాంగ వ్యక్తి కుటుంబంతోపాటు ఈ ట్రిప్ ఎంజాయ్ చేసేలా ప్రణాళిక చేయడం. ఈ ట్రిప్‌కు సంబంధించిన చిన్న చిన్న విషయాలను కూడా నేహా ఆమె టీమ్ చూసుకుంటారు. ఎందుకంటే, ట్రిప్ ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకూ ఎలాంటి ఆటంకం రాకుండా ఉండడం కోసం. ఒక్కప్రాంతాన్ని మాత్రమే వీక్షించాలనుకునేవారు. అంటే, మ్యూజియం, మందిరం, రెస్టారెంట్ ఇలాంటి వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. ఒకరోజు ముందే నేహా ఆ ప్రాంతానికి వెళుతుంది. అక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే చూసుకుని వస్తుంది. ఆ మరుసటి రోజే ట్రిప్‌కు అందరితోపాటు బయలుదేరుతుంది. 'మొదట్లో వారిని అర్థం చేసుకోవడం చాలా కష్టంగానే ఉండేది. చాలా సందర్భాల్లో వారి కంటే ఫ్యామిలీ మెంబర్స్ ఎక్కువగా బాధపడటం చూశాను. అసలు పరిచయం లేని వ్యక్తులతో ట్రావెల్ చేయడానికి భయపడటం కామన్ కదా!' అంటున్నారు నేహా.

జనవరి 2016లో ఢిల్లీలో చేసిన లోకల్ ట్రిప్ తర్వాత చాలా కుటుంబాలు ఆమెకు సపోర్టు చేశాయి. ఆ ఫ్యామిలీల్లో కూడా చాలామంది వికలాంగులు ఉన్నారు. దీని తర్వాత నవంబర్ 2016 లో నేహా మొదటి రాఫ్టింగ్ ట్రిప్ ఆర్గనైజ్ చేసింది. అది కూడా వీల్‌ఛైర్లో ఉన్న వారితో కలిసి. 'మనదేశంలోనే కాకుండా మొత్తం ప్రపంచమంతా ఇలాంటి వారు చాలామంది ఈ ట్రిప్‌లో పాల్గొనాలి అనుకుంటున్నారు. మా ట్రిప్‌కు రావడానికి వారు సిద్ధపడాలంటే వారికి మాపై పూర్తి నమ్మకం ఏర్పడాలి. ఎందుకంటే, వారు మనతో పాటు ఉంటే సురక్షితంగా ఉంటారనే నమ్మకం వారిలో కల్పించడం మా బాధ్యత' అంటున్నారు నేహా. ప్లానెట్ ఎబుల్డ్ ఆరుగురితో కలిపిన ఓ టీమ్. ఇందులో నేహా ఒకరు. వీరంతా రాజధాని ఢిల్లీలోనే ఉంటారు.

- అమల తిలారు

రాశీ, గజబ్‌పోస్టు ఆధారంగా....

సెన్సెక్స్ ▲ 205	నిఫ్టీ ▼ 63	రూపాయి ▼ 03 పైసలు
32,514	10,077	ఒక అమెరికా డాలరుకు రూ. 64.18

సెన్సెక్స్ డబుల్ సెంచరీ..

32,514 పాయింట్లకు చేరిక

ఎస్‌బిఐ, ఎల్అండ్‌టి షేర్ల దన్ను

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), ఎల్ అండ్ టి స్టాక్స్ దన్నుతో సూచీలు సరికొత్త రికార్డులను తాకాయి. దీనికి తోడు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా త్వరలో నిర్వహించనున్న పరపతి విధాన సమీక్షలో కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లను తగ్గించనుందన్న వార్తలు కూడా మార్కెట్లకు కొత్త జోష్‌నిచ్చాయి. సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ ఎస్‌బీఐ నిర్ణయం తీసుకోవడంతో ఉదయం నుంచే మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ఆ తరువాత ఏ దశలోనూ సూచీలు నష్టాల్లోకి జార కుండా చివరి వరకు తమ జోష్‌ను కొనసాగించాయి. మార్కెట్లు ముగిసే సమయానికి ఎన్ఎస్ఇ సూచీ నిఫ్టీ 62.5 పాయింట్ల మేర పెరిగి 10,077 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు బిఎస్ఇ సూచీ సెన్సెక్స్ 205 పాయింట్ల మేర పెరిగి 32,514 పాయింట్ల వద్ద స్థిరపడింది. రంగాల వారీగా బిఎస్ఇలో మన్నికైన వినియోగదారుల వస్తువుల సూచీ మెరుగైన పనితీరును కనబరిచి 1.86% మేర పెరిగింది. మరోవైపు లోహ సూచీ 1.69%, పీఎస్‌యూ సూచీ 1.66 శాతం, యంత్రపరికరాల సూచీ 1.4 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఆరోగ్యపరిరక్షణ సూచీ 1.52 శాతం, ఎఫ్ఎంసీజీ సూచీ 0.99 శాతం మేర కుంగాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడిన సూచీల్లో ఎస్‌బీఐ (+4.46%), పవర్‌గ్రిడ్ (+4.23%), టాటా స్టీల్ (+2.89%), ఎల్ అండ్ టీ (+2.85%), ఓఎన్‌జీసీ (+2.82%) ఉన్నాయి. బాగా నష్టపోయిన స్టాక్స్ జాబితాల్లో సన్‌ఫార్మా (-3.47%), డాక్టర్ రెడ్డీస్ (-3.11%), లూపిన్ (-2.90%), ఐటీసీ (-2.09%), సిప్లా (-1.18%) ఉన్నాయి. అంతర్జాతీయంగా చూస్తే చైనా మెరుగైన ఆర్థిక స్థితిని కనబరుస్తూ వెల్లడించిన గణాంకాలతో ఆసియా మార్కెట్లు లాభాల్లోకి మరలాయి. ఈ పరిణామాలు కూడా దేశీయ స్టాక్ మార్కెట్లపై అనుకూల ప్రభావాన్ని కనబరిచాయి.

వ్యాపారంలో 20% వృద్ధి లక్ష్యం

ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా ఎండి వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి 'కాయకల్ప్'ను విడుదల చేస్తున్న ఇన్‌సెక్టిసైడ్ ఇండియా ఎండి రాజేష్ అగర్వాల్

ప్రముఖ వ్యవసాయ క్రిమి సంహారక మందులను విక్రయించే ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వ్యాపారంలో 20 శాతం వృద్ధి అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. ఇదే సమయంలో దహేజాలోని తమ గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ విస్తరణకు రూ.30 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ అగర్వాల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి భూమి సారాన్ని పెంచే 'కాయకల్ప్' సేంద్రియ ఉత్పాదనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల ఆరోగ్యం, ఉత్పాదకత మెరుగుపరిచేందుకు వీలుగా ఇది నేల ఆరోగ్యాన్ని సేంద్రీయంగా పునరుత్తేజం కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం దహేజా ప్లాంట్ 10వేల టన్నుల సామర్థ్యం కలిగి ఉందని, ఇందులో 65 శాతాన్ని ఉపయోగించుకుంటున్నామన్నారు. 2020 నాటికి రుణ రహిత కంపెనీగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర వ్యాపారంలో 15-20 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గతేడాది 10 శాతం వృద్ధి సాధించామన్నారు. కాగా పరిశ్రమ 3-4 శాతం పెరిగిందన్నారు. తమ కంపెనీ రూ.1100 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. టిఎస్, ఏపి మార్కెట్లో కంపెనీ అమ్మకాలు రూ.190 కోట్లకు చేరాయన్నారు. ప్రస్తుత ఏడాదిలో 215 కోట్లు అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్ల అప్పులున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బయోలాజికల్, ఆర్గానిక్ విభాగాల్లో కొత్తగా ఐదు ఉత్పత్తులను ఆవిష్కరించనున్నామన్నారు.

వడ్డీ రేటు తగ్గించిన ఎస్‌బిఐ

పొదుపు ఖాతాలపై 3.5 శాతమే



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తాజాగా పొదుపు ఖాతాల డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటుకు కోత పెట్టింది. ప్రస్తుతం సేవింగ్ ఖాతాల్లోని మొత్తాలపై ఏడాదికి 4 శాతం వడ్డీ చెల్లిస్తోంది. తాజాగా దీనికి వడ్డీరేటును 0.5 శాతం (50 బేసిస్ పాయింట్లు) కోత పెట్టింది. తగ్గించిన వడ్డీ రేటు సోమవారం నుంచే అమల్లోకి వచ్చిందని వెల్లడించింది. ఇటీవల వివిధ మెచ్యూరిటీ టర్మ్ డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించేసింది. తాజాగా సేవింగ్ ఖాతాలపై కూడా ఇదే నిర్ణయం తీసుకోవడంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. కోటి వరకు ఉన్న సేవింగ్స్ డిపాజిట్లపై గతంలో 4 శాతం వడ్డీ చెల్లిస్తుండగా తాజాగా దీన్ని 3.5 శాతానికి కోత పెట్టగా, కోటి రూపాయలకు పైగా ఉంటే మాత్రం 4 శాతమే వడ్డీని అందించనుంది. ద్రవ్యోల్బణ రేటు తగ్గడం, ఇతర కారణాల వల్ల వడ్డీ రేట్లు తగ్గించాల్సి వచ్చిందని ఎస్‌బిఐ పేర్కొంది.

పన్ను రిటర్న్స్‌కు గడువు పెంపు



న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్ను దాఖలు చేసుకునేందుకు ఐటి శాఖ ఆగస్టు 5 వరకు గడువును పొడగించింది. గత రెండు మూడు రోజులుగా ఒకేసారి ఎక్కువ మంది సైట్‌లోకి లాగిన్ అవుతుండటంతో వెబ్‌సైట్ పని చేయని పరిస్థితి చోటు చేసుకుంది. దీంతో సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సిబిడిటి) ఈ నిర్ణయం తీసుకుంది. 2016-17 ఆర్థిక సంవత్సరానికి గాను ఐటి రిటర్న్స్ దాఖలు గడువు జులై 31గా ఉంది. కాగా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం గడువు పెంచినట్లు ఐటి శాఖ సోమవారం పేర్కొంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో 2 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. కాగా గడువు సమీపిస్తున్న కొద్దీ ఇ-రిటర్న్స్ వెబ్‌సైట్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత నవంబర్ 9 నుంచి డిసెంబర్ 30 వరకు బ్యాంకు ఖాతాల్లో జమచేసిన నగదు వివరాలను కూడా చూపాలని ఐటి శాఖ పన్ను చెల్లింపుదారులను ఆదేశించింది.



నెలలో లింక్ చేయాల్సిందే

ఆధార్-పాన్ కార్డుపై సిబిడిటి

న్యూఢిల్లీ : వచ్చే ఆగస్టు 31వ తేదీలోపు ఆధార్ సంఖ్యతో పాన్ కార్డును అనుసంధానం చేసుకోవాల్సిందేనని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) స్పష్టం చేసింది. లేనిచో ఆ పాన్ కార్డులు చెల్లుబాటు కావని సోమవారం ఆ శాఖ ట్విట్టర్ ద్వారా తెలిపింది. ఆధార్‌తో లింక్ చేయని ఐటి రిటర్న్స్ కూడా చెల్లవని స్పష్టం చేసింది. 2017వరకు ఎవరైతే పాన్ కార్డు కలిగి ఉంటారో, వారంతా సెక్షన్ 139ఎఎ సబ్-సెక్షన్2 ప్రొవిజన్స్ కింద ఈ రెండింటిని అనుసంధానం చేసుకోవాలని ఆదేశించింది.

83% ఉద్యోగులకు కత్తెర..!

- స్నాప్‌డీల్ కసరత్తు
- ఫ్లిప్‌కార్ట్‌తో డీల్ రద్దు



న్యూఢిల్లీ / ముంబయి : ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం స్నాప్‌డీల్ తమ సిబ్బందిలో 83 శాతం మందిని తొలగించడానికి కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం తమ వ్యాపార, సాంకేతిక ఉన్నతాధికార్లకు దీనిపై సూచనలు చేశారని తెలుస్తోంది. కొత్త బృందాల పునర్‌నిర్మాణానికి, ఉద్యోగుల తొలగింపు కోసం ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించినట్లు సమాచారం. ఇదే జరిగితే ఆ సంస్థలో కేవలం 200 మంది ఉద్యోగులు మాత్రమే మిగులనున్నారు. కాగా స్నాప్‌డీల్ వ్యవస్థాపకులు కునాల్ బాల్, రోహిత్ బన్సల్ గత గురువారం సాయంత్రమే ఉద్యోగుల తొలగింపునపై కీలక ఆదేశాలను జారీ చేసినట్టు ఆ కంపెనీ సీనియర్ అధికారి ఒక్కరు ఎఎన్ఐకి తెలిపారు. సిబ్బంది తొలగింపునపై మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. తీసివేత జాబితాను రూపొందించాలని కోరినట్లు ఆ అధికారి పేర్కొన్నారు. స్నాప్‌డీల్ 2016 జూలైలో 9వేల మంది ఉద్యోగులతో వ్యాపారం నిర్వహించింది. ఈ మధ్య కాలంలో ఈ సంఖ్యను ఏకంగా 1200కు తగ్గించేసింది.

అర్ధాంతర ఒప్పందం

దేశంలోనే అతిపెద్ద ఇ-కామర్స్ విలీనంగా భావించిన ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ ఒప్పంద ప్రక్రియ అర్ధంతరంగా ముగిసింది. దాదాపు ఐదారు మాసాలుగా లెక్కలేనన్ని గంటల పాటు చర్చలు, అనేక బోర్డు సమావేశాల్లో జరిగిన ఈ విక్రయ చర్చలకు తెరవేస్తూ స్నాప్‌డీల్ సోమవారం ప్రకటన చేసింది. విక్రయంపై జరుగుతున్న చర్చలను ఇకమీదట పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు ఆ కంపెనీ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. కాగా ఇక స్నాప్‌డీల్ స్వతంత్రంగానే వ్యాపార కార్యకలాపాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది. విలీనంపై జరుగుతున్న అన్ని వ్యూహాత్మక చర్చలను నిలిపివేశామని స్నాప్‌డీల్ అధికార ప్రతినిధి ఇ-మెయిల్ ద్వారా పేర్కొన్నారు. సంస్థకు చెందిన నిరర్థక ఆస్తుల అమ్మకం ద్వారా ఆర్థికంగా స్వీయ, స్థిరమైన లక్ష్యంతో కొనసాగనున్నట్టు తెలిపారు. తమ దష్టి ఎల్లప్పుడూ భారతదేశంలోని లక్షలాది కొనుగోలుదారుల అనుభవాలవైపే ఉంటుందని పేర్కొన్నారు. స్నాప్‌డీల్‌కు చెందిన డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫాం ఫ్రీఛార్జ్‌ను యాక్సిక్ బ్యాంక్ కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే ఈ ఒప్పందానికి తెరపడటం గమనార్హం.

ఫ్లిప్‌కార్ట్ సవరించి ప్రతిపాదించిన 900 మిలియన్ డాలర్ల (రూ.5,792 కోట్లు) నుంచి 950 మిలియన్ డాలర్ల (రూ.6,114 కోట్లు) మధ్య ఆఫర్‌కు స్నాప్‌డీల్‌ను విక్రయించడానికి ఆ కంపెనీ మాతృసంస్థ జాస్పర్ ఇన్ఫోటెక్ బోర్డు అంగీకరించినట్లు క్రితం వారం వార్తలు వచ్చాయి. నిధుల కొరతతో కటకటలాడుతున్న స్నాప్‌డీల్‌ను కొనేందుకు ఫ్లిప్‌కార్ట్ ముందు 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6450 కోట్ల) వరకూ ఇవ్వడానికి తొలుత సిద్ధపడింది. కాగా స్నాప్‌డీల్ విలువ మదింపు ప్రక్రియ అనంతరం 800-850 మిలియన్ డాలర్ల దాకా (సుమారు రూ. 5,500 కోట్లు) ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే స్నాప్‌డీల్ దీన్ని తిరస్కరించడంతో అనంతరం ఫ్లిప్‌కార్ట్ తన ఆఫర్ విలువను పెంచి 950 మిలియన్ డాలర్లకు చేర్చిందని, దీంతో ఇరు సంస్థలు ఒక అంగీకారానికి వచ్చాయని సమాచా రం. కాగా దీని ఆమోదానికి ఇరు కంపెనీలు బోర్డులు సమావేశం కూడా కావాల్సి ఉంది. ఇంతలోనే ఈ ఒప్పంద ప్రక్రియను రద్దు చేసుకుంటున్నట్లు స్నాప్‌డీల్ ప్రకటించడం ఇ-కామర్స్ వర్గాల్లో చర్చకు దారి తీసేలా చేసింది.

రాణించిన టెక్ మహీంద్రా

న్యూఢిల్లీ: దేశీయ ఐటి సంస్థ టెక్ మహీంద్రా జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల కాలంలో సంస్థ లాభం 6.5 శాతం మేర పెరిగి రూ.749.3 కోట్ల నుంచి రూ.798.6 కోట్లకు చేరింది. ఇదే కాలంలో సంస్థ ఆదాయం దాదాపు 6 శాతం మేర పెరిగి రూ.6,921 కోట్ల నుంచి రూ.7,336.1 కోట్లను చేరుకుంది. అంతకు ముందు మార్చి త్రైమాసికంలో సంస్థ లాభం రూ.589.7 కోట్లుగాను.. ఆదాయం రూ.7,495 కోట్లుగాను ఉంది. జూన్ త్రైమాసికంలో కొత్తగా 21 మంది క్లయింట్లను తాము అందిపుచ్చుకున్నట్టుగా సంస్థ వెల్లడించింది. సంస్థలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,15,980కి చేరిందని వివరించింది. ఇందులో 78,996 మంది సాఫ్ట్‌వేర్‌లోను.. 30,322 మంది బీపీవో విభాగంలోను పని చేస్తున్నట్టుగా తెలిపింది.

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

'ఆంధ్రమహిళాసభ' వ్యవస్థాపకులు?



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

ఆంధ్రోద్యమం

1. ఆంధ్రలో సైమన్ కమిషన్ ఏ సంవత్సరంలో పర్యటించింది ? **- 1928 సంత్సరంలో**
2. సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమానికి చెన్నయిలో నాయకత్వం వహించినది ఎవరు ? **- టంగుటూరి**
3. సైమన్ కమిషన్ తన నివేదికను ఏ సంవత్సరంలో సమర్పించింది ? **- 1930 సంవత్సరంలో**
4. కాకినాడ బాంబు సంఘటన జరిగిన సంవత్సరం ? **- 1933 (ప్రధాన నిందితుడు - ప్రతివాద భయంకరాచారి)**
5. గాంధీజీ 1930 మార్చి 12న సబర్మతి ఆశ్రమం నుంచి 79 మంది వాలంటీర్లతో బయల్దేరివెళ్లి ఏప్రిల్ 6న దండిలో ఉప్పు తయారు చేశారు. ఆంధ్ర నుంచి ఎర్నేని సుబ్రమణ్యం దండి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆంధ్రలో ప్రథమ ఉప్పు సత్యాగ్రహం ఎప్పుడు జరిగింది ? **- 1930 ఏప్రిల్ 9న బందరులో జరిగింది**
6. ఉప్పుసత్యాగ్రహం - నాయకత్వం

బందరు	**- డాక్టర్. భోగరాజు పట్టాభిసీతారామయ్య**
గుంటూరు	**- కొండా వెంకటప్పయ్య (దేశభక్త - బిరుదు ఉంది)**
ఏలూరు	**- దండు సూర్యనారాయణరాజు**
విశాఖ	**- తెన్నేటి విశ్వనాథం**
చెన్నయి	**- టంగుటూరి**
సీతానగరం	**- బ్రహ్మజోస్యుల సుబ్రమణ్యం**

7. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏ సంవత్సరంలో స్థాపించారు ? **- 1934 (స్థాపకుడు - ఆచార్య ఎన్.జి.రంగా)**
8. గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'ఆంధ్ర కాంగ్రెస్ స్వరాజ్‌పార్టీని ఏ సంవత్సరంలో స్థాపించారు ? **- 1934**
9. 1934లో అవతరించిన 'ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ'లో ప్రముఖపాత్ర నిర్వహించినది ఎవరు ? **- పుచ్చలపల్లి సుందరయ్య**
10. 'వీరగంధందెచ్చినారము వీరులెవ్వరో తెలుపుడీ' గేయ రచయిత ? **- త్రిపురనేని రామస్వామి చౌదరి**
11. 'మాకొద్దీ తెల్లదొరతనం' గేయ రచయిత ? **- గరిమెళ్ల సత్యనారాయణ**
12. 1939లో అఖిలభారత జాతీయకాంగ్రెస్ అధ్యక్షమ పదవికి జరిగిన పోటీలో నేతాజీ చేతిలో ఓడిన ఆంధ్రుడు ఎవరు ? **- డాక్టర్ భోగరాజు (త్రిపుర (ఎంపి) ఐఎన్‌సి -సమావేశం)**
13. గాంధీజీ వ్యక్తి సత్యాగ్రహాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు ? **- 1940**
14. 1940లో వ్యక్తిగత సత్యాగ్రహం చేసి అరెస్టు అయ్యిన ప్రముఖ ఆంధ్ర గాంధేయవాది ఎవరు ? **- వావిలాల గోపాలకృష్ణయ్య**
15. టంగుటూరి స్వరాజ్య ఆంగ్ల పత్రికను ఎప్పుడు ప్రారంభించారు ? **- 26-10-1921**
16. 1923లో స్థాపించిన స్వరాజ్యపార్టీ ఆంధ్రశాఖ అధ్యక్షుడు ఎవరు ? **- అయ్యదేవర కాళేశ్వరరావు**
17. 1923లో స్వరాజ్యపార్టీని స్థాపించింది ? **- చిత్తరంజన్‌దాస్ + మోతీలాల్ నెహ్రూ**
18. 'దేశబంధు' అని ఎవరిని అంటారు ? **- చిత్తరంజన్‌దాస్**
19. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఆద్యుడై, కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షునిగా ఎన్నికైనది ఎవరు ? **- ఎం.ఎన్.రాయ్**
20. ఎం.ఎన్.రాయ్ 'రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ'ని ఎప్పుడు స్థాపించారు ? **- 1940**
21. సహాయ నిరాకరణ ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది ? **- 1921 ఆగస్టు 1న (పంజాబ్ దురంతాలు సరిచేయనందువల్ల ఖిలాఫత్ సమస్య మీద రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభమైంది. 1922 ఫిబ్రవరి 5న ఉత్తరప్రదేశ్‌లోని చౌరీ-చౌరాలో ప్రజలు పోలీసులపై తిరగబడి 22 మంది పోలీసులను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి తగులబెట్టారు. దీంతో గాంధీ 1922 ఫిబ్రవరి 6న సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశారు.**
22. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎప్పుడు స్థాపించారు ? **- 26-4-1926**
23. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రథమ ఉపాధ్యక్షుడు ఎవరు ? **- కట్టమంచి రామలింగారెడ్డి**
24. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విజయవాడ నుంచి ఎక్కడకు మార్చారు ? **- విశాఖపట్నం**
25. 1942 ఆగస్టు 8న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ముంబయిలో గాంధీజీ నాయకత్వాన సమావేశమై క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారు. గాంధీ 'డు ఆర్ డై' అన్న నినాదాలతో సమావేశం ముగించారు. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా గాంధీజీ ఏమన్నారు ? **- 'నాకు స్వాతంత్య్రం వెంటనే కావాలి.. కుదిరితే ఈ రాత్రే.. తెల్లవారేలోపల' అని అన్నారు**
26. 'కర్నూల్ సర్క్యులర్'ను ఎప్పుడు రూపొందించారు ? **- 29-07-1942 (దీన్ని రూపొందించినవారు - కళా వెంకట్రావు)**
27. సహాయ నిరాకరణోద్యమంలో న్యాయస్థానాలను ప్రథమంగా బహిష్కరించింది ? **- గుంటూరు బార్ అసోసియేషన్**
28. ఆంధ్రదేశంలో - మొట్టమొదటి వర్తక స్థావరాలు

డచ్	**- మచిలీపట్నం**	**- 1606**
ఆంగ్లేయులు	**- మచిలీపట్నం**	**- 1611**
ఫ్రెంచ్	**- మచిలీపట్నం**	**- 1669**
పోర్చుగీస్	**- మచిలీపట్నం**	**- 1670**

29. రాయలసీమ ప్రాంతంలో, కంపెనీ పాలనకు వ్యతిరేకంగా సంభవించిన తిరుగుబాట్లలో అతి ప్రధానమైనది ఏది ? **- 1846లో కర్నూలు జిల్లాకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనే పాలేగార్ జరిపిన తిరుగుబాటు**
30. కంపెనీ ప్రభుత్వం - తీరాంధ్ర ప్రాంతంలో - శాశ్వతశిస్తు పద్ధతి ? **- జమీందారీశిస్తు పద్ధతి (రాయలసమీ ప్రాంతంలో ? - రైత్వారీ శిస్తు పద్ధతి)**
31. ఏ సుప్రసిద్ధ బ్రిటిష్ ఇంజనీర్ కృషి ఫలితంగా 1847లో గోదావరిపైన, 1853లో కృష్ణానదిపైన ఆనకట్టలు రూపుదిద్దుకున్నాయి ? **- సర్ ఆర్థర్ కాటన్ (సమాధి -పత్తికొండ)**
32. 19వ శతాబ్ధం చివరలో, శ్రీకాకుళం జిల్లా ఏజెన్సీ ప్రాంతం గిరిజనులు ఎవరి నాయకత్వంలో బ్రిటిష్ వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు ? **- కొర్ర మల్లయ్య**
33. బ్రిటిష్ వలసపాలనలో ఆంధ్రదేశంలో చేపట్టిన ఒకేఒక ప్రధానమైన నీటిపారుదల నిర్మాణం ? **- కర్నూలు - కడప కాలువ**
34. 19వ శతాబ్ధం ద్వితీయార్ధంలో రంపా, రేకపల్లి



తిరుగుబాట్లు ఎప్పుడు జరిగాయి ? **- 1879లో (కారణం - చిరుగు పన్ను, మొదలు పన్ను/ పోడు వ్యవసాయంపై ఆంక్షలు విధించడం (జూమ్ అగ్రికల్చర్) నాయకులు - చంద్రయ్య, పులికంటి సాంబయ్య, తమ్మన్నదొర, అంబుల్‌రెడ్డి)**
35. వీరేశలింగం చేపట్టిన కార్యక్రమాలకు ఉత్సాహ ప్రోత్సాహాలను అందించిన రాజమండ్రి కళాశాల ప్రధానాధికారి ? **- ఇ.పి.మెట్‌కాఫ్ (రాజమహేంద్రవరం)**
36. 1898 సంవత్సరంలో చెన్నయిలో జరిగిన భారత సంఘ సంస్కరణ సభకు అధ్యక్షత వహించినది ఎవరు ? **- కందుకూరి**
37. 1953లో రాష్ట్రాల పునర్వవస్థీకరణకు నియమించిన కమిషన్ ? - ఫజుల్ అలీ కమిషన్ (సభ్యులు : ఛైర్మన్ - ఫజుల్ అలీ, సభ్యులు -హెచ్ఎన్.కుంజ్రూ, కె.ఎం.ఫణికర్)
38. రాయలసీమ పితామహుడు ఎవరు ? **- కల్లూరి సుబ్బారావు**
39. మాక్సిమ్ గోర్కి - రచించిన 'మదర్' నవలను తెలుగులోకి అనువదించిన వారు ? **- క్రొవ్విడి లింగరాజు**
40. శ్రీబాగ్ అనేది ? **- మద్రాస్‌లోని కాశీనాధుని నాగేశ్వరరావు నివాసం (బిరుదు - దేశోద్ధారక)**
41. టంగుటూరి గృహం పేరు ? **- వేదవనము**
42. ఆంధ్రోద్యమ పితామహుడు ? **- కొండా వెంకటప్పయ్య**
43. 'విశాలాంధ్ర ఉద్యమానికి' మొదటి సారిగా పిలుపునిచ్చింది ? **- అయ్యదేవర కాళేశ్వరరావు**
44. 'ఆంధ్రమహిళసభ' వ్యవస్థాపకులు ? **- దుర్గాభాయ్ దేశ్‌ముఖ్**
45. గాంధీజీ ఎన్నో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు ? **- రెండో రౌండ్‌టేబుల్ సమావేశం (1931)**
46. జపాన్ యుద్ధ విమానాలు 06-04-1942న ఆంధ్రలోని ఏ నగరాలపై బాంబులు వర్షం కురిపించాయి ? **- విశాఖపట్నం, కాకినాడ**
47. 28-01-1934న రాయలసీమ మొదటి సమావేశం - చెన్నయిలో ఎవరి అధ్యక్షతన నిర్వహించారు ? **- నెమలి పట్టాభిరామారావు**
48. విజయవాడలో జరిగిన ఆంధ్రమహాసభ రజతోత్సవాలకు హాజరైన రాయలసీమ నాయకుడు ? **- కడప కోటిరెడ్డి**
49. 1891 సంవత్సరంలో నాగ్‌పూర్‌లో జరిగిన ఐఎన్‌సి సమావేశానికి అధ్యక్షత వహించింది ? **- పి.ఆనందాచార్యులు**
50. బ్రాహ్మణేతరులు స్థాపించిన పార్టీ పేరు ? **- జస్టిస్‌పార్టీ**
51. బిరుదులు - వ్యక్తులు

హరికథా పితామహుడు	**- ఆదిభట్ల నారాయణదాసు**
ఆంధ్రనాటక పితామహుడు	**- ధర్మవరం రామకృష్ణాచార్యులు**
కరుణశ్రీ	**- జంధ్యాల పాపయ్యశాస్త్రి**
తెనుగు లెంక	**- తుమ్మల సీతారామమూర్తి చౌదరి**
దక్షిణ భారత గోఖలే	**- మోచర్ల రామచంద్రరావు**
మహర్షి	**- బులుసు సాంబమూర్తి**
కవిభూషణ	**- రాయప్రోలు సుబ్బారావు**

52. ఆంధ్రమహాసభ అధ్యక్షత - స్థలం - సంవత్సరం

ప్రథమ ఆంధ్రమహాసభ	**- 1913**	**- బయ్యా నరసింహేశ్వరశర్మ - బాపట్ల**
రెండో ఆంధ్రమహాసభ	**- 1914**	**- న్యాపతి సుబ్బారావు - విజయవాడ**
మూడో ఆంధ్రమహాసభ	**- 1915**	**- పానుగంటి రామరాయణింగార్ - విశాఖపట్నం**
నాల్గో ఆంధ్రమహాసభ	**- 1916**	**- మోచర్ల రామచంద్రరావు - కాకినాడ**
ఐదో ఆంధ్రమహాసభ	**- 1917**	**- కొండా వెంకటప్పయ్య - నెల్లూరు**

53. జె.వి.పి కమిటీని ఏ సంవత్సరంలో నియమించారు ? **- 1949 (సభ్యులు జవహర్‌లాల్ నెహ్రూ + వల్లభాయ్ పటేల్ + పట్టాభి సీతారామయ్య) (ఈ కమిటీ -1937లో మద్రాసు ప్రెసిడెన్సీలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు గురించి)**
54. 'భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర'ను రాసింది ? **- డా.భోగరాజు**
55. గుంటూరులో 'శారదానికేతనం'ను స్థాపించింది ? **- ఉన్నవ లక్ష్మీనారాయణ + లక్ష్మీబాయమ్మ**
56. తెలుగు భాషలో వెలువడిన మొట్టమొదటి పత్రిక ? **- సత్యదూత (దీన్ని ప్రచురించింది -బళ్లారి క్రైస్తవ సంఘం)**
57. తెలుగు భాషలో వెలువడిన మొట్టమొదటి రాజకీయ వార పత్రిక ? **- ఆంధ్రప్రకాశిక (1885 సంవత్సరంలో మద్రాసు నుంచి, సంపాదకుడు -ఎపి పార్థసారథి నాయుడు)**
58. పెద్దమనుషుల ఒప్పందం ఎప్పుడు జరిగింది ? **- 20-02-1956**
59. పత్రిక - వ్యక్తులు

కృష్ణా	**- కొండా వెంకటప్పయ్య**
వివేకవర్ధిని	**- కందుకూరి**
హాస్యసంజీవిని	**- కందుకూరి**
ఆంధ్రభాషా సంజీవిని	**- కొక్కొండ వెంకటరత్నం పంతులు**
వైజయంతి	**- పి.ఆనందాచార్యులు**
ఆంధ్రపత్రిక హితబోధిని, నీలగిరి ప్రతిభ	**- కాశీనాథుని నాగేశ్వరరావు**
దేశమాత	**- చిలకమర్తి లక్ష్మీనరసింహం**

60. 1952 అక్టోబరు 19 నుంచి పొట్టిశ్రీరాములు మద్రాసులోని మైలాపూర్‌లో ఎవరి నివాసగృహంలో ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు ? **- బులుసు సాంబమూర్తి**
61. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం భారత ప్రభుత్వం నియమించిన కమిటీ ? **- కైలాసనాథ్‌వాంఛూ కమిటీ**
62. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ పొట్టిశ్రీరాములు ఎప్పుడు అమరజీవి అయ్యారు ? **- 15 డిసెంబర్ 1952**
63. ఆంధ్రరాష్ట్రం (01-10-1953)

ప్రథమ ముఖ్యమంత్రి	**- టంగుటూరి**
ప్రథమ ఉపముఖ్యమంత్రి	**- నీలంసంజీవరెడ్డి**
గవర్నర్	**- చందూలాల్ మాధవ్‌త్రివేది**
స్పీకర్	**- వెంకటరామయ్య**
రాజధాని	**- కర్నూలు**
హైకోర్టు	**- గుంటూరు**

ఆంధ్రప్రదేశ్ (01-11-1956)

ప్రథమ ముఖ్యమంత్రి	**- నీలం సంజీవరెడ్డి**
గవర్నర్	**- చందూలాల్‌మాధవ్ త్రివేది**
స్పీకర్	**- అయ్యదేవర కాళేశ్వరరావు**
రాజధాని	**- హైదరాబాద్**
హైకోర్టు	**- హైదరాబాద్**

64. 'విదేశీ వస్త్రాలను త్యజించి, ఖద్దరు దుస్తులు ధరించిన మొట్టమొదటి ఆంధ్ర మహిళ ఎవరు ? **- మాగంటి అన్నపూర్ణమ్మ**
65. 1948లో ధార్ సంఘాన్ని ఎందుకు నియమించారు ? **- భాషాప్రయోక్తరాష్ట్రాల ఏర్పాటు గురించి (దీని అధ్యక్షుడు -ఎస్.కె.ధార్, సభ్యులు - పన్నాలాల్, జగత్ నారాయణ్)**

ఉద్యోగాలు

హెచ్‌సీఎల్‌లో అప్రెంటీస్‌షిప్

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్) వివిధ ట్రేడ్‌లలో అప్రెంటీస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

టేడ్‌ల వారీగా ఖాళీలు : ఫిట్టర్-20, ఎలక్ట్రీషియన్-16, వెల్డర్ (జీ అండ్ ఈ)-3, మెషీనిస్ట్-1, టర్నర్-2.

శిక్షణ వ్యవధి : ఏడాది, **స్టైపెండ్ :** ఏడాది ఐటీఐ కోర్సు పూర్తిచేసిన వారికి రూ.4576. రెండేళ్ల ఐటీఐ కోర్సు పూర్తి చేసినవారికి రూ.5148.

విద్యార్హత : ఉన్నత పాఠశాల విద్య/ తత్సమానం + సంబంధిత ట్రేడ్‌లలో 60 శాతం మార్కులతో ఐటీఐ. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులున్నా సరిపోతుంది.

గమనిక : 2014కు ముందు ఐటీఐ ఉత్తీర్ణులు అనర్హులు.

వయసు : 2017 ఆగస్టు 10 నాటికి 18-25 ఏళ్ల ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం : నిర్దేశిత చిరునామాకు స్పీడ్ పోస్టులో పంపాలి.

దరఖాస్తు చివరి తేదీ : ఆగస్టు 19, 2017.

వెబ్‌సైట్ : www.hindustancopper.com

లౌకికవాదంపై దాడిని తిప్పికొట్టండి

- లాంగ్ మార్చ్ సభలో నేతల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లౌకిక వాదంపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలని కమ్యూనిస్టు నాయకులు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంయుక్తంగా కన్యాకుమారి నుంచి చేపట్టిన లాంగ్ మార్చి బస్సు యాత్ర సోమవారం విజయవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని లెనిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భహిరంగ సభ నిర్వహించారు. సభలో ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వజిత్ కుమార్ మాట్లాడుతూ గోసంరక్షక సంఘాల పేరుతో దళితులపై జరుగుతున్న దాడులను ఖండిచారు. మోడీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను భలోపేతం చేయడం, యువతకు ఉద్యోగవకాశాలు కల్పించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై మాట్లాడుతూ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టలేదన్నారు. యువత నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో లౌఖిక వాదం పెనుప్రమాదంలో ఉందన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రయోజనాలను విడనాడి మోడీ ముందు మోకరిల్లుతున్నాయని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మదు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో వైఎఫ్ జాతీయ నాయకులు అలంఖాన్, ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు వల్లీ ఉల్లా ఖాద్రీ, జెఎన్‌యు నాయకురాలు అపరాజిత, వైఎఫ్, ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో అభివాదం చేస్తున్న ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ జాతీయ నేతలు విశ్వజిత్, అపరాజిత్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు తదితరులు

కాషాయీకరణ ముసుగులో మాఫియా : నారాయణ

కాషాయీకరణ ముసుగులో ఆర్థిక, భూ, డ్రగ్స్ మాఫియా తయారైందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఈ మాఫియాకు గుజరాత్ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ సంయుక్తంగా కన్యాకుమారి నుంచి చేపట్టిన లాంగ్‌మార్చ్ బస్సు యాత్ర సోమవారం గుంటూరు జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిమా గార్డెన్స్‌లో నిర్వహించిన సభలో నారాయణ మాట్లాడారు. బిజెపి పాలనలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్య రక్షణకు యువత మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఇటువంటి విధానాలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేంద్రం వద్ద మోకరిల్లుతున్నారని, ఇది రాష్ట్ర ప్రయోజనాలకు భంగకరమైందని చెప్పారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి విశ్వజిత్‌కుమార్, ఎఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి తిరుమలైలు ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరావు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జె.విశ్వనాథ్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన బదిలీల జాతర

నేడు పాఠశాలల్లోకి ఉపాధ్యాయులు

కర్నూలులో ఆగిన ఆర్డర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల బదిలీల జాతర సోమవారంతో ముగిసింది. రెండు నెలల తరువాత ఉపాధ్యాయులు బదిలీల ఫీవర్ నుంచి బయటపడ్డారు. ఉపాధ్యాయుల బదిలీల ఆర్డర్లను పాఠశాల విద్యాశాఖ జూలై 30న వైబ్‌సైట్‌లో పొందుపర్చాల్సి ఉండగా 31న పొందుపరిచింది. దీంతో ఇప్పటివరకు బదిలీ అయిన ఉపాధ్యాయులు తమ బదిలీ కాపీలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వైబ్‌సైట్ నుంచి బదిలీ అర్డర్లను సోమవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,0,5,957 మంది ఉపాధ్యాయులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 59,970 మంది తప్పనిసరి బదిలీ కావాల్సిన వారు కాగా, 45,987 మంది రిక్వెస్టు బదిలీ వారు ఉన్నారు. అయితే ఇప్పటి వరకు 48,416 మంది బదిలీ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో తప్పనిసరి బదిలీ వారు 10,833మంది కాగా, రిక్వెస్టు బదిలీ వారు 5,360 అర్డర్లు తీసుకున్నారు. జులై 30తో కౌన్సెలింగ్ ముగిసిన ఉపాధ్యాయులు 31న రిలీవ్ అయి, ఆగస్టు 1న బదిలీ అయిన పాఠశాలలో చేరాలి. జులై 31న బదిలీ అయిన ఉపాధ్యాయులు 1న రిలీవ్ అయి 2న బదిలీ పొందిన పాఠశాలలో చేరాలి. ఎస్జీటీలకు కౌన్సిలింగ్ కూడా మంగళవారంతో ముగిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లా ఎస్జీటీలకు సోమవారం నుంచి ప్రారంభమవడంతో మరో రెండు రోజులు సమయం పట్టవచ్చు. చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన బదిలీలు ప్రారంభం కావాల్సి ఉంది. నెల్లూరు జిల్లా బదిలీలు రెండు రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కర్నూలు జిల్లా ఉపాధ్యాయులకు బదిలీల ఆర్డర్లు నిలిపివేశారు. నంద్యాల నియోజక వర్గానికి ఉప ఎన్నికల నేపథ్యంలో బదిలీల పత్రాలను ఆ జిల్లా అధికారులు ఆపేశారు. దీనిపై కూడా మంగళవారం నిర్ణయం వెలువడే అవకాశం ఉంటుంది. లేదంటే ఎన్నికలు ముగిసే వరకు పాత పాఠశాలల్లోనే కొనసాగాల్సి ఉంటుంది.

స్పాట్ బహిష్కరణ రోజు సెలవు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో, జాక్టో సంఘాల పిలుపు మేరకు ఏప్రిల్ 11న స్పాట్ బహిష్కరణలో పాల్గొన్న ఉపాధ్యాయుల వ్యక్తి ఖాతాలోని క్యాజువల్ సెలవు, స్పెషల్ క్యాజువల్‌గా మంజూరు చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్ , కమిషనర్ కె సంధ్యారాణి ఉత్తర్వులు విడుదల చేశారు. ఫ్యాప్టో, జాక్టో సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

న్యాయం కోసం మత్స్యకారుల రాస్తారోకో

ప్రజాశక్తి-ముమ్మిడివరం(తూర్పుగోదావరి)

ప్రమాదంలో మృతి చెందిన మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలంటూ బంధువులు, గ్రామస్తులు తూర్పుగోదావరి జిల్లా ముమ్మడివరం సమీపంలోని 216 జాతీయ రహదారి వద్ద సోమవారం రాస్తారోకో చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్‌లో మంత్రి కళా వెంకట్రావు కాన్వాయ్ చిక్కుకుంది. కాట్రేనికోనకు మండలం దొంతకుర్రుకు చెందిన పినపోతు సత్యనారాయణవర్మ అయినాపురంలో ఆదివారం ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందారు. తమకు న్యాయం చేయాలని వారు రాస్తారోకో చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తులతో చర్చించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సాగునీరందించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి- పాలకొండ (శ్రీకాకుళం జిల్లా)

శివారు భూములకు సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ తోటపల్లి ఆయకట్టు సాధన పోరాట సమితి ఆధ్వర్యాన రైతులు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. పాలకొండ మండల కేంద్రంలోని కోటదుర్గమ్మ ఆలయం కూడలి నుంచి ర్యాలీగా వచ్చి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా పోరాట సమితి అధ్యక్ష, కార్యదర్శులు చేబోదుల లక్ష్మీనారాయణ, బి.అప్పలనాయుడు మాట్లాడుతూ తోటపల్లి ఎడమ కాలువ ద్వారా శివారు భూములకు నీరందకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయన్నారు. కాలువను ఆధునికీకరించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోనందున ఏటా ఖరీఫ్‌లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ డిఇఇ గనిరాజుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

కర్నూలులో మద్యం షాపు ధ్వంసం

- ఫర్నీచర్‌కు నిప్పంటించిన మహిళలు
- అఖిలపక్ష నాయకుల అరెస్టు, విడుదల
- గుంటూరులో దిష్టిబొమ్మ దహనం



కర్నూలులో మద్యం షాపు ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి నిప్పంటిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జనావాసాల మధ్య మద్యం షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐల ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న ఆందోళనలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. కర్నూలులోని ఇందిరమ్మ విగ్రహం నుంచి వందలాది మంది మహిళలు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం మద్యంషాపులను ముట్టడించారు. టిడిపి, బిజెపి, సిపిఎం, వైసిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీరశైవ లింగాయత్ సంఘం, చేనేత సంఘాల ప్రతినిధులు, ఐద్వా కార్యకర్తలు, మహిళలు దుకాణ తలుపులు, గ్రిల్స్‌ను రాళ్లతో పగులగొట్టారు. ఫర్నీచర్‌నూ ధ్వంసం చేసి నిప్పంటించారు. ఈ క్రమంలో మహిళా పోలీసులు, ఎస్ఐలు, సిఐలు మహిళలను అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. అనంతరం అఖిలపక్ష పార్టీ నేతల సూచన మేరకు ఈద్గా దగ్గర కార్యకర్తలు అరగంటసేపు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిపిఎం, టిడిపి, వైసిపి, బిజెపి నాయకులు జి.రామకృష్ణ, ఎస్‌వి.రామకృష్ణ, ఎస్.ఫిరోజ్, జగదీష్, వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు చంద్రశేఖరప్పను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి, నాల్గో టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు లక్ష్మీదేవి, ఐద్వా నాయకులు పి.నిర్మల, సిపిఎం నాయకులు గోవిందును కూడా అరెస్టు చేశారు. అనంతరం సిఐ నాగరాజారావు, అఖిలపక్ష నాయకులతో చర్చించి సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.పశ్చిమగోదావరి జిల్లా భీమడోలులో తహశీల్దార్ రవికుమార్‌కు మద్యం షాపుల నిర్వహణపై మహిళలు ఫిర్యాదు చేశారు. సిపిఎం నరసాపురం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు సబ్ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. గుంటూరులో ప్రగతినగర్ పక్కన ఏర్పాటు చేయబోతున్న మద్యం షాపును వ్యతిరేకిస్తూ స్థానికులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. మద్యం మహమ్మారి దిష్టిబొమ్మను మహిళలు దహనం చేశారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నగర కన్వీనర్ షేక్ షకీల, ఐద్వా ప్రగతినగర్ కార్యదర్శి సిహెచ్ ఓబులేశ్వరి, సిఐటియు నగర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సిపియం ప్రగతినగర్ శాఖ కార్యదర్శి సిహెచ్ శేషగిరి పాల్గొన్నారు. సుద్ధపల్లిడొంక వద్ద ఆందోళనలో భాగంగా జెడ్‌పిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. జెడ్‌పి హాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించే క్రమంలో పోలీసులతో కొంత వాగ్వాదం తలెత్తింది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు. తుళ్లూరులో మద్యం దుకాణం ఏర్పాటుకు యాజమానులు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ మేరీమాత హైస్కూల్ యాజమాన్యం, పిల్లల తల్లి దండ్రులు సర్పంచ్‌ను కలిసి విన్న వించారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. దుకాణాన్ని పెట్టకుండా చూసుకుంటామని తహశీల్దార్ హామీనిచ్చారు.

'అనంత' రాస్తారోకో

మద్యం షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐల ఆధ్వర్యంలో అనంతపరంలో రాస్తారోకో చేపట్టారు. గుత్తి రోడ్డులో నిరసన తెలిపారు. ఈ రాస్తారోకోతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, ఆంజినేయులు పాల్గొన్నారు.

2న అంగన్‌వాడీల ధర్నాలు

ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

అంగన్‌వాడీ కేంద్రాల కుదింపును నిరసిస్తూ ఆగస్టు 2న రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. సోమవారం విజయనగరంలోని ఎన్‌పిఆర్ భవనంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మున్సిపల్ పట్టణ కేంద్రాల్లో 3,126 అంగన్‌వాడీ కేంద్రాలను 1,026 కేంద్రాలుగా కుదించాలని తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రాల కుదింపుతో పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందుతున్న ఆరు రకాల అంగన్‌వాడీ సేవలు దూరం కానున్నాయని తెలిపారు. ప్రతి జనావాస పరిధిలో అంగన్‌వాడీ సేవలందించాలని ఇచ్చిన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి 400 నుంచి 800 మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రం, 150 నుంచి 400 జనాభా పరిధిలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ పాల్గొన్నారు.

విశాఖ ఆర్‌డిఒ కక్ష సాధింపు

ఎమ్మెల్యే పీలా గోవింద్ ఆరోపణ

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఆనందపురం మండలం రామవరంలో 69 ఎకరాల భూమిపై తమ కుటుంబం పూర్తి హక్కులు కలిగివుందని, ఆ భూమి రికార్డులు తారుమారు, ఆక్రమణలతో తమకేమీ సంబంధం లేదని అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. తనపై పత్రికల్లో వస్తున్న కథనాలన్నీ అవాస్తవాలని చెప్పారు. తనకు జరిగిన అన్యాయంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు సోమవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత విశాఖపట్నం ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు హైదరాబాద్‌కు చెందిన వంశీ అనే ఆయన్ను తన ఇంటికి తీసుకొచ్చి తనకు చెందిన భూమిని ల్యాండ్ డెవలెప్‌మెంట్‌కు అడిగారని, అందుకు తాను నిరాకరించానని చెప్పారు.

ప్రజ్ఞ

జవాబులు

1. స్కాట్లాండ్
2. మోదుకూరి నాగరాజు
3. పది
4. ఢిల్లీ మెట్రో
5. అమెరికా

ఉద్యోగుల జోలికొస్తే ఊరుకోం..

- 8న ఢిల్లీలో కార్మిక సంఘాల నేతల సమావేశం
- జాతీయ స్థాయిలో ప్రత్యక్ష కార్యాచరణ
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్



విశాఖలో ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు గఫూర్, ఎస్.రమేష్, ఉత్తరాంధ్ర జిల్లాల కార్మికులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

30ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులను పెర్ఫార్మెన్స్ పేరుతో రిటైర్మెంట్ చేయాలనే దురాలోచనతో చంద్రబాబు ప్రభుత్వం ముసాయిదాను సిద్ధం చేసి వేటు వేసేందుకు చూస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్ ఉద్ఘాటించారు. సోమవారం విశాఖ నగరం జగదాంబ జంక్షన్‌లోగల సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గఫూర్ మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం తొలి నుంచీ కార్మికులు, ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదనడానికి ఇదే తార్కాణమని పేర్కొన్నారు. ఏ ముసాయిదా తయారైనా మంత్రి సంతకం లేకుండా బయటకు రాదని, మంత్రి యనమల అటువంటిదేమీ లేదని చెప్పడం సరైంది కాదని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఉద్యోగుల పెర్ఫార్మెన్స్‌కు సంబంధించిన ఫైలు వేగంగా కదులుతోందని, లోకేష్ ఆదేశాల్లేకుండా ఇది జరగదన్నారు. ఒకవేళ అదే నిజమైతే ఆ ముసాయిదాను బయటకు తెచ్చిన అధికారులపై ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. 279 జీవోను మున్సిపాల్టీల్లో తీసుకొచ్చి వర్కర్లను అవుట్‌సోర్సింగ్‌కు కాకుండా అవుట్‌సోర్సింగ్ విధానాన్నే కాంట్రాక్ట్‌కు ఇచ్చేయమని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. దీన్ని ఒక్క మున్సిపాల్టీలకే పరిమితం చేయకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వర్తింపజేస్తామని మంత్రి యనమల చెప్పడం అత్యంత దుర్మార్గమైన చర్యగా గఫూర్ అభివర్ణించారు. ఈ సమావేశంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు కూడా పాల్గొన్నారు.

ఇఎస్ఐ రీజనల్ కార్యాలయం ఎదుట ధర్నా

ఇఎస్ఐ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, విశాఖలోని షీలానగర్‌లో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మర్రిపాలెంలో ఉన్న ఇఎస్ఐ రీజనల్ కార్యాలయం ఎదుట ఉత్తరాంధ్ర జిల్లాల కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలను బలహీనపర్చే కుట్రలు సాగుతున్నాయన్నారు. ఇఎస్ఐ ద్వారా వచ్చిన సొమ్మును ఇతర అవసరాలకు మళ్లించి కార్మికుల జీవనాన్ని దుర్భరం చేసే హక్కు ప్రభుత్వాలకు ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఇఎస్ఐ నిధి రూ.57 వేల కోట్లు ఉందని, ఆ మొత్తాన్ని కాజేసేందుకు చూస్తోందని తెలిపారు. శ్రీకాకుళం, తగరపువలస, రాజాం, పైడిభీమవరం తదితర చోట్ల ఉన్న ఆసుపత్రుల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామకోటిని కలిసి సమస్యలను వివరించారు.

సదావర్తి సత్రం భూములకు రూ.27.44 కోట్లు చెల్లించాం : ఆర్కే

ప్రజాశక్తి - హైదరాబాద్

చెన్నైలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన సదావర్తి సత్రం భూములకు 27 కోట్ల 44 లక్షల 625 రూపాయలను ఆశాఖ కమిషనర్‌కు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి చెల్లించారని ఆయన తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు శుక్రవారం తెలియజేశారు. అత్యంత విలువైన సదావర్తి సత్రం భూములు 83 ఎకరాలను వేలం పేరుతో అతి తక్కువ ధరకే తెలుగుదేశం పార్టీకి చెందిన వారికే ఇచ్చేశారంటూ ఎమ్మెల్యే ఆర్కే హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విసయం విదితమే. వేలంలో పలికిన ధర కంటే రూ.5 కోట్లు అదనంగా చెల్లించే వారికి ఆ భూముల్ని ఇచ్చేస్తామని ప్రభుత్వం హైకోర్టులో చెప్పింది. అందుకు సిద్ధమేనా అని ఆర్కేను ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి టి.రజనీలతో కూడిన ధర్మాసనం గతంలోనే ప్రశ్నించింది. ఆర్కే లేదా ఆయన తీసుకొచ్చే వ్యక్తి లేదా కంపెనీ అదనంగా రూ.5 కోట్లు చెల్లిస్తారో లేదో తెలపాలని బెంచ్ కోరగా అందుకు ఆర్కే సమ్మతిని తెలియజేశారు. తొలివిడతగా రూ. 10 కోట్లు చెల్లించిన ఆర్కే తాజాగా రెండో విడతగా మిగిలిన మొత్తాన్ని చెల్లించినట్లుగా ఆయన న్యాయవాది పొన్నవోలు సోమవారం హైకోర్టుకు తెలిపారు. కేసు విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా పడింది.

ఉపాధ్యాయుల పదోన్నతులపై యథాతథ స్థితి కొనసాగించాలి

ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

రాష్ట్రపతి జారీ చేసిన ఏకీకత సర్వీసు నిబంధనల ఉత్తర్వుల మేరకు పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల కల్పన ప్రక్రియపై యథాతథ పరిస్థితిని కొనసాగించాలని హైకోర్టు తెలంగాణ సర్కార్‌ను ఆదేశాలిచ్చింది. ఈమేరకు న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి టి. రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఏకీకత సర్వీసు నిబంధనలకు రాష్ట్రపతి జూన్ 23న ఆమోదం చెప్పడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి వీరాచారి, ఇతరులు హైకోర్టులో సవాల్ చేసిన కేసులో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. రాజ్యాంగంలోని 371(డి) అధికరణానికి భిన్నంగా ఏకీక త సర్వీసు నిబంధనలకు రాష్ట్రపతి ఆమోదం చెప్పారని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషనర్ల సీనియర్ న్యాయవాది ఎస్.రామచంద్రరావు వాదించారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతుల చర్యలను అడ్డుకోవాలన్నారు.రాష్ట్రపతికి అధికారం ఉందని తెలంగాణ రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్‌రావు బదులిచ్చారు. 371(డి)(1) ప్రకారం ఏకీకత సర్వీసు నిబంధనలకు రాష్ట్రపతి ఆమోదం చెప్పవచ్చునన్నారు. విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును ఉండవల్లిలోనే ఏర్పాటు చేయాలి

హైకోర్టును ఆశ్రయించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్

రాజధాని భూముల కోసం ఏపీ సర్కార్ అనుసరించిన ల్యాండ్ పూలింగ్ స్కీంకు సహకరించడం లేదనే తమ గ్రామంలో పెట్టాల్సిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును మరో గ్రామం యర్రబాలెంలో ఏర్పాటు అన్యాయమని పేర్కొంటూ ఉండవల్లి గ్రామస్తులు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. యర్రబాలెం గ్రామానికి కార్యాలయాన్ని మార్పు చేస్తూ మెమో కూడా ఇచ్చారని, ఈ నిర్ణయాన్ని అమలు కాకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉండవల్లి రైతులు ఎం.కేశవ నారాయణరెడ్డి, కళ్లెం సంజీవరెడ్డి, చందు వెంకట రామయ్యలు పిల్ దాఖలు చేశారు. ఉండవల్లి, పెనుమాక గ్రామాలకు చెందిన రైతులు ల్యాండ్ పూలింగ్‌కు చేయూత ఇవ్వడం లేదనే కక్షతోనే కార్యాలయాన్ని తరలించేయాలని నిర్ణయించారని, తమకు పార్టీలతో సంబంధం లేదని, తమ హక్కుల మేరకే ల్యాండ్ పూలింగ్‌ను వ్యతిరేకిస్తున్నామని వ్యాజ్యంలో పేర్కొన్నారు. విజయవాడ, మంగళగిరి, అమరావతి సీడ్ కాపిటల్‌కు సమీపంలో తమ గ్రామం ఉందని, బ్యాంకులు కూడా ఉన్నాయని, యర్రబాలెంలో ఏ సౌకర్యాలు లేకపోయినా ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని అడ్డుకోవాలని రైతులు కోరారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోవడంతో హైకోర్టుకు రావాల్సివచ్చిందని వివరించారు. ఈ కేసులో ప్రతివాదులుగా సీఆర్‌డీఏ కమిషనర్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ముఖ్య కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, జిల్లా రిజిస్ట్రార్‌లను చేశారు.

టీడీపీ నేతలపై కేసుల ఉపసంహరణ జీవోలపై హైకోర్టులో వ్యాజ్యం

- వాటిని రద్దు చేయాలని పిల్ దాఖలు చేసిన వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన పెద్దలు 274 మందిపై ఉన్న కేసుల్ని రద్దు చేస్తూ పలు జీవోలు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ ఉమ్మడి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. చంద్రబాబునాయుడు తన మంత్రివర్గంలోని కొందరు సభ్యులు, అధికార టీడీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ నేతలపై గతంలో పోలీసులు నమోదు చేసిన కేసుల్ని ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ తేదీల్లో జారీ చేసిన పలు జీవోలను కొట్టేయాలని కోరుతూ మంగళగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ఉమ్మడి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. టీడీపీ మంత్రులు, ఇతర పార్టీ నేతలపై నమోదైన కేసులకు సంబంధించి పలు కోర్టుల్లో జరుగుతున్న ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆయా కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని ఆ పిల్‌లో ఎమ్మెల్యే ఆర్కే పేర్కొన్నారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమైన ఆ జీవోలు కొట్టేయాలని హైకోర్టును కోరారు. 274మంది టీడీపీ నేతలపై కేసుల ఉపసంహరణకు ఏపీ సర్కార్ 132 జీవోలు జారీ చేసింది. కేసుల ఉపసంహరణ జాబితాలో అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్, పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఉన్నట్లు ఆర్కే తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏపీ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఉప ముఖ్యమంత్రి కేఈ కష్ణమూర్తి, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు, సిద్దా రాఘవరావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు కరణం బలరాం, ఎమ్మెల్యేలు నందమూరి బాలకష్ణ, టీవీ రామారావు, గొల్లపల్లి సూర్యారావు, దాట్ల సుబ్బరాజు, దాసరి బాలవర్ధనరావు, చింతమనేని ప్రభాకర్, ఎ.ఆనందరావు, ఎం.అశోక్‌రెడ్డిలతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తలను కలిపి మొత్తం 274 మందిపై కేసులను చంద్రబాబు సర్కార్ రద్దు చేసిందని పిల్‌లో పేర్కొన్నారు. 274 మందిని వ్యక్తిగత హెూదాలో ప్రతివాదులుగా చేర్చారు. డీజీపీ, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి, వివ్విద జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా చేశారు. ఈ పిల్‌ను హైకోర్టు విచారించనుంది.

ఆ గదులను ఏపీ ఎన్జీవోకు అప్పగించండి

హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్

హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని ఏపీ ఎన్జీవో భవన్‌లోని కొన్ని గదులకు తెలంగాణ భాగ్యనగర్ ఎన్జీవో అసోసియేషన్ వేసిన తాళాలు, అక్కడ పెట్టిన బోర్డులు తీసి ఏపీ ఎన్జీవో సంఘానికి అప్పగించాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి టి.రజనీలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం తీర్పు వెలువరించింది. ఏపీ ఎన్జీవో సంఘంలో సభ్యత్వం ఉన్న భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్‌లోని వారు ఏటా చందా బకాయిలు చెల్లించి, ఆ విధంగా వార్షిక చందాను రెండు వారాల్లోగా చెల్లించిన వారికి ఏపీ ఎన్జీవో భవన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏపీ ఎన్జీవో సంఘాన్ని ఆదేశించింది. వీరికి ప్రత్యేకంగా గదులు కేటాయించరాదని, అదే సమయంలో ఏపీ ఎన్జీవో సంఘంలోని వారికి ఉన్న అన్ని వసతులు వీరికి కూడా ఉండాలని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఏపీ ఎన్జీవో భవనంలోని కొంత మేరకు భాగాన్ని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవోకు ఇస్తూ జీఏడీ ఆదేశాల మేరకు హైదరాబాద్ కలెక్టర్, ఆర్డీవోలు ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఏపీ ఎన్జీవో సంఘం సవాల్ చేసిన కేసులో ఆ ఉత్తర్వులను 8 వారాలు నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఆదేశాలిచ్చారు. దీనిని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అప్పీల్ చేసిన కేసులో నేడు ఈతీర్పు వెలువడింది.

యోగిపై పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు

అలహాబాద్ : ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యానాథ్‌ను విచారించడానికి అనుమతి నిరాకరించడంపై దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. 2007 గోరఖ్‌పూర్ మత అల్లర్ల కేసులో ఆదిత్యనాథ్‌ను సిబిఐ విచారించడానికి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో పర్వేజ్ పర్వాజ్, అసాద్ హయత్‌లు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ కృష్ణ మురారి, అఖిలేష్ చంద్ర శర్మలతో కూడిన బెంచ్ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ నెల 9న పిటిషన్‌ను విచారించనుంది. ఈ లోగా కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ కేసులో యోగితో పాటు గోరఖ్‌పూర్ మేయర్ అంజు చౌదరీ, స్థానిక ఎమ్మెల్యే రాధా మోహన్ దాస్ అగర్వాల్ కూడా నిందితులుగా వున్నారు. పిటిషన్ వేసిన పర్వేజ్ పర్వాజ్ కూడా నిందితుడిగా వుండగా, హయత్ సాక్షిగా వున్నాడు.

చంద్రశేఖర్‌పై దాడి కేసు దర్యాప్తు



సహరన్‌పూర్ : భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌పై దాడి సంఘటనలో దర్యాప్తు ప్రారంభమైనట్లు భీమ్ ఆర్మీ తెలిపింది. సహరన్‌పూర్ జైలులో చంద్రశేఖర్‌పై గత నెలలో దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ ఆఫీస్ బేరర్లతో కలిసి జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట ఘెరావ్ చేశామని భీమ్ ఆర్మీ నగర అధ్యక్షులు ప్రవీణ్ గౌతమ్ ఇక్కడ విలేకరుకు తెలిపారు. ఆ సందర్భంగా దాడి సంఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీనికి మెజిస్ట్రేట్ స్పందిస్తూ చంద్ర శేఖర్‌కు భద్రతను పటిష్టం చేశామని, దాడి కేసులో దర్యాప్తు ప్రారంభమైందని చెప్పినట్లు ప్రవీణ్ వెల్లడించారు. వృత్తి రీత్యా న్యాయవాది అయిన చంద్రశేఖర్‌ను జూన్ 8న ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. సహరన్‌పూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనల్లో ప్రమేయముందన్న ఆరోపణలపై హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసిలో చంద్రశేఖర్‌ను అరెస్టు చేశారు. సహరన్‌పూర్‌లోని దళితులపై జరిగిన హింసాత్మక సంఘటనలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలు నిర్వహించడంతో చంద్రశేఖర్ వెలుగులోకి వచ్చారు.

లించిస్థాన్‌గా మార్చొద్దు

లోక్‌సభలో కాంగ్రెస్



న్యూఢిల్లీ:. భారతదేశం హిందూస్థాన్ అని దీన్ని లించిస్థాన్(అకారణంగా హత్యలు చేసే)గా దేశంగా మార్చొద్దంటూ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ పక్ష నేత మల్లిఖార్జున ఖార్గే అన్నారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లు రెండూ ఇలాంటి హత్యలకు కేంద్ర బిందువులుగా మారాయన్నారు. గో సంరక్షణ పేరుతో ప్రభుత్వం పరోక్షంగా ఎన్‌కౌంటర్ చేయిస్తోందని బిజెపిపై విమర్శల దాడి చేశారు. ఈ దాడుల పట్ల మోడీ తన వైఖరిని పార్లమెంట్‌కు తెలియజేయాలన్నారు. బిజెపి నేరుగా ఈ దాడులు చేస్తున్నదని తాను చెప్పడం లేదనీ, పరోక్షంగా బిజెపి అనుబంధ సంఘాల ప్రోత్సాహంతో ఈ 'ఎన్‌కౌంటర్'లు జరుగుతున్నాయన్నారు. విహెచ్‌పి, భజరంగదళ్, గోగూండాలు ఈ హత్యల్లో భాగస్వాములవుతున్నారన్నారు. గోడ్డు మాసం సరఫరా చేస్తున్నారనే సాకులు చూపుతూ జార్ఖండ్‌లో గో గూండాలు ఇటీవల చేసిన దాడులను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే బిజెపి నేత నిష్కంత్ దుబే దీనికి అడ్డుచెప్పాడు. ఆ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై ఖార్గే స్పందిస్తూ 'దళితులపై దాడుల నేపథ్యంలో ఎన్నిచోట్ల అరెస్టులు జరిగాయనీ, ఎంత మందిని అరెస్టు చేశారనీ' ప్రశ్నించారు. దోషుల మీద తీసుకున్న చర్యలు ఏమిటన్నారు. కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు దారుడు హత్యకు గురైతై ఆ రాష్ట్ర గవర్నర్ పోలీసు చీఫ్‌కు సమన్లు జారీ చేశాడనీ, మిగిలిన రాష్ట్రాల్లో అలాంటి చర్యలు ఎందుకు లేదని ప్రశ్నించారు. అయితే వర్షాకాల సమావేశాలకు ముందు ప్రధాని మోడీ అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వాలు గో గూండాలపై రాష్ట్ర ప్రభుత్వాలే చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా అవినీతి పోరులో ప్రతిపక్షాలు కలిసిరావాలన్నారు. గో గూండాలపై దాడికి ప్రతిపక్షాలు కూడా సహకరించాలన్నారు. ఎక్కువ మంది హిందువులు ఆవును తల్లితో సమానంగా చూస్తారాన్నరు. అయితే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదన్నారు.

రాజ్‌బబ్బర్‌పై పోలీసుల ప్రతాపం, గాయాలు



న్యూఢిల్లీ : నటుడు, ఎంపి రాజ్ బబ్బర్‌పై పోలీసుల ప్రతాపం చూపారు. దీంతో అతను గాయపడ్డాడు. వివరాల్లో వెళితే ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలోని గ్రామస్తుల ఇళ్లను ప్రభుత్వాధికారులు కూల్చివేశారు. దీనికి నిరసనగా గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వీరికి మద్దతుగా రాజ్‌బబ్బర్ కూడా ఈ నిరసనలో పాల్గొన్నాడు. అయితే వీరిపై పోలీసులు ప్రతాపం చూపారు. ఈ ఘటనలో రాజ్‌బబ్బర్‌కు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ తెలిపారు. గాయల కారణంగా రాజ్‌బబ్బర్ పార్లమెంట్‌కు హాజరుకాలేదని తెలిపారు. రాజ్ బబ్బర్‌కు భద్రత పెంచాలని రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. సభ్యులు ఫిర్యాదు చేస్తే భద్రత పెంచుతామని డిప్యూటీ చైర్మన్ పిజె కురియన్ తెలిపారు.



రైతు కష్టాలకు కారణాలెన్నో...

లభించని గిట్టుబాటు ధర, పెరగని దిగుబడి శాతం

న్యూఢిల్లీ : దేశంలో రైతు పరిస్థితి అత్యంత దీనస్థితిలో వుంది. దశాబ్దాల కాలం గడుస్తున్నా.. రైతన్నల పరిస్థితిలో ఎలాంటి మార్పులు రావడం లేదు. పైగా గతంలో పోల్చుకుంటే ఇంకా దిగజారుతోంది. నిజం చెప్పాలంటే రైతు చేసే ఉత్పత్తితో అతని కుటుంబం గడవడం చాలా కష్టం. ఇందుకు అనేక కారణాలు వున్నాయి. కేవలం గిట్టుబాటు ధర లభించకపోవడమే కాదు ఇంకా అనేక సమస్యలు రైతును చుట్టుముడుతున్నాయి. దిగుబడి శాతం, నీటి పారుదల సౌకర్యంలో కూడా మెరుగుదల లేదు. సుమారు 20 సంవత్సరాలకు పై నుంచి దేశంలో కాలువల విస్తీర్ణాన్ని ప్రభుత్వం విస్తరించలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశంలో కేవలం 17 మిలియన్ల హెక్టార్లు మాత్రమే కాలువ నీటి ద్వారా సాగువుతున్నాయి. ఎక్కువ భాగం వ్యవసాయం వర్షాలపైనే ఆధారపడ్డం రైతులు కష్టాల్లో వుండటానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావించాలి. అలాగే దేశంలో దిగుబడి శాతం కూడా తక్కువగా వుంది. మన దేశంలో ఒక హెక్టార్‌లో 2 వేల కేజీల కంటే తక్కువ ధాన్యం పండిస్తారు. చైనాలో ఒక హెక్టార్‌లో 6 వేల కేజీల కంటే ఎక్కువ ధాన్యం పండిస్తారు. మిగిలిన పంటల ఉత్పత్తుల దిగుబడి కూడా ఇదే విధంగా వుంది. మనదేశంలో ఒక హెక్టార్లులో 800 కేజీ జొన్నలను పండిస్తే, థాయిలాండ్‌లో 1,600 కేజీలకు పైనే జొన్నలు పండిస్తారు. మన దేశంలో సగటు హెకార్టులో 650 కేజీల పత్తిని ఉత్పత్తి చేస్తే, అదే చైనాలో 3 వేల కేజీలకు పైనే పత్తిని పండిస్తారు. ఇలాంటి కారణాలతో రైతుల ఆదాయం తగ్గుతూ వస్తోంది. 1990 దశకంలో రైతు ఆదాయంలో వ్యవసాయం నుంచే ఆదాయం 60 శాతానికి పైగా వుండగా, ప్రస్తుతం అది 30 శాతానికి దిగజారిపోయింది.

ప్రజలను విభజించేందుకే హత్యాకాండ!

- "యునైటెడ్ ఎగైనెస్ట్ హేట్" బైక్ ర్యాలీలో స్వామి అగ్నివేష్
- ఢిల్లీ నుంచి మేవాట్‌కు బయలుదేరిన ర్యాలీ



న్యూఢిల్లీ : ప్రజలను విభజించేందుకే రాజకీయ నాయకులు హత్యా సంఘటనలను ఉపయోగించుకుంటున్నారని సామాజిక కార్యకర్త అగ్నివేష్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. "యునైటెడ్ ఎగైనెస్ట్ హేట్" పేరుతో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీని సోమవారం ఆయన ప్రారంభించారు. విద్వేష పూరిత హింసా కాండకుకు వ్యతిరేకంగా, మత సామరస్యంపై సందేశాన్నిస్తూ ఢిల్లీ నుంచి మేవాట్ ప్రాంతానికి సోమవారం బైక్ ర్యాలీ బయలుదేరి వెళ్ళింది. దాదాపు 100 మంది బైకర్లు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. "యునైటెడ్ ఎగైనెస్ట్ హేట్" పేరుతో పలువురు రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, మేధావుల సమక్షంలో మండీ హౌస్ నుండి బైక్ ర్యాలీ ప్రారంభమైంది. "హింసపై మౌనం" దుండగులను ప్రోత్సహిస్తున్నదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తాము ఏ రాజకీయ పార్టీలోనూ భాగస్వాములం కాదని, మత సామరస్యం, న్యాయంపై నమ్మకమున్న అందరినీ ఈ ర్యాలీలో చేరేందుకు ఆహ్వానిస్తున్నామని నిర్వాహక బృందంలోని ఒక సభ్యుడు తెలిపారు. మేవాట్ ప్రాంతంలోని నూహ్ వద్ద ర్యాలీ ముగుస్తుందని ఆయన చెప్పారు. మార్గమధ్యంలో ర్యాలీని ఆపి కరపత్రాలు పంచుతామని, మానవ హక్కులపై, వాటిని సాధించుకోవడానికి ఎలా పోరాడాలనే విషయమై అవగాహన కల్పిస్తూ కార్యకర్తలు వీధి నాటికలు ప్రదర్శిస్తారని ఆయన చెప్పారు. హింసాత్మక సంఘటనలకు అనేక మంది బలైన ప్రాంతం మేవాట్ అని, ఈ ప్రాంతంలో బాధితులు ఎక్కువమంది ఉన్నారని అందువలనే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నామన్నారు. పూనె, హైదరాబాద్‌తో సహా మరో 30 నగరాల నుంచి ఇటువంటి బైక్ ర్యాలీలు బయలుదేరాయని ఆయన తెలిపారు.

హింసాకాండపై రాజకీయాలకతీతంగా ఉద్యమించాలి : స్వామి అగ్నివేష్

. ఈ సందర్భంగా స్వామి అగ్నివేష్ మాట్లాడుతూ ప్రజలను విభజించేందుకు హింస ఎలా ఉపయోగ పడుతుందో ముజఫర్‌నగర్ ఘర్షణల సమయంలో తాను స్వయంగా చూశానని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం మత పరమైన మనోభావాలను రెచ్చగొట్టారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, స్వేచ్ఛ కోసం అన్ని విశ్వాసాలు కలిగిన ప్రజలు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. ఇప్పుడు మైనార్టీలు చిత్రహింసలకు గురవుతున్నారని, వారు హత్యకు గురవుతున్నారని అగ్నివేష్ పేర్కొన్నారు. ఈ సమయంలో మనందరం కలిసికట్టుగా నిలబడాలన్నారు. "నాట్ ఇన్ మై నేమ్" తరువాత శాంతి, సామరస్యాలను పాదుకొల్పేందుకు ఈ ర్యాలీ జరగడం మంచి పరిణామమన్నారు. అంతకుమించి ఈ ర్యాలీలో యువత పాల్గొనడం మరింత విశేషమన్నారు.

హింసను కలిసికట్టుగా ఎదుర్కోవాలి : మనోజ్ ఝా

రాజకీయ ప్రయోజనాల కోసం ఇటీవల కాలంలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో అటువంటి శక్తులపై పోరాడే శక్తిగా మనందరం కలవాల్సి వచ్చిందని ఆర్‌జెడి ప్రతినిధి మనోజ్ ఝా అన్నారు. ప్రస్తుతం మనం ఒక భయానక పరిస్థితిలో జీవిస్తున్నామన్నారు. ఇవాళ జునైద్ హత్యకు గురయ్యాడు. రేపు మరొకరు హత్యకు గురికావచ్చు. మన తోటి భారతీయుల రక్షణ కోసం మనందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీనియర్ జెడి(యు) నేత అలీ అన్వర్ అన్సారీ, స్వరాజ్ అభియాన్ చీఫ్ యోగేంద్ర యాదవ్, సామాజిక కార్యకర్తలు హర్ష మందర్ జెఎన్‌యు ప్రొఫెసర్ నివేదితా మీనన్ తదితరులు పాల్గొన్నారు.

'సేలం' ప్రైవేటీకరణకు యత్నం



- దిగుమతుల కారణంగా సంక్షోభంలో ఉక్కు పరిశ్రమ
- లోక్‌సభలో కేంద్రం

న్యూఢిల్లీ : తమిళనాడులోని సేలం స్టీల్ ప్లాంట్‌లో వ్యూహాత్మక వాటాలను విక్రయించడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది. గత కొన్ని సంవత్సరాల నుంచి సేలం ఉక్కు కర్మాగారం నష్టాల్లో నడుస్తోందని ఉక్కు శాఖ మంత్రి చౌదరి బిరేందర్ సింగ్ లోక్‌సభలో సోమవారం తెలిపారు. అయితే మొత్తం వాటాలను విక్రయించకుండా, వ్యూహాత్మకంగా వాటాలను విక్రయిస్తామని అన్నారు. ఈ పరిశ్రమపై వివరణాత్మక విశ్లేషణ చేయడానికి న్యాయ సలహాదారులను, సర్వేయర్లను నియమించామని, వారి నుంచి నివేదిక వచ్చాక పరిశ్రమ భవిష్యత్‌పై పూర్తి నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఏడాదికి 3.39 లక్షల మెట్రిక్ టన్నుల ఉక్కును తయారు చేస్తూ సేలం పరిశ్రమ దేశంలో ప్రముఖ స్థానంలో వుందని మంత్రి చెప్పారు. అయితే అధిక విద్యుత్ చార్జీల కారణంగా 46 శాతం నష్టాలతో పరిశ్రమ నడుస్తోందన్నారు. అలాగే ఈ ఏడాది మార్చి నాటికి దేశంలో 126 మిలియన్ టన్నులను ముడి ఇనుమును ఉత్పత్తి చేసినట్లు మంత్రి మరోక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో ఉక్కు వినియోగం 6 శాతం పెరిగిందని, అయితే ఉక్కు దిగుమతులు పెరగడంతో దేశీయ ఉక్కు పరిశ్రమలు సంక్షోభంలో వున్నట్లు మంత్రి వెల్లడించారు.



28 కాలేజీలకు నిధుల బంద్

- ఢిల్లీ ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్శిటీకి అనుబంధంగా వున్న 28 కళాశాలకు నిధులు నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. గత కొన్ని నెలలుగా ఈ కాలేజీలు పాలక మండళ్ల నియామకంలో విఫలం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విద్య పేరుతో ఢిల్లీ ప్రభుత్వ నిధులను అవినీతి, అక్రమాలకు ఉపయోగంచుకోవడానికి మేం అంగీకరించమని, 28 కాలేజీలకు నిధులు నిలిపివేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తెలిపారు. ఢిల్లీ యునివర్శిటీ రిజిస్టార్ తరుణ్ దాస్ మాట్లాడుతూ '2016 అక్టోబర్ నుంచి 28 కాలేజీలు పాలక మండళ్లను నియమిం చుకోలేదు. ఇందులో 12 కాలేజీలకు 100 శాతం నిధులు, 16 కాలేజీలకు 5 శాతం నిధులు అందిస్తున్నామని' తెలిపారు.

పార్టీ పదవి వీడను : అమిత్ షా



లక్నో : బిజెపి అధ్యక్ష పదవికి రాజీనామా చేసే ప్రశ్నే లేదని అమిత్ షా అన్నారు. తాను ఆ పదవిలో ఎంతో సంతోషంగా, మనస్ఫూర్తిగా పనిచేస్తున్నానని చెప్పారు. రాజ్యసభకు ఎన్నికైతే పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తారన్న ఊహాగానాలకు ఆయన ఫుల్‌స్టాప్ పెట్టారు. బీహార్‌లో మూడు రోజులు పర్యటించేందుకు ఆయన శనివారం ఇక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీహార్‌లో ఏ పార్టీని బిజెపి చీల్చలేదని చెప్పారు. అవినీతి పరులతో కలిసి పనిచేసేందుకు ఇష్టపడనం దువలనే నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారన్నారు. అటువంటి వారిని పదవిలో కొనసాగాలని తాము బలవం తం చేయలేమన్నారు. పార్టీ అధ్యక్షుడిగా పని చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి మరింత బలంతో అధికారంలోకి వస్తుందన్న విశ్వాసాన్ని అమిత్ షా వ్యక్తం చేశారు.

498ఎను బలోపేతం చేయాలి

- మహిళా సంఘాల భారీ ప్రదర్శన
- సుప్రీం ఉత్తర్వులను నిరసిస్తూ సంతకాల సేకరణ



ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : సుప్రీం కోర్టు ఇటీవల సెక్షన్ 498 కింద తాజాగా ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ సోమవారం పలు మహిళా సంఘాలు ఉద్యమిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఈ ఉత్తర్వులపై మహిళా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. సెక్షన్ 498 ఎ కింద పెద్ద సంఖ్యలో దాఖలయ్యాయన్న అనుమానంతో తాజా ఉత్తర్వులు జారీ చేసిందని మహిళా సంఘాలు పేర్కొన్నాయి. వాస్తవానికి ఇది అవాస్తవమని పలు అధ్యాయాలు తెలిపాయని వెల్లడించాయి. మహిళలను అబద్దాలకోరుగా ముద్రవేస్తున్నారన్న ఆందోళనను వ్యక్తం చేశారు. కుటుంబ సంక్షేమ కేంద్రాలను ప్రారంభించాలంటూ ఉత్తర్వులివ్వడం ద్వారా సమాంతర న్యాయ వ్యవస్థను కోరుతున్నట్లుందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పులో ఇటువంటి సూచనలు చేయడం 498 ఎను నీరు గార్చడమేనని పేర్కొన్నాయి. మహిళలపై నేరాలు పెరుగుతున్న ఈ తరుణంలో ఇటువంటి తీర్పు రావడం దురదృష్టకరమని పేర్కొన్నాయి. 498 ఎను బలోపేతం చేయాలని, మహిళలు అబద్దాలాడేవారు కాదని, పునరేకీకరణ చెందేందుకు అన్ని ప్రయత్నాలు చేసి అలిసి పోయిన తరువాతే చట్ట పరిష్కారానికి వస్తారని, పితృస్వామ్య వ్యవస్థను బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నించవద్దని గౌరవనీయ కోర్టును కోరుతున్నామని మహిళా సంఘాలు తెలిపాయి. అంతేకాక పురుషుల కోసం ఒక విండోను ప్రారంభించాలంటూ ఎండబ్ల్యుసిడి ఎన్‌సిడబ్ల్యుకిచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాని, 498ఎను బలోపేతం చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా సొంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమన్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఉమన్స్ కాన్ఫరెన్స్, జనవాది మహిళా సమితి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమన్, వైడబ్ల్యుసిఎ తదిరత మహిళా సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

జిఎం ఆవాలపై నెలన్నరలో నిర్ణయం తీసుకుంటాం

- సుప్రీం కోర్టుకు తెలియజేసిన కేంద్రం

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాల కోసం జన్యుమార్పిడి చేసిన ఆవాలను భారత్‌లోకి అనుమతించడపై నెలన్నర రోజుల్లో తమ వైఖరిని తెలియజేస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలియజేసింది. జన్యుమార్పిడి చేసిన ఆవాలను దేశంలోకి అనుమతించ వద్దని రైతు సంఘాలు సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం తన వైఖరి వెల్లడించాలని సుప్రీం కోర్టు కోరింది. ఈ కేసులో అక్టోబర్ 17 వరకు ఆవాల అనుమతిపై స్టే పొడిగిస్తున్నట్లు సుప్రీం కోర్టు పేర్కొంది. ప్రభుత్వం ఆవాల దిగుమతికి అనుమతిస్తేనే సుప్రీం కోర్టు పిటిషనర్ తరపున వాదనలు వింటుందని చీఫ్ జస్టిస్ జె.ఎస్. ఖేహర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం అడిషనల్ సోలిసిటర్ జనరల్ పి.ఎస్. నర్సింహాకు తెలియజేశారు. అక్టోబర్‌లో ఆవాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈలోపే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని బెంచి తెలియజేసింది. ఈ కేసును సెప్టెంబర్ రెండో వారంలో ఆలకించనున్నట్లు తెలిపింది. సరైన సమాచారంతో విధానపరమైన నిర్ణయం ప్రకటించిన తర్వాతనే తమ ముందుకు రావాల్సిందిగా కేంద్రాన్ని బెంచి ఆదేశించింది. అక్టోబర్ 7 నుంచి 17 వరకు కోర్టు దీనిపై స్టే పొడిగించింది. ఇలాంటి పంటలను దేశంలోనికి అనుమతించే ముందు ప్రజాభిప్రాయం సేకరించాల్సిందిగా కోర్టు ఇప్పటికే కేంద్రానికి సూచించిన సంగతి తెలిసిందే. భారతదేశంలో శీతాకాలంలో పండే ముఖ్యమైన ఆవాల పంటను అక్టోబర్ నుంచి నవంబరు మధ్య విత్తుతారు. పిటీషనర్ అరుణ తరుపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టులో వాదనలు వినిపించారు. ప్రభుత్వం వివిధ పంటల్లో జన్యుమార్పిడి విత్తనాలు తీసుకురావాలని చూస్తుందన్నారు. ఆయా పంటల వివరాలను జీవావరణ భద్రత మండలి ఒక పత్రం ద్వారా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిందన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండానే ఇప్పటికే ఆవాలను దేశంలో ప్రయోగాత్మకంగా సాగు చేశారన్నారు. వీటిపై పదేళ్లపాటు నిషేధం విధించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ రకం విత్తనాల సాగుపై సాంకేతిక నిపుణుల కమిటీ పలు అభ్యంతరాలు తెలిపిందన్నారు.

ఉపాధి లేమి పెరిగిపోతుంది

పార్లమెంట్‌లో అంగీకరించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఉపాధి లేని అభివృద్ధిపై సోమవారం పార్లమెంట్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ డొంక తిరుగుడు సమాధానాలు చెప్పారు. ఉపాధిని సృష్టించడం ఉపాధి లేకపోవడం రెండు విభిన్నమైన అంశాలని పేర్కొన్నాడు. వివిధ రంగాలపై నోట్ల రద్దు ప్రభావం, ఉపాధిలేని అభివృద్ధి తదితర అంశాలపై కేంద్రం దృష్టిసారించిందన్నారు. 2017లో తొలినాలుగు మాసాల్లో దేశంలో మొత్తం 15 లక్షల ఉద్యోగాలు పోయినట్లు ఇటీవల పలు నివేదికలు స్పష్టం చేశాయి. సెంటర్ ఫర్ మోనెటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదికలో ఉపాధిలేని పెరుగుదల నమోదుకావడంపై పార్లమెంట్‌లో సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తారు. పారిశ్రామికరంగంలో ఉపాధి పెరగలేదనీ, ఫ్యాక్టరీ కార్మికులు నియామకాలు, ఉపాధి చూపాల్సిన వారి సంఖ్య పెరగడం, ఐటి రంగంలో కూడా ఉపాధిల పెరగకపోవడంపై పార్లమెంటు సభ్యులు ప్రశ్నలు సందించారు. అయితే వీటిని కేంద్ర కార్మికశాఖ మంత్రి నేరుగా సమాధానం చెప్పలేకపోయారు.

హైకోర్టుకు వెళ్ళండి

పోలవరం నిర్వాసితులకు సుప్రీం సలహా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం నిర్వాసితులు హైకోర్టుకు వెళ్లాలని అత్యున్నత న్యాయ స్థానం సలహా ఇచ్చింది. పోలవరం బాధితులకు గృహ సదుపాయం, భూమికి భూమి, ఇల్లు నిర్మాణం, ఉద్యోగ కల్పనకు 2005 పునరావాస, పరిహార పాలసీలో హామీ ఇచ్చారని, ఆ పాలసీ అమలు కావటం లేదని కారం చెల్లమ్మ అనే బాధితురాలితో పాటు ప్రగఢ పల్లి, మామిడి గొంది తదితర గ్రామాలకు చెందిన పాటు మరో పది మంది పోలవరం నిర్వాసితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. నిర్వాసితుల పిటిషన్‌పై సోమవారం జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ అమితవ్ రాయ్‌లో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించి, "ఇప్పటికే పోలవరానికి సంబంధించి పది వరకు పిటిషన్లు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. కనుక మరో ప్రత్యేక పిటిషన్ అవసరం లేదు. అవసరమనుకుంటే హైకోర్టును ఆశ్రయించండి" అని పేర్కొంది. తొలుత పోలవరం బాధితుల తరపు సీనియర్ న్యాయవాది కొలన్ గుంజాల్వేస్ వాదనలు వినిపించారు. బాధితుల సంఖ్యను గతంలో తప్పుగా పేర్కొన్నారని, వాస్తవానికి నిర్వాసితుల సంఖ్య ఎక్కువగా వుందని. వారు చాలా దయనీయమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 50 వేల ఇళ్లు నిర్మించాల్సి ఉండగా, కేవలం 2 వేలు ఇళ్లు మాత్రమే నిర్మించారని తెలిపారు. 1.90 లక్షల నిర్వాసితులుంటే, కేవలం 9 వేల మందికి మాత్రమే నామమాత్రపు పునరావాసం కల్పించారు. 370 గ్రామాలు(నివాస ప్రాంతాలు) ముంపుకు గురవుతుంటే కేవలం 10 నివాస క్యాంపులు మాత్రమే నిర్మించారని తెలిపారు.

బీహార్ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వ్యతిరేకంగా

ఆర్‌జేడీ నేత పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు

పాట్నా : బీజేపీతో కలిసి జేడీ(యూ) ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడాన్ని సవాలుచేస్తూ ఆర్‌జేడీ నేత దాఖలు చేసిన పిటిషన్‌ను పాట్నా హైకోర్టు కొట్టివేసింది. బీహార్ ప్రజలు మహా కూటమికి అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి పీఠంపై కూర్చునే హక్కు నితీశ్ కుమార్‌కు లేదని, వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆర్‌జేడీ ఎమ్మెల్యే సరోజ్ యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. జేడీయూ, బీజేపీ ప్రభుత్వ ప్రభుత్వ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవికి నితీశ్ రాజీనామా చేసిన తర్వాత, అసెంబ్లీలో 80 మంది ఎమ్మెల్యేలు గల ఏకైక పెద్ద పార్టీ ఆర్‌జేడీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేదని సరోజ్ యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. నితీశ్ బలపరీక్షలో నెగ్గారంటూ ఆర్‌జేడీ నేత పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

ఆగస్టు 6న అఖిల పక్ష సమావేశం

- సి.ఎం. విజయన్ చొరవ
- శాంతియుత వాతావరణ స్థాపనకు నిర్ణయం



తిరువనంతపురం: కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త హత్య ఘటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఆగస్టు 6న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సిపిఎంతో పాటు బిజెపి ఆర్‌ఎస్‌ఎస్‌లు కూడా ఈ సమావేశంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇక తిరువనంతపురం, కొట్టాయం, కన్నూరులలో కూడా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో శాంతి సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లాలలో కూడా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి. ఇక ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త హత్య అనంతరం జరిగిన పరిణామాలపై ముఖ్యమంత్రి విజయన్ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి చీఫ్ రాజశేఖర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ఓ. రాజగోపాల్, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పి.గోపాలకృష్ణమూర్తి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కొడియెరి బాలకృష్ణన్‌లు పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త హత్యకు సంబంధించిన కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులు అరెస్టయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మణికందన్ ఒక రౌడీషీటర్‌గా ఉన్నాడు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త రాజేష్- మణికంఠల మధ్య వ్యక్తిగత వివాదాలున్నాయన్నాయని ప్రాథమికంగా నిర్ధారించారు. కేరళలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఆదివారం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దీంతో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు విజయన్ హామీ ఇచ్చారు.

పోలెండ్ ప్రభుత్వంపై యురోపియన్ తమపిఏజచర్యలు

బ్రస్సెల్స్ : న్యాయమూర్తుల స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసేందుకు పోలెండ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా యురోపియన్ కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకుంది. దీనిపై నెల రోజుల్లోగా స్పందించాల్సిందిగా పోలెండ్‌ను కోరింది. ఇయు చట్టాలను ఉల్లంఘించినందుకు పోలెండ్‌పై ఉల్లంఘన చర్యల క్రమాన్ని చేపట్టాలని ఇయు కమిషనర్లు నిర్ణయించారు. కాగా దీనిపై పోలెండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి స్పందిస్తూ, కమిషన్ నిర్ణయం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించారు. రిటైర్‌మెంట్ వయస్సుకు చేరుకున్న న్యాయమూర్తుల పదవీ కాలాన్ని పొడిగించాలా వద్దా అన్న అంశంతో పాటు కోర్టు అధ్యక్షులను నియమించడాన్ని, డిస్మిస్ చేయడానికి సంబంధించి పోలెండ్ న్యాయ శాఖ మంత్రికి ఇచ్చిన అధికారాల పట్ల యురోపియన్ కమిషన్ ఆందోళన వెలిబుచ్చింది. దీనివల్ల ప్రతికూల ఫలితాలు వుంటాయని పేర్కొంది. పైగా మహిళా న్యాయమూర్తులకు, పురుషులకు వేర్వేరు పదవీ విరమణ వయస్సులను ప్రవేశపెట్టడంపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

వలస కార్మికులకు అందనంత దూరంలో న్యాయం

రోమ్ : ఆగ్నేయాసియా దేశాలకు వలసలు వచ్చిన కార్మికులకు న్యాయం అందనంత దూరంలో వుంటోందని ఐక్యరాజ్య సమితి కార్మిక సంస్థ ఐఎల్‌ఓ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. పని వెతుక్కుంటూ ఇతర దేశాలకు వలస వచ్చిన కార్మికులు ఇబ్బందుల్లో పడితే వారికి ప్రభుత్వ అధికారులు, లేదా కార్మిక సంఘాల కన్నా స్వచ్ఛంద సంస్థలే సాయపడుతున్నాయని అధ్యయనం పేర్కొంది. తమ ఇబ్బందులు, సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు చేయాలన్నా, పరిష్కరించుకోవాలన్నా వలస కార్మికులు చాలా అడ్డంకులు ఎదుర్కొంటున్నారని ఈ అంశంపై ప్రత్యేకంగా జరిపిన అధ్యయనంలో ఐఎల్‌ఓ పేర్కొంది. ఇటీవలి కాలంలో వలస కార్మికులు న్యాయం పొందేందుకు సౌలభ్యం, అవకాశాలు కాస్తంత పెరిగాయని, ఆ దిశగా కొంత పురోగతి సాధించినట్లు ఫలితాలు చూపిస్తున్నాయి. వలస కార్మికుల రిసోర్స్ కేంద్రాలు పరిష్కరించిన ఈ తరహా కేసుల్లో 1.62 మిలియన్ల డాలర్ల నష్టపరిహారం చెల్లించిన కేసు కూడా వుంది. వలస కార్మికుల రిక్రూట్‌మెంట్, ఉపాధి సమయంలో వలస కార్మికుల హక్కులు ఉల్లంఘించబడేందుకు గల ప్రధాన కారణాల్లో ఒకటి లాంఛనమైన సాయం అందడంలో గల అడ్డంకులని ఐఎల్‌ఓ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, ఆసియా, పసిఫిక్ ప్రాంతాల ప్రాంతీయ డైరెక్టర్ టొమోకో నిషిమొటొ పేర్కొన్నారు. ఆగ్నేయాసియా దేశాలకు చెందిన దాదాపు రెండు కోట్ల 20లక్షల మంది వలస కార్మికులకు వారు పనిచేస్తున్న దేశాల్లో కార్మిక హక్కులు, సామాజిక రక్షణ పొందేందుకు సమాన అవకాశాలు వున్నాయని ఐఎల్‌ఓ నివేదిక పేర్కొంది.

ఆంక్షలకు దీటుగా స్పందించిన రష్యా



755మంది సిబ్బందిని తగ్గించండి ● అమెరికాకు పుతిన్ ఆదేశాలు

మాస్కో : రష్యాలోని అమెరికా ఎంబసీల్లో 755మంది సిబ్బందిని తగ్గించుకోవాలని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశించారు. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలకు పుతిన్ దీటుగా స్పందించారు. అమెరికాకు ఊహించని షాకిచ్చారు. సెప్టెంబరు 1లోగా సిబ్బందిని కుదించాలని స్పష్టం చేశారు. ఇరు దేశాలు దౌత్య సిబ్బందిని ఇలా బహిష్కరించడం కొత్తేమీ కాదు. అయితే ఇంత పెద్ద సంఖ్యలో ఒకేసారి సిబ్బందిని బహిష్కరించడం మాత్రం ఇదే ప్రథమం. రష్యా టెలివిజన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూ సందర్భంగా పుతిన్ ఈ ప్రకటన చేశారు. స్థానిక మీడియాతో మాట్లాడుతూ పుతిన్, ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని భావించామని, కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. అమెరికా చర్యలకు దీటుగా స్పందించాల్సిన సమయం ఇదేనని తాము భావించామని స్పష్టం చేశారు. ప్రస్తుతం దాదాపు 1200మంది సిబ్బంది రష్యాలోని అమెరికా ఎంబసీలు, కాన్సులేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. అమెరికాలో రష్యా సిబ్బంది 455మందే వున్నారు. అందుకని ఆ సంఖ్యకు సమానంగా వుంచుతూ మిగిలిన 755మందిని వెనక్కి పిలిపించాలని రష్యా కోరింది. కాగా దీనిపై అమెరికా విదేశాంగ శాఖ వెంటనే స్పందించలేదు.

శాంతిని నెలకొల్పుతాం

విజయోత్సవ ర్యాలీలో మదురో ప్రకటన

కారకస్ : రాజ్యాంగాన్ని తిరిగి రాసేందుకు కొత్తగా ఎన్నికైన రాజ్యాంగ అసెంబ్లీ వెంటనే చట్టాలు చేయడం ఆరంభిస్తుందని వెనిజులా పాలక సోషలిస్టు పార్టీ ప్రకటించింది. ఆదివారం జరిగిన రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ ఓటింగ్‌ను ప్రతిపక్షం బహిష్కరించింది. కాగా ఈ పోలింగ్‌లో 81లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జాతీయ ఎన్నికల మండలి తెలిపింది. నాలుగు మాసాల పాటు కొనసాగిన నిరసనల నేపథ్యంలో కొత్తగా ఏర్పడుతున్న ఈ అసెంబ్లీ దేశంలో శాంతిని నెలకొల్పుతుందని అధ్యక్షుడు నికొలస్ మదురో విజయోత్సవ ర్యాలీలో ప్రకటించారు. ఇక రాజ్యాంగ నిర్ణాయక అసెంబ్లీ ఇప్పటి నుండే తన పని ప్రారంభిస్తుందని సోషలిస్టు పార్టీ డిప్యూటీ అధినేత డియోస్డడో కాబెల్లో ఎన్నికల అనంతరం నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ చెప్పారు. అధికారిక ఓట్ల లెక్కింపు అనంతరం నిర్వహించిన ర్యాలీ అర్ధరాత్రి దాటిన తర్వాత ముగిసింది. ఈ ర్యాలీలో మదురో ఆవేశపూరితంగా ప్రసంగించారు. "గుడ్ మార్నింగ్ వెనిజులా, ఇప్పుడు మనకు



రాజ్యాంగ అసెంబ్లీ వచ్చింది." అంటూ గట్టిగా నినదించారు. చర్చా వేదికగా అసెంబ్లీ కొనసాగేలా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కొత్త అసెంబ్లీలో 545 సీట్లనూ సోషలిస్టు పార్టీ మిత్రపక్షాలు గెలుచుకున్నాయి. రాజ్యాంగాన్ని తిరిగి రాసే అధికారం ఈ అసెంబ్లీకి వుంటుంది. ప్రతిపక్షాలు నిర్వహించే కాంగ్రెస్ వంటి సంస్థలను రద్దు చేసే, అసమ్మతి అధికారులను తొలగించే అధికారాలు వుంటాయి.

సోమాలియా ఘర్షణల్లో 24మంది మృతి

మొగదిషు : సోమాలియా ప్రభుత్వ బలగాలు, ఆఫ్రికన్ యూనియన్ శాంతి పరిరక్షకులకు, అల్ షబాబ్ కార్యకర్తలకు మధ్య ఆదివారం జరిగిన ఘర్షణల్లో 24మంది మరణించారని ప్రాంతీయ అధికారులు తెలిపారు. సోమాలియాలోని ఆఫ్రికన్ యూనియన్ శాంతి పరిరక్షకులను తీసుకుని వస్తున్న కాన్వాయ్‌పై అల్ షబాబ్ కార్యకర్తలు పొంచి వుండి ఆదివారం తెల్లవారు జామున కాల్పులు జరిపారని కల్నల్ హసన్ మహ్మద్ తెలిపారు. మరణించినవారిలో 23మంది ఆఫ్రికన్ యూనియన్ సైనికులు కాగా ఒకరు సోమాలీ సైనికుడని దిగువ షాబల్లె ప్రాంత డిప్యూటీ గవర్నర్ అలి నూర్ తెలిపారు. కాగా మరణించిన వారి సంఖ్య ఇంకా ఎక్కువని అల్ షబాబ్ సైనిక ఆపరేషన్స్ ప్రతినిధి తెలిపారు. తమ వద్ద 39మంది సైనికుల మృతదేహాలు వున్నాయని అందులో వారి కమాండర్ కూడా వున్నారని చెప్పారు.



పేలుళ్లు, కాల్పులతో దద్దరిల్లిన కాబూల్

కాబూల్ : వరుస పేలుళ్ళు, తుపాకుల కాల్పులతో కాబూల్ నగరం సోమవారం దద్దరిల్లింది. ఇరాకీ ఎంబసీ కార్యాలయం ముందు ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చివేసుకున్నాడని భద్రతా వర్గాలు తెలిపాయి. దాడి జరిగిన వెంటనే ఆ ప్రాంతం నుండి ప్రజలను ఖాళీ చేయించామని ఒక అధికారి తెలిపారు. ఎవరైనా మరణించారా లేదా అనే సమాచారం ఇంకా తెలియరాలేదు. ఐదు సార్లు పేలుళ్ళు సంభవించాయని, తుపాకులతో కాల్పులు, గ్రెనెడ్లతో దాడులు జరిగిన శబ్దాలు వినిపించాయని సమీప ప్రాంతాల ప్రజలు తెలిపారు. ఉదయం 11గంటల సమయంలో ఈ పేలుళ్ళు సంభవించాయి. వెంటనే భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. అంబులెన్సులు పెద్ద సంఖ్యలో వచ్చాయని వారు చెప్పారు. అయితే ఒక పేలుడు మాత్రం సంభవించిందని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో సంభవించిన మరణాల్లో దాదాపు 20శాతం మరణాలు కాబూల్‌లోనే జరిగాయని ఇటీవల ఐరాస నివేదిక వెల్లడించింది.

డిమాండ్లను ఆమోదిస్తే చర్చలకు సిద్ధం

- నాలుగు అరబ్ దేశాల ప్రకటన
- తోసిపుచ్చిన కతార్

దుబాయ్ : తీవ్రవాదానికి మద్దతిస్తున్నదన్న ఆరోపణలతో కతార్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకున్న నాలుగు అరబ్ దేశాలు వివాదాన్ని పరిష్కరించే లక్ష్యంతో చర్చలు జరిపేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. అయితే తమ డిమాండ్లను ఆమోదించేందుకు కతార్ సంసిద్ధతను వ్యక్తం చేయాలని పేర్కొన్నాయి. ఈ సంక్షోభంపై చర్చించేందుకు బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, యుఎఇ దేశాల విదేశాంగ మంత్రులు బహ్రెయిన్ రాజధాని మనామాలో సమావేశమయ్యారు. గత నెల 5న నాలుగు దేశాలు కతార్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నాయి. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు కువైట్ నేతృత్వంలో దౌత్య ప్రయత్నాలు జరిగాయి. కానీ ఫలితం లేకపోయింది. తీవ్రవాదానికి నిధులు అందచేయడం నిలిపివేయాలి, ఇతర దేశాల విదేశాంగ వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని హామీ ఇవ్వడంతో సహా 13 డిమాండ్లకు స్పందించాలని సమావేశానంతరం బహ్రెయిన్ విదేశాంగ మంత్రి షేక్ ఖలీద్ సంయుక్త పత్రికా సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. కతార్‌పై కొత్త ఆర్థిక ఆంక్షలేవీ వారు ప్రకటించలేదు. ముస్లిం బ్రదర్‌హుడ్‌కు మద్దతు నిలిపివేయాలని, దోహాలోని అల్ జజీరా చానెల్‌ను మూసివేయాలని, టర్కీ సైనిక స్థావరాన్ని మూసివేయాలని, ఇరాన్‌తో సంబంధాలు కుదించుకోవాలని అరబ్ దేశాలు కోరుతున్నాయి. అయితే ఈ డిమాండ్ల పట్ల కతార్ తీవ్రంగా దృష్టి పెట్టడం లేదని సౌదీ విదేశాంగ మంత్రి విమర్శించారు. కతార్ నిజాయితీగా, సీరియస్‌గా వీటిని అమలు చేస్తే చర్చలు జరపడానికి తమకు అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. కతార్ అమలు చేయాల్సిన ఆరు సూత్రాలను వారు పేర్కొన్నారు. దీనిపై కతార్ విదేశాంగ మంత్రి స్పందిస్తూ అరబ్ దేశాల ఆంక్షలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. మనామా సమావేశంలో స్పష్టమైన దార్శనికత లోపించిందని, ఇవన్నీ అక్రమ చర్యలని పేర్కొన్నారు.

ఉత్తర కొరియాపై మరింత కఠిన వైఖరి : ట్రంప్, అబె

టోక్యో : జపాన్ ప్రధాని షింజో అబె సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉత్తర కొరియాపై మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని అంగీకరించారు. ఉత్తర కొరియాపై మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం



ట్రంప్‌తో ఫోన్ సంభాషణ అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న అబె

వుందంటూ అంతకు కొద్ది గంటల ముందే ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ స్పష్టం చేశారు. శుక్రవారం ఉత్తర కొరియా తాజాగా క్షిపణి పరీక్ష జరిపిన నేపథ్యంలో ఆ దేశంపై మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటే తాను మద్దతిచ్చేది లేనిదీ చైనా ప్రకటించాలని నిక్కీ హేలీ ఒక ప్రకటనలో కోరారు. ఉత్తరకొరియాపై గణనీయంగా అంతర్జాతీయ ఒత్తిడి పెంచలేనపుడు భద్రతా మండలి చేసే ఏ కొత్త తీర్మానమైనా అనవసరమని హేలీ వ్యాఖ్యానించారు. జపాన్, దక్షిణ కొరియాలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయని చెప్పారు. ట్రంప్‌తో ఫోన్ సంభాషణ అనంతరం అబె విలేకర్లతో మాట్లాడుతూ, రష్యా, చైనాలతో సహా అంతర్జాతీయ సమాజం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, ఒత్తిడి పెంచాల్సి వుందని అన్నారు. అమెరికా, జపాన్‌లు నిర్దిష్ట చర్యలు తీసుకుంటాయని అబె చెప్పారు. వాటి వివరాలు వెల్లడించలేదు. ఇరువురు నేతలు దాదాపు 50నిముషాల పాటు చర్చలు జరిపారు. చైనా పోషించే పాత్ర చాలా ముఖ్యమని వారు అభిప్రాయపడ్డారని జపాన్ ముఖ్య కేబినెట్ కార్యదర్శి చెప్పారు. అయితే సైనికచర్య గురించి ట్రంప్ మాట్లాడలేదన్నారు. అబె ఫోన్ అనంతరం వైట్‌హౌస్ ఒక ప్రకటన చేస్తూ,, ఉత్తర కొరియా ముప్పుగా పరిణమించిందని ఇరువురు నేతలు అంగీకరించారని తెలిపింది.

తరువోలు దళిత కుటుంబంపై బహిష్కరణ ఎత్తేయాలి

- కెవిపిఎస్ ఆధ్వర్యంలో డిజిపికి వినతిపత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం జిల్లా తరువోలు దళిత కుటుంబంపై అగ్రవర్ణాలు విధించిన గ్రామ బహిష్కరణను వెంటనే ఎత్తేయాలని డిజిపి ఎన్ సాంబశివరావును విజయవాడ కార్యాలయంలో కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఆ కుటుంబానికి సంఘీభావాన్ని ప్రకటిస్తూ తరువోలుకు చెందిన దళితుడు కలిగొట్ల చినపైడియ్యకు అదే గ్రామం అగ్రవర్ణానికి చెందిన మరో వ్యక్తికి వ్యవసాయ భూ సరిహద్దు తగాదా ఉందన్నారు. దీనిపై చినపైడియ్యను గాయపర్చడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారన్నారు. దీనిపై కోపోద్రిక్తులైన అగ్రవర్ణాల ప్రజలు అతన్ని గ్రామం నుంచి వెలివేశారన్నారు. ఈ సంఘటనపై గతంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అగ్రవర్ణాల వ్యక్తులపై కేసు నమోదు చేసినా ఇంతవరకు ఛార్జిషీటు వేయలేదన్నారు. అనంతరం చినపైడియ్యపై అనేకసార్లు హత్యాప్రయత్నాలు జరిగాయన్నారు. అయినా వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు తాత్సారం చేస్తున్నారని డిజిపికి వివరించారు. ఇప్పటికైనా ఆ దళిత కుటుంబానికి న్యాయం చేసి, అగ్రవర్ణాల వ్యక్తులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై స్పందించిన డిజిపి సాంబశివరావు దళిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మాల్యాద్రి తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

34 లక్షల మంది...

వారే అధికంగా కనిపిస్తున్నారు. వారిలో బిసిలు 5.08 లక్షలు, ఎస్సీలు 2.06 లక్షలు, ఎస్టీలు 51 వేల మంది ఉన్నారు. వీరంతా చాలాకాలంగా ఉద్యోగాలు లేక సతమతమవుతున్న వారే కావడం విశేషం. నేరుగా ఉద్యోగాలు లేకపోయినా, కనీసం స్వయం ఉపాధి కార్యక్రమాలు కూడా దరి చేరకపోవడం వల్ల నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

నితీష్ నిర్ణయాన్ని అంగీకరించలేను

దృష్టిలో ఉంచుకుని నితీష్‌కుమార్ కీలకమైన రాజకీయ నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఆయనకు పార్టీ అధ్యక్ష పదవిని అప్పగించారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ప్రతిపక్ష కూటమి అభ్యర్థులను నిర్ణయించే తరుణంలో నితీష్ కుమార్ ఢిల్లీలోనే ఉన్నప్పటికీ ప్రతిపక్షాల సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం. ఆ సమావేశంలో శరద్‌యాదవ్ పాల్గొన్నారు. రాష్ట్రపతి పదవికి ప్రతిపక్ష అభ్యర్థి మీరాకుమార్‌కు, శరద్ యాదవ్ మద్దతు తెలపగా, నితీష్ కుమార్ మాత్రం ఎన్డీయే అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతివ్వడంతో ఇరువురి మధ్య విభేదాలు తేటతెల్లమయ్యాయి. కాగా నితీష్‌కుమార్ హఠాత్తుగా ప్లేట్ ఫిరాయించి బిజెపి పంచన చేరడంతో శరద్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారని, ఆయన తన అభిప్రాయాలను తనతో పంచుకున్నారని ఆర్‌జెడి నేత లాలూ యాదవ్ పేర్కొన్నారు. ఈ వారాంతానికి శరద్‌యాదవ్ నేతృత్వంలో బిజెపి వ్యతిరేక కూటమి ఏర్పడే అవకాశమున్నదని లాలూ సూచన ప్రాయంగా తెలిపారు.

ఆరు లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు

తొలగించి పనులు వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో పనులు వేగవంతంగా చేయాలన్నారు. వర్షాలు వస్తే దానికి తగిన పనులు చేయాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన పోలవరం పనులు సాగుతున్న తీరును వర్చువల్ ఇన్‌స్పెక్షన్ ద్వారా పరిశీలించారు. గడచిన వారం స్పిల్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి 3.15 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకం పనులు జరిగినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జులై 21 నుంచి 31 వరకు రాష్ట్రంలో 15 మి.మీ. వర్షపాతం నమోదైందని ముఖ్యమంత్రికి షార్ అధికారులు వివరించారు. రుతుపవనాలు బలహీనపడి వారం రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికి ఆగస్టు రెండోవారంలో రాష్ట్రమంతటా మళ్లీ వానలు కురుస్తాయని చెప్పారు. ఆలమట్టి ప్రాజెక్టుకు నిరంతరాయంగా ఇన్‌ఫ్లో ఉండటంతో 99శాతం నిండిందన్నారు. ఈ వారంలో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు నీరు చేరుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అనంతపురంలోని 17 వర్షాభావ మండలాల్లో నీటి నిర్వహణకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

ఉద్దానం కోసం ఎంతైనా వెచ్చిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సిఫార్సులు చేశారు. ఈ సందర్భంగా ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని ముఖ్యమంత్రి వివరించారు. భారతీయ వైద్య పరిశోధనా మండలితో (ఐసిఎంఆర్) కలిసి శ్రీకాకుళంలో కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని సిఎం తెలిపారు. ఐసిఎంఆర్ , రాష్ట్ర ప్రభుత్వం అందుకయ్యే ఖర్చులో చెరో 50 శాతం భరిస్తాయన్నారు. ఏడాదికి రూ 5 కోట్లు వంతున ఈ మూడేళ్ళలో రూ 15 కోట్లను ఈ పరిశోధనా కేంద్రానికి వెచ్చిస్తామన్నారు. అందుకు అవసరమైన రీతిలో ఏపికి సహకరించాలని ఆయన హార్వర్డ్ మెడికల్ స్కూల్ బృందాన్ని కోరారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ అంశంపై పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవడం ముదావహమన్నారు. హార్వర్డ్ బృందం ఇచ్చే విలువైన సూచనలు పరిగణలోకి తీసుకొని సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొంటామని ఆయన స్పష్టంచేశారు. వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు అవసరమయ్యే రవాణా సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తామని సిఎం తెలిపారు.

ప్రభుత్వానికి పవన్ సూచనలు

ఉద్దానంలో కిడ్నీ వ్యాధితో మరణించిన వారి పిల్లలను దత్తత తీసుకుని వారి బాగోగులు చూసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పవన్ ముఖ్యమంత్రికి సూచించారు. అనాథ బాలల కోసం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వముందని, ఉద్దానం చిన్నారుల పూర్తి బాగోగులు చూసుకునేందుకు చర్యలు తీసుకుంటామని సిఎం హామీ ఇచ్చారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని పవన్ ముఖ్యమంత్రికి చెప్పారు. ఉద్దానం పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల వైద్యపరమైన కోర్సులు పూర్తి చేసిన 900 మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేసేందుకు అవకాశాలు కల్పించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

కిడ్నీ బాధితులకు ప్రభుత్వం నెలవారీ రూ 2500 పెన్షన్ అందించడం మంచి పరిణామమని, వారికి అధిక శారీరక శ్రమతో కూడిన పనులు చేయలేని కారణంగా స్థానిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి తగిన ఆదాయ మార్గాలు కల్పించాలని ఆయన సిఎంను కోరారు. శ్రీకాకుళం జిల్లా 7 మండలాల్లోని 231 గ్రామాల్లో కిడ్నీ వ్యాధి తీవ్రత ఉన్నట్లు వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య సమావేశంలో వివరించారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, పలాస, మందస, వి.కొత్తూరు మండలాల్లో ఎక్కువగా వ్యాధిగ్రస్తులున్నారని తెలిపారు. ఒక డాక్టర్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, టెస్టింగ్ కిట్స్‌తో కూడిన బృందాలు 176 గ్రామాల్లో 30 ఏళ్లు పైబడిన అందరికీ వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. వైద్య పరీక్షల్లో 13,093 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. కిడ్నీ వ్యాధి చికిత్స కోసం 3 ప్రత్యేక డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మరో 14 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. బాధితులు విశాఖ కెజిహెచ్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శ్రీకాకుళం జిల్లాలోని అన్ని పిహెచ్‌సి, సిహెచ్‌సిల్లో కిడ్నీ వ్యాధి నిపుణుల్ని నియమిస్తామని ఆమె తెలిపారు.

నీటిలో సిలికా, స్ట్రోటియం, గ్యాలియం శాతం ఎక్కువగా ఉండటంవల్లే కిడ్నీ వ్యాధికి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి జవహర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిఎం ప్రతిపాదనల మేరకు ' జీవన్‌దాన్ ' కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు పవన్ కల్యాణ్ అంగీకరించారు. డాక్టర్ జోసెఫ్‌తో కూడిన హార్వర్డ్ మెడికల్ స్కూల్ బృందం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, కమిషనర్ సుజాత శర్మ, శ్రీకాకుళం కలెక్టర్ ధనుంజయ రెడ్డి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ విసి రవిరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

'50 ఏళ్లకే ఉద్యోగులు ఇంటికి' జీవో నిజం కాదా.?

- ఎమ్మెల్యే రోజా



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులను 50 ఏళ్లకే ఇంటికి పంపించాలని జీవో రూపొందించి నిజం కాదా..? అని ప్రభుత్వాన్ని వైసిపి ఎమ్మెల్యే ఆర్కె రోజా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగికి 50 ఏళ్లు నిండగానే ఆయన పనితీరును సమీక్షించి ఇంటికి పంపే విధంగా జీవో రూపొందించిన అంశంపై ఆధారాలు బయటకు రావడంతో తప్పును కప్పిపుచ్చుకునే విధంగా టిడిపి మంత్రులు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.

'ఈ నెల 18న '50 ఏళ్లకే ఇంటికి' ఫైలు మూడు శాఖలకు పంపారని తెలిపారు. ఆ ఫైలు ఆర్థిక శాఖ ఆమోదం అనంతరం 26న సీఎస్ వద్దకు చేరిన విషయం నిజం కాదా.? అని నిలదీశారు. ఆర్థిక శాఖ మంత్రి యనమలకు తెలియకుండానే ఆయన శాఖలో నిర్ణయాలు జరుగుతున్నాయా? అని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల పనితీరు ఆధారంగా జీవో రూపొందించినట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరు ఆధారంగా చూస్తే ఆయన జీరో అని, వెళ్లగొట్టాల్సి వస్తే.. ముందు చంద్రబాబునే పంపించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వ్యవహార శైలి కారణంగానే ఐఎఎస్‌లు ఢిల్లీకి వెళ్తున్నారని తెలిపారు. తమ అక్రమాలకు సహకరించని అధికారులను కూడా టిడిపి నేతలు వేధిస్తున్నారని ఆరోపించారు. కొందరు ఎమ్మెల్యేలు అధికారులపై చేయి కూడా చేసుకున్న సంగతిని ఆమె గుర్తు చేశారు. టిడిపి ఎమ్మెల్యేలు, నేతలు ప్రభుత్వ ఉద్యోగులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని, వారికి అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు.

ఎసి పైప్ నుంచే నీరు వెళ్లింది

- అలా ఎందుకు జరిగిందో విచారించాలి
- అసెంబ్లీ లీకేజీపై సిఐడి మధ్యంతర నివేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏసికి ఏర్పాటు చేసిన పివిసి పైపు నుంచే అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి నీరు వెళ్లిందని, అయితే ఆ పైపులోకి నీరు వెళ్లడానికి గల కారణాలను విశ్లేషించాల్సి ఉందని సిఐడి అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం స్పీకర్‌కు మధ్యంతర నివేదిక అందజేశారు. జూన్ ఆరోతేదీన కురిసిన భారీవర్షానికి అసెంబ్లీ భవనంలోని ప్రతిపక్షనేత ఛాంబర్లోకి భారీగా నీరు చేరింది. భవనం పైనున్న పైపులోనుండి ఈ నీరు లోపలకు వెళ్లిందని అప్పట్లో నిర్ధారించారు. అయితే నీరు వెళ్లే విధంగా ఎవరైనా కోశారా, లేక నిర్మాణ సమయంలో అలా వదిలేశారా అనే విషయంపై స్పష్టత రాలేదు. ఈ వ్యవహారం అప్పట్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశమయ్యింది.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీ ముందు ధర్నా నిర్వహించారు. విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారపక్షమూ స్పందించింది. విచారణకు ముందే ఎవరో కావాలని కొంతమంది వ్యక్తులు పైపుల్ని కోశారని విమర్శలు గుప్పించారు. అనంతరం సిఐడి విచారణకు ఆదేశించారు. అప్పటి నుండి విచారణ జరిపిన సిఐడి పివిసి పైపుల్లో నుండి నీరు వెళ్లిందని, ఆ పైపులు నీరు వెళ్లేందుకు వీలుగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. వాటిని నిర్మాణ సమయంలోనే వదిలేశారా, మధ్యలో అలా చేశారా అనే విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. దీనిపై విచారణ కొనసాగుతుందని స్పీకర్‌కు సోమవారం అందజేసిన మధ్యంతర నివేదికలో సిఐడి అధికారులు పేర్కొన్నారు. స్పీకర్ కార్యాలయం నుండి అధికారికంగా విడుదల చేసిన ప్రకటనలో ఇలా ఉండగా కొన్ని మీడియా ఛానల్స్‌లో మాత్రం నిర్మాణ సమయంలోనే పైపులను అలా వదిలేసి ఉండొచ్చని సిఐడి అనుమానాలు వ్యక్తం చేసినట్లు వార్తలొచ్చాయి.

నేరెళ్ల ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

- లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్
- సిరిసిల్లలో టెన్షన్
- కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్



జైలులో ఉన్న బాధితులతో మాట్లాడి బయటకు వస్తున్న మీరాకుమార్, కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నేరెళ్లలోని దళితులను అమానుషంగా పోలీసులు చిత్రహింసలకు గురి చేసిన ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ డిమాండ్ చేశారు. వారిని చిత్రహింసలకు గురి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కరీంనగర్ జైలులో ఉన్న బాధితులను సోమవారం ఆమె పరామర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలోని బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు.

జైలులో బాధితుల పరిస్థితిని ఆమె వివరించారు. వారి పరిస్థితి హృదయవిదారకంగా ఉందని తెలిపారు. జైలులో తాను నలుగురితో మాట్లాడానని, వారిలో ఒకరికి కిడ్నీ దెబ్బతిని మూత్రం నుంచి రక్తం వస్తోందని తెలిపారు. మరొకరికి ఛాతి ఎముకలు విరిగాయని చెప్పారు. ఇసుక లారీ ఢీకొని భూమయ్య మరణించడం వల్ల కలిగిన ఆగ్రహంతో ఇసుక లారీలు తగలబెడితే దళితులను చిత్రహింసలకు గురి చేస్తారా.? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. దళితులపై జరిగిన దాడిని పార్లమెంట్‌లో చర్చకు తెస్తామని ఆమె తెలిపారు. వారికి న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేస్తామని ప్రకటించారు.

ఎక్కడికక్కడ కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్

కాంగ్రెస్ తల పెట్టిన చలో సిరిసిల్ల కారణంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో టెన్షన్ వాతావరణం నెలకొంది. సెక్షన్ 30 విధించినందున చలో సిరిసిల్లకు పోలీసులు అనుమతివ్వలేదు. అనుమతివ్వకున్నా.. నిర్వహించి తీరుతామని కాంగ్రెస్ నేతలు ప్రకటించిడంతో.. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టులు చేశారు. ఎక్కడికక్కడ పోలీసులు గస్తీ తిరుగుతుండడంతో వాతావరణ ఉద్రిక్తంగా మారింది. కాగా కరీంనగర్ జిల్లా జైలు వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల చేతుల్లో చిత్ర హింసలకు గురైె జిల్లా జైలులో ఉన్న నేరెళ్ల బాధితులైన దళితులను పరామర్శించేందుకు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, భట్టి విక్రమార్క, గీతారెడ్డి, జీవన్‌రెడ్డి, డి. శ్రీధర్‌బాబు, వి. హన్మంతరావు కొప్పుల రాజు, షబ్బీర్ అలీ తదితరులు జైలు వద్దకు వచ్చారు. అయితే ములాఖత్‌కు అందరికీ అనుమతించక పోవడంతో అధికారుల తీరు, పోలీసుల వైఖరిని నిరసిస్తూ జైలు ముందు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.


ప్రేమకథలో కొత్త కోణం



రవితేజ

రవితేజ హీరోగా నటిస్తున్న చిత్రం 'రాజా ది గ్రేట్'. షూటింగ్ ఆఖరి దశకు చేరుకుంది. ఇంకో 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉంది. ఈనెలలో చిత్రీకరణ ముగిస్తామని నిర్మాత దిల్‌రాజు తెలిపారు. సెప్టెంబర్‌లో పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తవుతాయన్నారు. అక్టోబర్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామనీ, ముందుగా ఈనెల 15న టీజర్‌ను రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో రవితేజ అంధుడిగా నటిస్తున్నారు. ఆయన చేస్తున్న ప్రయోగాత్మక చిత్రమిది. ప్రేమకథలో కొత్తకోణాన్ని ఆవిష్కరించడంతో పాటు రవితేజ ఇమేజ్‌ను పెంచేవిధంగా చిత్రాన్ని మలుస్తున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' ఫేమ్ మెహరీన్ కౌర్ హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీనివాస్ రెడ్డి, రఘుబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.

రేపు మొదటి గీతం విడుదల



మహేష్ బాబు

మహేష్ బాబు ప్రస్తుతం చేస్తున్న డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పైడర్'. రకుల్ ప్రీత్ సింగ్ కథానాయిక. ఎస్.జె సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్‌ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రూపొందుతోంది. ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఎన్.వి.ప్రసాద్ నిర్మాత. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ సాంగ్ 'బూమ్ బూమ్..పల్లవితో సాగేదాన్ని బుధవారం విడుదల చేయనున్నారు. ఆగస్ట్ 9న మహేష్ పుట్టినరోజున స్పెషల్ టీజర్‌ను రిలీజ్ చేస్తారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి దసరా కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. హేరిస్ జయరాజ్ బాణీలు సమకూరుస్తున్నాడు.

'సాహో' సైన్స్ ఫిక్షన్ కాదు



ప్రభాస్

ప్రభాస్ 'బాహుబలి' తర్వాత చేస్తున్న సినిమా 'సాహో'. దీనికి సంబంధించిన టీజర్ 'బాహుబలి ది కన్‌క్లూజన్' రిలీజ్ నాటి నుంచే థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ అని చాలా వరకూ ప్రచారం జరుగుతోంది. కానీ అవన్నీ రూమర్స్ అని పేర్కొన్నాడు ప్రభాస్. దీన్ని ఉన్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తున్నట్టు తెలిపాడు. ఈ హీరో. అందుకు యాక్షన్ సీన్స్‌ను హాలీవుడ్ కొరియోగ్రాఫర్‌తో చేస్తున్నట్టు చెప్పాడు. యువీ క్రియేషన్స్ బ్యానర్‌లో రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. సుజీత్ దర్శకుడు. అనుష్క కథానాయికగా చేస్తుందని ప్రచారం జరుగుతోంది.

ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా జెమిని కిరణ్



కిరణ్‌ను అభినందిస్తున్న చిరంజీవి

జెమిని కిరణ్‌గా సుపరిచితుడైన పర్వతనేని కిరణ్ 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్' అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఛాంబర్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. 38వ వార్షిక సర్వసభ్య సమావేశం అయిన వెంటనే జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం ప్రకటించారు. ఛాంబర్ అధ్యక్షుడిగా పి. కిరణ్, వైస్ ప్రెసిడెంట్స్‌గా వి. వీర్నాయుడు (విశాఖ), పి. శ్రీనివాసరావు (కాకినాడ), కె. బసిరెడ్డి (హైదరాబాద్) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా ఎం. రాందాసు, కె. శివప్రసాదరావు (విజయవాడ), గౌరవ కార్యదర్శులుగా మోహన్ వడ్లపట్ల, వి. రామకృష్ణ, ఎం. సుధాకర్, జె. మోహన్ రెడ్డి, పి. సాంబమూర్తి, ఎన్. నాగార్జున, కోశాధికారిగా టి. రామసత్యనారాయణ ఎంపికయ్యారు. ఛాంబర్ ఆధ్వర్యంలో వున్న ప్రొడ్యూసర్ సెక్టార్ ఛైర్మన్‌గా వల్లూరిపల్లి రమేష్‌బాబు, స్టూడియో సెక్టార్‌కు వై. సుప్రియ, ఎగ్జిబిటర్ ఎక్టార్‌కు జి. వీరనారాయణ బాబు, డిస్ట్రిబ్యూటర్ సెక్టార్‌కు బి. నాగేశ్వరరావును ఎంపిక చేశారు. వీరితోపాటు 32మంది కార్యవర్గ సభ్యులుగా ఆంధ్ర, తెలంగాణకు చెందిన నిర్మాతలు, పంపిణీదారుల ఎంపికజరిగింది.

ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు కిరణ్‌ను చిరంజీవి సోమవారం ఆయన్ని సత్కరించారు. పరిశ్రమ మంచి చెడులపై పూర్తి అవగాహన ఉన్న పి.కిరణ్ వంటి వ్యక్తి ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్ష పదవిలో ఉండడం పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడుతుందని చిరంజీవి ఆకాంక్షించారు. ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నికైన జెమినీ కిరణ్‌ను మూవీ ఆర్టిస్టు అసోసియేషన్(మా) అభినందించింది. ఫిల్మ్ ఛాంబర్ సమస్యలను పరిష్కారించడంలో ముందుంటానని కిరణ్ ఈ సందర్భంగాపేర్కొన్నారు.



"నేను, నా లిటిల్ ఏంజెల్ అల్లు అర్హా" అని తన ముద్దుల తనయను ఎత్తుకున్న ఓ ఫొటోను అల్లు అర్జున్ సోమవారం తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశాడు. దీనికి గంటలోనే వేలకొద్దీ లైకులు వచ్చిపడ్డాయి.

మనసుకు హత్తుకునేలా!

అంజలి, ఆండ్రియా, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తారామణి'. రామ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని డి.వి.సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై డి.వి.వెంకటేష్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటుంది.

డి.వెంకటేష్ మాట్లాడుతూ 'ముక్కోణపు ప్రేమకథ ఇది. సినిమాలో ఎమోషనల్ కంటెంట్‌తో పాటు అన్ని అంశాలూ సమపాళ్లలో ఉంటాయి. ప్రతీ సన్నివేశం మనసును హత్తుకునేలా ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో సినిమా సాగుతుంది. యువత టెక్నాలజీ మాయలో పడి ఎలా ప్రవర్తిస్తున్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనవుతున్నారు. ఫలితంగా వారెలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారనే అంశాలు కూడా సినిమాలో ఉంటాయి. యువతను మెప్పించే అంశాలన్నీ ఉంటాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటుంది. తమిళంలో ఈ సినిమా ట్రైలర్‌ను యూనివర్సల్ హీరో కమల్ హాసన్, పాటలను సూపర్‌స్టార్ రజనీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్, పాటలకు ఆడియెన్స్ నుండి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఆగస్టు నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామ'ని అన్నారు.



అంజలి, వసంత రవి

మూడు భాషల్లో ప్రభాకర్ హవా



'బాహుబలి'లో కాలకేయగా మెప్పించిన నటుడు ప్రభాకర్ కేవలం తెలుగులోనే కాకుండా, తమిళ, కన్నడ భాషల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నాడు. ఈ తరుణంలో తన ఆనందాన్ని వ్యక్తపరుస్తూ సోమవారం విలేకరులతో మాట్లాడాడు. 'నన్ను ప్రేక్షకులకు పరిచయం చేసిన రాజమౌళికీ రుణపడి ఉంటాను. సామాన్య ప్రజలలో ఒకడిగా ఉన్న నన్ను, ఈ రోజు నేను ఎక్కడికి వెళ్లినా, నన్ను గుర్తు పడుతున్నారంటే దానికి కారణం రాజమౌళియే. మొదట్లో మర్యాద రామన్నలో నాకు మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించిన రాజమౌళి, ఆ తర్వాత బాహుబలిలో విలన్‌గా కిలికిలి భాషతో నన్ను నిరూపించుకునేందుకు మరో మంచి అవకాశం ఇచ్చారు. బాహుబలి తర్వాత నాకు చాలా మంచి అవకాశాలు వస్తున్నాయి. కేవలం ఇటు తెలుగు పరిశ్రమ నుంచే కాకుండా తమిళ పరిశ్రమ నుంచి కూడా నేను అవకాశాలు అందుకుంటున్నాన'ని అన్నారు. ప్రస్తుతం ప్రభుదేవా సినిమాలో మెయిన్ విలన్‌గా, డైరెక్టర్ ప్రభు సాల్మన్ సినిమాలోనూ, మలయాళంలో మమ్ముటి సార్ సినిమా, కన్నడలో సునీల్ దేశాయ్ దర్శకత్వంలో ఒక సినిమా, తెలుగులో బాలకష్ణ సినిమాలో నటిస్తున్నానని ప్రభాకర్ చెప్పారు.

ఆ సలహా నా జీవితాన్ని మలుపుతిప్పింది



- అశోక్

" సినిమా బ్యాక్‌డ్రాప్‌లో సాగే అందమైన ప్రేమకథ ఇది. ఓ దర్శకుడికి, ఫ్యాషన్ డిజైనర్ మధ్య మొదలైన ప్రేమ చివరకు ఏ మజిలీకి చేరుకుందనేది చిత్ర ఇతివృత్తం" అని అశోక్ అన్నాడు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'దర్శకుడు'. సుకుమార్ రైటింగ్స్ పతాకంపై బీఎన్‌సీఎస్‌పీ విజయ్‌కుమార్, థామస్‌రెడ్డి ఆదూరి, రవిచంద్ర సత్తిలతో కలిసి సుకుమార్ నిర్మిస్తున్నారు. హరి ప్రసాద్ జక్కా దర్శకుడు. ఈ నెల నాలుగున ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం హైదరాబాద్‌లో అశోక్ పాత్రికేయులతో మాట్లాడారు.

అదే నన్ను హీరోను చేసింది

ప్రముఖ దర్శకుడు సుకుమార్, హరి ప్రసాద్ జక్కా మంచి మిత్రులు. హరి ప్రసాద్ సిద్ధం చేసిన కథ నచ్చడంతో ఆయన్నే ఈ సినిమాకు దర్శకత్వం వహించమని సుకుమార్ సలహా ఇచ్చారు. ఆ సలహా నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఈ సినిమాతో నన్ను హీరోను చేయాలని హరి ప్రసాద్ అనగానే సుకుమార్ షాకయ్యారు. సుకుమార్ మా బాబాయి కాబట్టి చిన్నప్పటి నుంచి నేనేంటో ఆయనకు బాగా తెలుసు. నలుగురి ముందు మాట్లాడాలంటేనే భయపడతాడు... అశోక్ హీరోగా వద్దని కొత్తవాళ్లతో చేద్దామని సుకుమార్ అన్నారు. కానీ హరి ప్రసాద్ మాత్రం పట్టుబట్టి నీతోనే ఈ సినిమా చేయాలని నిశ్చయించుకున్నాను, నన్ను రెడీగా ఉండమని అన్నారు. ఒక రోజు ఆలోచించి నా నిర్ణయం చెబుతానని ఆయనతో అన్నాను. దర్శకత్వం, నటన రెండింటికి అంతర్లీనంగా సంబంధం ఉంటుంది కాబట్టి వచ్చిన అవకాశాన్ని వదులుకోవడం మంచిది కాదనే ఆలోచనతో ఈ సినిమాను అంగీకరించాను.

ఆ ఆలోచన లేదు

దర్శకుడవ్వాలనుకొని హీరోలుగా మారిన వారిలో నానితో పాటు మరికొందరు ఉన్నారు. వారు సక్సెస్ అయ్యారు కాబట్టి ఆ దారిలో నేను అడుగులు వేస్తే బాగుంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆ ఆలోచన నాకు లేదు. హరి ప్రసాద్ నమ్మకమే నాతో ఈ సినిమా చేయించింది. నేనున్నా భయపడకు అంటూ నిరంతరం ఆయన నాలో ధైర్యాన్ని నింపారు.

వారిద్దరి నిర్ణయంపైనే

దర్శకుడు సుకుమార్‌తో పాటు హరిప్రసాద్ నిర్ణయంపైనే నా భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అవకాశాలు వస్తే నటించడానికి సిద్ధమే. దాంతో పాటు ఎప్పటికైనా ఓ సినిమాకు దర్శకత్వం వహిస్తాను.

కథలో భాగంగానే..

కథలో కావాలని లిప్‌లాక్‌లను ప్రత్యేకంగా పెట్టలేదు. ఓ సన్నివేశంలో కథానాయకుడు తాను తీస్తున్న ముద్దు సన్నివేశం సరిగా రాకపోవడంతో దానిని ఎలా చేయాలో చూపించడం కోసం తన ప్రియురాలినే ముద్దుపెటుకున్నట్లుగా చూపించాం. కథలో భాగంగానే కొన్ని క్షణాలు ఆ సన్నివేశం ఉంటుంది.

వారివల్లే ప్రేక్షకులకు చేరువైంది

నటుడిగా నాకు ఈ సినిమా మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకముంది. ఎన్టీఆర్, రామచరణ్, అల్లు అర్జున్, అగ్రనటులు ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం మా సినిమాకు ఉపకరించింది. మేము నమ్ముకున్న కథను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి వారు తోడ్పడ్డారు. సాయికార్తీక్ చక్కటి బాణీలనిచ్చారు. నీ మనసింతేనా పాటంటే నాకు చాలా ఇష్టం.

ఆ ప్రభావం ఉంటుంది

'ఒన్ నేనొక్కడినే' సినిమాకు సుకుమార్ వద్ద దర్శకత్వ విభాగంలో నేను పనిచేశాను. అందులో ఓ సన్నివేశానికి సంబంధించి నేను రాసిన వెర్షన్ ఆయనకు నచ్చింది. ఆ సమయంలోనే సుకుమార్ సెట్స్‌లో ఎలా ఉంటారు, సన్నివేశాలు బాగా రావడం కోసం ఆయన పడే తపన, కాస్ట్యూమ్స్, దర్శకత్వం టీమ్ సరిగా లేకపోతే ఆయన ఎలా ప్రతిస్పందిస్తారో ప్రత్యక్షంగా చూశాను. ఆయన ప్రభావం నాపై తప్పకుండా ఉంటుంది. దర్శకుడు సినిమాలో కొంత ఆయన బాడీలాంగ్వేజ్‌ను అనుసరించే ప్రయత్నం చేశాను. చిత్ర దర్శకుడు హరిప్రసాద్‌కు పదేళ్లుగా సుకుమార్‌తో అనుబంధం ఉంది. కొన్ని సన్నివేశాల్ని సుకుమార్ జీవితం నుంచే స్ఫూర్తి పొంది తెరకెక్కించారు. కోపంతో కుర్చీని విసిరే సీన్ సరిగా రాకపోవడంతో సుకుమార్‌ను తల్చుకో అదే బాగా వస్తుందని హరి ప్రసాద్ చెప్పారు. ఆయన చెప్పినట్లే చేశాను.

వారి జీవితాలే ఆధారం

సుకుమార్‌తో పాటు హరి ప్రసాద్ జీవితంలోని సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. నా లైఫ్‌లో జరిగినవేవీ ఇందులో కనిపించవు. సినిమాలో బాగా నటించానని చెప్పను. దర్శకుడు నా నుంచి ఏ కోరుకున్నారో దానికి పూర్తిగా న్యాయం చేసే ప్రయత్నం చేశాను.



అలియా భట్, రణవీర్ సింగ్

మెరిసిన అలియా

ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ డిజైనింగ్ కల్చర్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌డీసీఐ) షోలో అలియా మెరిసింది. బాలీవుడ్ నటుడు రణవీర్‌తో కలసి ర్యాంప్ వాక్ చేసి ఆహూతులను అలరించింది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ షోలే అలియా, రణవీర్ జంటే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలియా చేతిపై రణవీర్ ముద్దాడి ర్యాంప్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ డిజైనర్ మల్హోత్రా మాట్లాడుతూ అలియా, రణవీర్‌లది మానసిక సంబంధం అని పేర్కొన్నాడు. ఆలియా మాట్లాడుతూ " నేను చదువుకుంటున్న రోజుల నుంచి మల్హోత్ర ఫ్యాషన్ షోలో పాల్గొనాలని అనుకుంటూ ఉండేదాన్ని. నేను హీరోయిన్‌గా రాకముందు కత్రినా కైఫ్ ఇక్కడ ర్యాంప్ వాక్ చేస్తుంటే నేను ఆడియన్స్‌గా చూశాను' అని పేర్కొంది.





శిశువు పుట్టిన తొలి ఆరునెలల్లో తల్లిపాలను మించిన ఆహారం ఎక్కడా లేదు. తల్లి పాలలోనే శిశువు పోషణకు అవసరమైన విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. శిశువులో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే గుణాలు కూడా తల్లి పాలలోనే ఎక్కువ. శిశువుకు పాలివ్వని తల్లులు తమ అనారోగ్యాన్ని తాము ఆహ్వానించుకోవడంతో పాటు తమ పిల్లల్ని కూడా దుర్బలులుగా మార్చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తల్లి పాల వలన ప్రయోజనాలేమిటో అంతా గుర్తిస్తున్నారు. దీనికై విస్తృత ప్రచారం కూడా జరుగుతోంది. యూనిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు కలిసి గత పాతికేళ్ల నుంచీ ఆగస్టు తొలివారం "ప్రపంచ తల్లిపాల వారోత్సవం" నిర్వహిస్తున్నాయి. అమ్మపాలలో దాగిన ఆరోగ్య విశేషాలే ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో ...

అమ్మపాలే ఆరోగ్యం

తొమ్మిది నెలల పాటు తన శరీరంలో ఒక భాగంగా శిశువుని మోస్తూ తల్లి తన రక్తమాంసాలను పంచుతోంది. ప్రసవం ద్వారా ఆ శిశువుకు జన్మనిస్తుంది. అంతవరకూ గర్భంలో శిశువుకు ఆహారం అంతా తల్లి ద్వారానే అందుతుంది. ఆ శిశువు భూమ్మీదకు వచ్చిన వెంటనే ఆ తల్లికి పాలు రావడం మొదలవుతుంది. ఇదంతా ప్రకృతి సహజమైన ప్రక్రియ.

పుట్టిన వెంటనే

సహజ ప్రసవం ద్వారా బిడ్డను కన్న తల్లి గంటల వ్యవధిలోనే బిడ్డకు పాలివ్వడం చాలా మంచిది. సిజేరియన్ ద్వారా బిడ్డను కన్న తల్లి నొప్పి తగ్గిన తర్వాత నాలుగైదు, గంటల్లోపలే శిశువుకి పాలివ్వొచ్చు. తల్లి పాలు తాగిన శిశువు ఆరోగ్యంగా, సరైన బరువుతో పెరగడానికి అవకాశం కలుగుతుంది. దీంతో పిల్లలకు విరోచనాలు సక్రమంగా జరగడమే కాకుండా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఎదురుకావు. తల్లి పాలు శిశువుకు చక్కగా జీర్ణమవుతాయి. తల్లిపాలల్లో ప్రోటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మినరల్స్, క్యాల్షియం, పొటాషియం తదితర పోషకాలన్నీ అవసరమైన మేరకు ఉంటాయి. శిశువు ఆరోగ్యంగా పెరగడానికి ఇదే ప్రాథమిక ఆహారం.

ఇన్ఫెక్షన్లూ, అలర్జీలు రాకుండా

తల్లి పాలు తగినంతగా తాగే శిశువుకు ఎలాంటి ఇన్‌ఫెక్షన్లూ రావు. అలర్జీలు కూడా దరిచేరవు. కొందరు తల్లులకు సరిగ్గా పాలురావు. అటువంటి వారూ వచ్చిన మేరకు శిశువుకు పాలిచ్చి, మరీ ఇంకా అవసరం పడితే బాటిల్‌తో పాలు పట్టొచ్చు. అయితే తల్లిపాలు, బాటిల్‌లోని పాలతో ఎప్పటికీ సమానం కావని గుర్తించాలి. ఈ పాలలో ప్రొటెక్టివ్ యాంటీబాడీస్ ఉంటాయి. దీంతో శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు ఆకలితో ఏడ్చిన వెంటనే సులభంగా తల్లి పాలివ్వవచ్చు. బ్రెస్ట్ ఫీడింగ్ చేస్తుంటే స్త్రీలకు కొన్ని అనారోగ్య సమస్యలు రావు. పాలివ్వడం వలన తల్లిలో యుట్రెస్ తిరిగి మామూలు సైజుకు చేరుకుంటుంది. శిశువుకు తనపాలు కాకుండా బయటపాలు సిద్ధం చేసివ్వాలంటే కొంత సమయం పడుతుంది. అవి అంత శక్తిమంతం కాకపోవడం, అపరిశుభ్రంగా ఉండడం వంటి కారణాల వల్ల శిశువుకు మేలైనవి కావు. పూర్తిగా తల్లి పాలు ఇవ్వకపోతే ఆ బిడ్డకు ఎదిగే క్రమంలో మోకాళ్లు వంకర్లు తిరగడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

తల్లికి అవగాహన పెంచాలి

తొలి కాన్పు జరగక ముందే అంటే ఏడెనిమిది నెలల గర్భంతో ఉన్నప్పటి నుంచే పుట్టబోయే శిశువుకు పాలిచ్చే విషయంపై తల్లిలో అవగాహన పెంచాలి. అందుకోసం వారిని మానసికంగా సిద్ధం చేయాలి. పుట్టిన వెంటనే బిడ్డకు తప్పనిసరిగా పాలివ్వాలని చెప్పాలి. ఈ విషయంపై వారికి ఏవైనా అపోహలుంటే వాటిని తొలగించే ప్రయత్నాలు చేయాలి. బిడ్డకు పాలిచ్చే బ్రెస్ట్ నిపుల్‌ను సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. నిపుల్ వెనక్కి ఉంటే అప్పుడే పుట్టినబిడ్డ పాలు తాగడానికి ఇబ్బందిగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి, దీనిని సరిచేయాలి. శిశువుకి పాలిచ్చేటప్పుడు నిపుల్ చుట్టూ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తల్లికి అవగాహన కలిగించాలి.

పాలు తక్కువగా వస్తే

ప్రసవం జరిగిన తర్వాత కొంత మంది మహిళలకు పాలు తక్కువగా వస్తాయి. ముఖ్యంగా వయస్సు పెరిగిన తర్వాత ఆలస్యంగా గర్భం ధరించి ప్రసవించే వారిలో పాలు రావడం తగ్గుతుంది. ఎక్కువగా 35 సంవత్సరాల తర్వాత కాన్పు జరిగే వారిలో ఈ సమస్య ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగా గర్భం ధరించడం వల్ల పుట్టే శిశువుకు సరిగా పోషకాలతో గల పాలు అందించడానికి వీలౌతుంది. పిల్లలకు పాలివ్వడంలో ఎటువంటి ఆందోళన పడకూడదు. తల్లి ప్రశాంతంగా ఉంటేనే తన బిడ్డకు సక్రమంగా పాలివ్వగల్గుతుంది. కొందరు మహిళల్లో కొన్ని రకాల ఆరోగ్య సమస్యలతోనూ పాలు సరిగ్గా రావు. రక్తపోటు, గుండె సమస్యలు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువ. వీరికి తగిన చికిత్స అందించాలి.

కూర్చొనే పాలు ఇవ్వాలి

బాలింతలు తమ పిల్లలకు పాలు కూర్చొనే ఇవ్వాలి. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ప్రసవించినవారు ప్రారంభంలో పడుకొని పాలిచ్చినా నొప్పి తగ్గిన తర్వాత కూర్చొనే పాలివ్వాలి. పాలిచ్చే సమయంలో కూర్చొనే ఇవ్వడం మంచిదన్న విషయాన్ని గ్రహించాలి. ఇలా తాగించడం వల్లే శిశువు కడుపు నిండా పాలు తాగడానికి వీలౌతుంది. పాలు తాగిన తర్వాత బిడ్డను భుజంపై వేసుకొని కొద్దిగా జో కొడితే పాలతో పాటు వెళ్లే గాలి మూలంగా వాంతులు రాకుండా ఉంటాయి. ఈ విధంగా చేస్తే శిశువుకు పాలు వెంటనే జీర్ణమవుతాయి. కొన్నిసార్లు తల్లి పాలిచ్చినా ఇంకా ఏడుస్తుంటే శిశువుకు పాలు సరిపోలేదన్న విషయాన్ని గమనించి, బయటి పాలు తాగించాలి.



తొమ్మిది నెలల వరకూ ఇవ్వొచ్చు

శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తొమ్మిది నెలల వరకూ తల్లిపాలు ఇవ్వాలి. అయితే ఇందులో తొలి ఆరు నెలల పాటు మాత్రం తప్పనిసరిగా పాలు ఇవ్వాలి. ఐదో నెల నుంచి పాలతో పాటు పండ్లు, పిల్లలకు ఇచ్చే ఇతర పోషకాహారాన్ని అదనంగా అందజేయడం అవసరం. పాలిచ్చే సమయంలో శిశువుకు ప్రతి రెండు, మూడు గంటలకొకసారి తప్పనిసరిగా తల్లి పాలివ్వాలి. ఒకవేళ శిశువు గాఢ నిద్రలోఉంటే, నాలుగు గంటల కైనా పాలివ్వాలన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. తల్లి బిడ్డకు కనీసం ఐదు నిమిషాలైన పాలివ్వాలి. పెరుగుతూ ఉన్న శిశువుకైతే పది, పదిహేను నిమిషాల పాటు పాలివ్వడం మంచిది. కడుపునిండా పాలు తాగగానే పిల్లలు వెంటనే పడుకుంటారు. ఏడో నెల నుంచి, శిశువు యొక్క పోషకాహార అవసరాలను తీర్చడం కోసం తల్లిపాలు ఏమాత్రం సరిపోవు. తల్లి పాలను వైవిధ్యమైన పోషకాహార డైట్‌తో సంతులనం చేయాలి. సకాలంలో, తగినమొత్తంలో, అనుబంధ ఆహారాలను ఇవ్వడం ప్రారంభించాలి. ఆరు నెలల తరువాత బిడ్డకు రోజుకు మూడు నుంచి నాలుగుసార్లు ఆహారం ఇవ్వాలి. అలానే తల్లిపాలు ఇవ్వడాన్నీ కొనసాగించాలి.



ఓ.....తల్లీ నీకు వందనం

బిడ్డకు అమ్మగా,
బ్రెజిల్ పార్లమెంటు సభ్యురాలిగా
ఏకకాలంలో రెండుకర్తవ్యాలు
నిర్వహించిన అమ్మ
అమ్మంటే అమ్మే...అమ్మకు సాటిరారెవ్వరు
మనదేశం లోనైనా.....మరేదేశం లోనైనా

పాలు సక్రమంగా రాకపోతే

పాలు సక్రమంగా రాని బాలింతలకు క్యాల్షియం, ఇతర మందులు అందజేస్తారు. ఈ మహిళలు ఎక్కువ క్యాలరీలన్నీ ఆహారాన్ని తీసుకోవాలి. ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారంతో పాటు పాలు, బ్రెడ్, రొట్టెలు నట్స్ వంటివి తీసుకోవాలి. తల్లికి తగినంత నిద్ర ఉండాలి. ఎప్పటికప్పుడు నీళ్లు బాగా తాగాలి. ఇవన్నీ సక్రమంగా ఉన్నప్పుడు తల్లిబిడ్డకు తగినంత పాలివ్వగల్గుతుంది. తల్లి పాలు కడుపు నిండా తాగిన పిల్లలు అవసరమైన బరువు పెరుగుతారు. కొందరు తమ బిడ్డకు అవసరానికి మించి ఎక్కువగా పాలిస్తారు. ఇది మంచిదికాదు. దీనివల్ల శిశువుకు వాంతులు అవుతాయి.

వైద్యంతో సమస్యలకు పరిష్కారం

కొన్ని రకాల ఆరోగ్య సమస్యలున్నవారు శిశువుకు సరిగా పాలివ్వలేక ఇబ్బందులు పడుతుంటారు. ముఖ్యంగా బ్రెస్ట్‌లో ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు ఉన్నప్పుడు తల్లి బిడ్డకు సరిగా పాలివ్వలేదు. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడే వెంటనే వాటికి చికిత్స చేయించుకోవడం అవసరం. బిడ్డకు జలుబు ఉంటే ముక్కు పట్టేసి పాలు తాగడంలో ఇబ్బందులు ఎదురౌతాయి. జలుబు ఉన్న పిల్లలకు వెంటనే వైద్యం చేయించాలి. తల్లిలో ఏదైనా ఇన్‌ఫెక్షన్ ఉంటే పాల ద్వారా అది బిడ్డకు సోకవచ్చు. దీన్ని దష్టిలో పెట్టుకొని ఇన్‌ఫెక్షన్‌కు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తల్లి చికిత్సలు చేయించుకోవాలి. తీవ్రమైన గుండె వ్యాధుతో బాధపడుతున్న తల్లులు కూడా బిడ్డకు పాలివ్వలేరు. కొన్నిసార్లు ప్రసవ సమయంలో షాక్ తో తీవ్ర ఆందోళనకు గురైనవారు కూడా తమ పిల్ల లకు సక్రమంగా పాలివ్వలేరు. ఇటు వంటి వారు వెంటనే వైద్యం చేయించు కోవడం చాలా అవసరం. ఆరోగ్యపరమైన సమస్యలు లేకుండానే పిల్లలకు పాలివ్వని తల్లులు బ్రెస్ట్ క్యాన్సర్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి.

అమ్మపాలలో ఏముంటాయి?



ప్రసవం జరిగిన వెంటనే తల్లి మొదటిపాల (ముర్రుపాలు)ను శిశువుకు తప్పనిసరిగా ఇవ్వాలి. తల్లి యొక్క మొదటిపాలు ఎంతో శ్రేష్ఠమైనవి, వాటిని పారవేయకూడదు. ముర్రుపాలు ఎంతో ఆవశ్యకం, తరువాత రోజుల్లో బిడ్డ అందుకునే పాలను స్వీకరించేవిధంగా బిడ్డ జీర్ణవ్యవస్థను సిద్ధం చేస్తుంది. ఈ ముర్రుపాలలో జింక్, క్యాల్షియం, విటమిన్లు ఉంటాయి. మొదటి ఆరునెలల పాటు బిడ్డకు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలి, దీనివల్ల డయేరియా, న్యూమోనియా వంటి సాధారణ శిశు రుగ్మతల నుంచి రక్షణ లభించడం వల్ల శిశుమరణాలు తగ్గుతాయి. అస్వస్థత సమయంలో వేగంగా కోలుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది.



డాక్టర్ ఎన్. ఎస్. విఠల్ రావు,
ఎం.డి (పిడియాట్రిక్స్),
పిడియాట్రిక్స్ ప్రొఫెసర్.
ప్రభుత్వ సర్వజనాసుపత్రి, విజయవాడ.



చిన్నారి

పొడుపు కథ

నాలుగు కర్రల మధ్యన
నల్లరాయి
ఏమిటది?

జోక్ :


టీచర్ : బాలూ..! 'నారు పోసిన వాడే నీరు పోస్తాడు.' లాంటి సామెత ఇంకోటి చెప్పు?
బాలు : పాఠం చెప్పిన వారే మార్కులు వేస్తారు..!
టీచర్ : ఆ...!!!??

ఈగ కాళ్ళు రుద్దుకొంటుంది తెలుసా?!




కోట్ల సంవత్సరాల నుండి భూమిపై ఈగలు నివసిస్తున్నట్లు ఈగ శిలాజాల రూపంలో ఎన్నో ఆధారాలు లభించాయి. ఈగను చూసినా, మీద వాలినా చిరాకు పడనివారుండరు. అసలు ఈగ స్వరూపమే చిరాకు కల్గించేలా ఉంటుంది. నిజానికి ఈగవల్ల వచ్చే ప్రమాదాలు చాలా ఎక్కువ. ఎన్నో అంటువ్యాధులకు ఈగ ముఖ్య కారణం అంటే మనకు భయం వేయక మానదు. ఈగ ముందు కాళ్ల కింది భాగంలో, నోటి వద్ద జిగురు వంటి పదార్థం ఎప్పుడూ ఉత్పత్తి అవుతుంది. అంతే కాక ఈగ ముందు కాళ్ళ చివరి భాగంలో సన్నని వెంట్రుకల వంటివి ఉండటం వల్ల ఏదైనా పదార్థంపై వాలినప్పుడు ఆ జిగురు ద్వారా రకరకాల వ్యాధి కారక క్రిములు తిను బండారాలపై చేరతాయి. ఇంతకీ ఈగ ముందు కాళ్ళు ఎందుకు రుద్దుకొంటుంది అన్నది ఇక్కడ ప్రశ్న. దీనికి కారణం ఈగ ఏ పదార్థాన్నైనా దాని రుచిని నోటి ద్వారా కాక ముందు కాళ్ళకు రుద్దుకోవడం వల్ల తెలుసుకొంటుంది. అందుకే అది ఒకచోట నుంచి మరొక చోటుకు వాలినప్పుడు నిరంతరం ఆయా పదార్థాల రుచిని పసిగట్టడానికి ముందు కాళ్ళు రుద్దుకొంటుంది. ★





లెక్కించి రంగులేయండి!

పిల్లలూ..! పైనున్న ఫోటోలో ఇచ్చిన అంకెలను లెక్కించగా వచ్చిన వాటికి రంగులు వేయండి!



రెండో టెస్ట్‌కు చండీమాల్

- శ్రీలంక జట్టులో భారీ మార్పులు
- రాహుల్ రాక..శిఖర్, ముకుంద్‌ల్లో ఒకరికి విశ్రాంతి



టీమ్ సభ్యులతో కోచ్ రవిశాస్త్రి

కొలంబో: భారత్‌లో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో నిలిచేందుకు శ్రీలంక జట్టులో రెండో టెస్ట్‌కు భారీ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. గాలే టెస్ట్‌లో అలవోకగా నాలుగో రోజే భారత్ 304 పరుగుల తేడాతో భారీ విజయం చేజిక్కుంచుకుంది. దీంతో ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌లో లంక సేన గెలిచి తీరాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా న్యూమెనియా జ్వరంతో తొలి టెస్ట్‌కు దూరమైన ఆ జట్టు కెప్టెన్ దినేష్ చండీమాల్ రెండో టెస్ట్‌కు సారథ్య బాధ్యతలు స్వీకరించనున్నాడు. తాత్కాలిక కెప్టెన్ కంగనా హెరాత్ గాయంతో తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగలేదు. దీంతో అతనికి కొలంబో టెస్ట్ నుంచి విశ్రాంతి తీసుకోనున్నాడు. వేలికి గాయం కావడంతో అతను కొనసాగే విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఖచ్చితంగా ప్రకటించలేదు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అతన్ని పరీక్షించి తీసుకునేది? లేనిది ప్రకటించే అవకాశం ఉన్నట్లు టీమ్ మేనేజర్ గురు సిన్హా చెప్పారు. కొలంబో వికెట్‌పై ఆరు నుంచి ఏడుగురు బ్యాట్స్‌మెన్ తుది జట్టులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. దినేష్ రాకతో గుణ తిలకే జట్టు నుంచి నిష్క్రమించనున్నాడు. ఈ నేపథ్యంలో నెం:3 బ్యాటింగ్ ఆర్డర్‌లో కుశాల్ మెండిస్‌ను దింపనున్నారు. జట్టులోని లోపాలపై సమగ్రంగా చర్చించి భారత్‌కు గట్టిపోటీ నివ్వాలనే యోచనలో శ్రీలంక పావులు కదుపుతోంది.

బ్యాటింగ్ ఆర్డర్‌పై రవిశాస్త్రి గురి..


టెస్ట్ జట్టులో ఏ స్థానంలోనైనా బ్యాట్స్‌మెన్ బ్యాటింగ్ ఆర్డర్‌లో దిగే విధంగా సన్నద్ధం చేసే అంశంపై భారత ప్రధాన కోచ్ రవిశాస్త్రి గురిపెట్టాడు. కొలంబోలో రెండో టెస్ట్‌లో విజయం ఏ విధంగా సాధించాలన్న అంశంపై ముందస్తు కసరత్తు ప్రారంభించాడు. గాలే టెస్ట్‌లో టాస్ గెలిచిన నేపథ్యంలో బ్యాటింగ్‌కు దిగిన ఓపెనర్లు శిఖర్, అభినవ్ ఏ విధంగా రాణించిందీ చర్చించాడు. జ్వరంతో తొలి టెస్ట్‌కు దూరమైన ఓపెనర్ కెఎల్ రాహుల్ రెండో టెస్ట్‌కు అందుబాటులోకి రానున్నాడు. దీంతో శిఖర్ లేదా అభినవ్ ముకుంద్‌ల్లో ఎవర్నో ఒకర్ని బెంచ్‌కే పరిమితం చేయాల్సి ఉంటుంది. శిఖర్ తొలి ఇన్నింగ్స్‌లో 168 బంతుల్లో 190 పరుగులతో భారత్ భారీ స్కోర్ సాధన కీలక పాత్ర పోషించాడు. అభినవ్ తొలి ఇన్నింగ్స్‌లో విఫమైనా రెండో ఇన్నింగ్స్‌లో అర్థ సెంచరీతో సత్తా చాటాడు. దీంతో ఓపెనర్ల విషయంలో భారత్‌కు కొత్త తలనొప్పి వచ్చి పడింది. వీరిద్దరికి విశ్రాంతి ఇచ్చి పూజరా, కెఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అంశంపైన టీమ్ మేనేజ్‌మెంట్ గురి పెట్టింది.



చండీమాల్

జుల్ఫికర్‌తో బౌట్ త్వరగా ముగిస్తా

- ప్రొ బాక్సర్ విజేందర్ ధీమా



ముంబయి : ప్రొ బాక్సింగ్‌లో ఎదురులేని విజయాలతో దూసుకెళ్తున్న భారత స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్ ఈ నెల 5న జుల్ఫికర్ మైమతాలితో జరిగే ట్విన్ టైటిల్ బౌట్‌ను త్వరగా ముగించడంపైన దృష్టి సారించినట్లు తెలిపాడు. ముంబయి వేదికగా చైనీస్ నెం:1 బాక్సర్ జుల్ఫికర్‌తో విజేందర్ తలపడనున్న విషయం తెల్సిందే. వరుసగా ఏడు నాకౌట్ బౌట్ విజయాలతో పాటు గతేడాది డబ్ల్యుబివో ఆసియా పసిఫిక్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విషయం తెల్సిందే. జుల్ఫికర్ డబ్ల్యుబివో ఓరియంటల్ మిడిల్ వెయిట్ ఛాంపియన్‌షిప్‌ను సాధించాడు. మైమతాలితో జరిగే బౌట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి నూరుశాతం శ్రమిస్తానని ఢిల్లీలో విజేందర్ సోమవారం ధీమా వ్యక్తం చేశాడు. జుల్ఫికర్ కంటే సింగ్ తొమ్మిదేళ్ల వయస్సులో చిన్నవాడు. రోజుకు పదిగంటల పాటు కసరత్తు చేస్తున్నట్లు సింగ్ పేర్కొన్నాడు.

చెక్ చెస్‌లో అభిజిత్‌కు రెండో స్థానం



న్యూఢిల్లీ: కామన్‌వెల్త్ ఛాంపియన్ అభిజిత్ గుప్తా స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనతో చెక్ రిపబ్లిక్ జరుగుతున్న చెక్ ఓపెన్ చెస్ టోర్నీలో రెండో స్థానంలో నిలిచాడు. హంగరీకి చెందిన ఫ్లోరెయిన్ కజర్‌తో పోరులో సూపర్ టై బ్రేకర్‌లో విజయం సాధించాడు. 25 ఏళ్ల చెక్ చెస్ స్టార్ క్రాజిక్ ఏడు మ్యాచ్‌ల్లో విజయం సాధించి, రెండు మ్యాచ్‌లో డ్రా, ఓ టైతో తొలి స్థానంలో నిలిచాడు. 9 పాయింట్లకు గాను అభిజిత్ చివరి మూడు గేమ్‌ల్లో 1.5 పాయింట్లతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌కు ముందు 5.5 పాయింట్లతో అభిజిత్ నిలిచాడు.

2024 ఒలింపిక్స్‌లో క్రికెట్

- ప్రతిపాదించిన ఐసిసి
- ఆందోళనలో బిసిసిఐ

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉన్న క్రీడల్లో క్రికెట్ ఒకటి. అలాంటి క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో ఇప్పటి వరకు చోటే దక్కలేదు. చివరిసారిగా 1900లో పారిస్‌లో జరిగిన క్రికెట్‌కు చోటు దక్కింది.ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు 2024 ఒలింపిక్స్‌లో టి 20 క్రికెట్‌లో చోటు కల్పించాలని ఐసిసి భావిస్తోంది. ఈ విషయాన్ని ఐసిసి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటి (ఐవోసి) దృష్టికి తీసుకెళ్లింది. అయితే క్రికెట్ ఆడే దేశాలు అంగీకరిస్తేనే ఐవోసి బిడ్డింగ్ వేయాలని స్పష్టం చేసింది. ఆదాయ పంపిణీ విషయంలో ఐసిసి తాను అడిగిన మొత్తంలో చెల్లించలేదు. కాబట్టి ఒలింపిక్స్‌లో క్రికెట్ అంశంపై బిసిసిఐ స్పందన అంతంత మాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఐవోసి బిడ్డింగ్ విషయమై ఐసిసి బిసిసిఐను సంప్రదించినట్లు తెల్సింది. దీనికి బిసిసిఐ సుముఖంగా ఉన్నట్లు కనిపించడం లేదు.

న్యూజిలాండ్ ఓపెన్‌కు ప్రణయ్, కశ్యప్, అజయ్

- నేటి నుంచి టోర్నీ ప్రారంభం

ఆక్లాండ్ : న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తా చాటేందుకు భారత షట్లర్లు పావులు కదుపుతున్నారు. మంగళవారం నుంచి వారం రోజుల పాటే సాగే ఈ టోర్నీలో భారత యువ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్, అజయ్ జయరామ్‌లో బరిలో దిగుతున్నారు. యూఎస్ ఓపెన్ విజేత హెచ్‌ఎస్ ప్రణయ్ తన జైత్రయాత్రను ఇక్కడా కొనసాగించాలని పట్టుదలతో ఉన్నాడు. ఆరుగురు అగ్రశేణి షట్లర్లను ఓడించిన ప్రణయ్ ఇటీవల కాలంలో గాయాలతో సతమతం అవుతున్నాడు. తాజాగా 17 ర్యాంకుకు ఎగబాకాడు. రెండేళ్లుగా గాయాలతో బాధపడుతూ ఇటీవలే యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన కశ్యప్ కూడా ఈ సిరీస్‌లో రాణించాలని కసిగా ఉన్నాడు.



ప్రణయ్



కశ్యప్

ఈ నెలలోనే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న మరో స్టార్ షట్లర్ అజయ్ జయరామ్ ఈ టోర్నీని వినియోగించుకొని ముందుకు సాగాలని యోచిస్తున్నాడు. తొలి రౌండ్‌లో చైనీస్ తైపీ షట్లర్ చియా హంగ్ లూతో జయరామ్ తలపడనున్నాడు. పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ, సౌరభ్ వర్మ సోదరులతో పాటు , డబుల్స్‌లో మను అత్రి– సుమిత్‌రెడ్డి ద్వయం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

మొయిన్ ఆలీ హ్యాట్రిక్ చరిత్ర



- దక్షిణాఫ్రికాపై ఇంగ్లాండ్ భారీ విజయం

లండన్: ఇంగ్లాండ్ స్పిన్ బౌలర్ మొయిన్ ఆలీ ఓవల్ వేదికపై హ్యాట్రిక్ వికెట్లతో చరిత్ర సృష్టించాడు. దీంతో మూడో టెస్ట్‌లో దక్షిణాఫ్రి కాపై ఆతిథ్య జట్టు 239 పరుగులతో ఘన విజయా న్ని నమోదు చేసింది. నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో 2–1 ఆధిక్యంతో ముందంజ వేసింది. ఓవల్‌లో ఆడిన 100వ టెస్ట్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించడం విశేషం. నాలుగో రోజు 72 పరుగులతో ఇన్నింగ్స్ ప్రారంబించిన ఎల్గర్ సెంచరీతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఆలీ చెలరేగడంతో దక్షిణాఫ్రికా భారీ ఓటమి చవి చూసింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగులకు ఆలౌట్ కాగా, దక్షిణఫ్రికా 175కే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌ను ఇంగ్లాండ్ 313/8 వద్ద డిక్లేర్డ్ చేసింది. దీంతో దక్షిణాఫ్రికా ముందు 492 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. 16 ఓవర్‌లో ఆలీ మాయాజాలం ప్రదర్శించాడు. సెంచరీతో కదం తొక్కిన ఎల్గర్‌ను 136 వద్ద ఆలీ ఔట్ చేశాడు. ఆ తర్వాత రబాడ స్టోక్స్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మోరిన్ మార్కెల్‌ను ఎల్‌బిగా ఆల్ ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. సెంచరీ చేయడంతో పలు వికెట్లు తీసిన ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఇరుజట్ల మధ్య చివరి టెస్ట్ ఈ నెల నాలుగో తేదీన ప్రారంభం కానుంది.

చెన్నై శిక్షణకు 34 మందితో ఫుట్‌బాల్ టీమ్



న్యూఢిల్లీ : 2019 ఆసియా కప్ క్వాలిఫైర్స్ టోర్నీలో పాల్గొనే భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు చెన్నైలో శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు 34 మంది సభ్యులతో కూడిన ఫుట్‌బాల్ జట్టును టీమ్ ప్రధాన కోచ్ కానిస్టంటైన్ సోమవారం ప్రకటించారు. సెప్టెంబర్ ఐదో తేదీ నుంచి ఆసియాన్ క్వాలిఫైర్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి.ఈ సారి జట్టులో కొత్తగా ఐదుగురికి చోటు కల్పించారు. భారత్ ఇటీవల కాలంలో వరుస విజయాలతో దూకుడు మీద ఉంది. మయన్మార్, కిర్గిస్తాన్ రిపబ్లిక్‌పై విజయాలను సాధించిన భారత మూడో గేమ్‌లో మకావుతో తలపడనుంది. ఈ నెల 11 నుంచి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తుండగా, సారుత్క్ గోలియా, దేవిందర్ సింగ్, నికిల్ పూజారీ, అనిరుథ్ థప, మానవీర్ సింగ్‌లు సీనియర్ టీమ్‌లో ఉన్నారు.

కర్నాటకలో కళకళ.. ఎపిలో వెలవెల...



- ఆందోళనకరం కృష్ణానదీ పరీవాహకం
- పూర్తిగా నిండేదాకా దిగువకు వదలని వైనం
- పూర్తిగా ఎండిపోయిన సుంకేసుల, గాజులదిన్నె

ప్రజాశక్తి – కర్నూలు ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల్లో తాగునీటికి సతమతమవుతుంటే కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలోని ఎగువన ఉన్న కర్నాటకలోని ప్రాజెక్టులు, నిండుకుండలా కళకళలాడు తున్నాయి. కర్నాటకలోని ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయికి నీటిమట్టాలు చేరుకున్నాకే దిగువకు వదులుతున్నారు. దిగువన ఉన్న ప్రాజెక్టుల్లో ఆగస్టులోకి వచ్చినా డెడ్ స్టోరేజీ లెవెల్‌లోనే నీటిమట్టాలు ఉండడం ఆందోళనకరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో తాగునీటికి కూడా వాడుకోలేనంత నీటిమట్టాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. కృష్ణానదిపై ఉండే మొదటి ప్రాజెక్టు ఆల్మట్టిలోకి పూర్తిస్థాయికి నీరు చేరుకుంది. ఆల్మట్టి డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 129.72 టిఎంసిలు కాగా ప్రస్తుతం 126.74 టిఎంసిలు ఉంది. పూర్తిస్థాయికి కేవలం 2.98 టిఎంసిలే తక్కువ. ఈ ప్రాజెక్టులోకి 48,906 క్యూసెక్కులు వస్తుండగా కేవలం దిగువకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా మాత్రమే 11,681 క్యూసెక్కులను వదలుతున్నారు. ఆల్మట్టి దిగువన ఉన్న నారాయణ్‌పూర్ డ్యాంలో దాదాపు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం చేరుకుంది. డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 37.65 టిఎంసిలు కాగా ఇప్పటికే 36.35 టిఎంసిలు వచ్చింది. పూర్తిస్థాయికి 1.3 టిఎంసిలే తక్కువగా ఉంది. నారాయణ్‌పూర్‌లోకి 11,183 క్యూసెక్కులు వస్తుండగా పంట కాల్వలకు 12,500 క్యూసెక్కులను వదలుతున్నారు. నారాయణ్‌పూర్ తర్వాత ప్రాజెక్టు జూరాలకు 15 రోజుల క్రితమే దాదాపు 8 టిఎంసిల నీరు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తాగునీటి అవసరాలతోపాటు పంటలకు నీరు వదలుతుండడంతో ప్రస్తుతం జూరాలలో 5.88 టిఎంసిలే ఉన్నాయి. జూరాల నిండాలంటే ఇంకా 3.78 టిఎంసిలు కావాలి. కృష్ణాకు ఉపనది భీమానదిపై ఉండే ఉజ్జయిని డ్యాం పూర్తిస్థాయి 110 టిఎంసిలు కాగా ప్రస్తుతం 90 టిఎంసిల దాకా నీరు అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 27 టిఎంసిల నీరు అవసరమవుతుంది. మరో ఉపనది తుంగభద్ర నదిపై ఉండే డ్యాంలోనూ నీటి చేరిక ఆందోళనకరంగా ఉంది. తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయి స్వామర్థ్యం 100.8 టిఎంసిలు. అయితే 38.3 టిఎంసిలే అందుబాటులో ఉన్నాయి. ఈ డ్యాంలోకి నీటి ప్రవాహం 8,372 క్యూసెక్కులే వచ్చి చేరుతున్నాయి. పంట కాల్వలకు 1117 క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర డ్యాం నిండేందుకు ఇంకా 62.5 టిఎంసిల నీరు రావాలి. ఎగువన కర్నాటకలో ఉన్న ప్రాజెక్టులు నీటిని ఆపేస్తుండడంతో తుంగభద్ర, ఉజ్జయిని డ్యాంలలో నీరు చాలా తక్కువగా ఉండడంతో శ్రీశైలంలోకి నీటి చేరిక ప్రశ్నార్థకంగా మారింది. డ్యాంలు నిండితే కానీ శ్రీశైలంలోకి నీరు వచ్చే పరిస్థితి లేదు. శ్రీశైలం నిండితేనే నాగార్జున సాగర్‌కు నీరు వస్తుంది. ప్రస్తుతం శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి స్వామర్థ్యం 215 టిఎంసిలు కాగా కేవలం 19.56 టిఎంసిలే అందుబాటులో ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని గాజులదిన్నె ప్రాజెక్టు, సుంకేసుల రిజర్వాయర్లు నీరు లేక ఎండిపోయి ఉన్నాయి. ఆగస్టు నెల వచ్చినప్పటికీ ఈ రెండు ప్రాజెక్టుల్లో నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉండటాన్ని గతంలో ఎన్నడూ చూడలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మన్యంలో విద్యాసంస్థలు బంద్



ముంచంగిపుట్టులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

- నలుగురు అరెస్టు..విడుదల
- తరగతులను బహిష్కరించిన విద్యార్థులు
- పలుచోట్ల రాస్తారోకో,బంద్, మానవహారాలు

ప్రజాశక్తి–యంత్రాంగం

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని, స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని, ఎఎన్‌ఎంలను నియమించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏజెన్సీ యువజన సంఘం ఆధ్వార్యాన సోమవారం విజయనగరం, తూర్పు,పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విశాఖ మన్యంలో బంద్ పాటించారు. ఈ బంద్‌కు సిఐటియు, గిరిజన సంఘం, యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థులు పలుచోట్ల రాస్తారోకో, బంద్, మానవహారాలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలో బంద్‌ను విఫలం చేసేందుకు పోలీసులు విద్యార్థులపై బెదిరింపులకు పాల్పడ్డారు. డిగ్రీ కళాశాలకు ఎస్‌ఎఫ్‌ఐ, ఏజెన్సీ యువజన సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. తరగతుల నుంచి బయటకొస్తున్న సమయంలో ఎస్‌ఎఫ్‌ఐ, యువజన సంఘం నాయకులను పాతపట్నం సిఐ ప్రకాష్, సీతంపేట ఎస్‌ఐ రాములు ఆధ్వర్యాన పోలీసులు అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అశోక్, జిల్లా కార్యదర్శి ఎం.కనకారావు, ఎన్.అప్పన్న, ఏజెన్సీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఎం.లక్ష్మణరావును పోలీసులు అరెస్టు చేసి కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, పార్వతీపురం, సాలూరు, మెంటాడ ఏజెన్సీలో బంద్ విజయవంతమైంది. కురుపాం ప్రాంతంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి, ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యాన జరిగింది. మెంటాడ మండలం ఆంద్ర, కొమరాడ మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలోని 11 ఏజెన్సీ మండలాల్లోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు మూతపడ్డాయి. చింతూరు, విఆర్ పురం, కూనవరం, అడ్డతీగల మండలాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో విద్యాసంస్థలు మూతపడ్డాయి. పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు మండలాల్లో బంద్ విజయవంతంగా ముగిసింది. విశాఖ ఏజెన్సీలోని ముంచంగిపుట్టు, అరకులోయ, అనంతగిరి, పాడేరు, డుంబ్రిగుడు మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఆయా మండల తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. వీరికి గిరిజన సంఘం, యువజన సంఘం మద్దతు తెలిపాయి. పాడేరులో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

చేనేతను జీఎస్టీ నుంచి మినహాయించాలి...

రౌండ్‌టేబుల్‌లో ఏపి, తెలంగాణ చేనేత నాయకులు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

జిఎస్‌టి నుంచి చేనేత రంగాన్ని మినహాయించాలని చేనేత రంగ నిపుణులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ అంశంపై సెప్టెంబరు 9న ఢిల్లీలో అన్ని పార్టీల ఎంపీలతో రౌండ్‌టేబుల్ సమావేశం, 10న అన్ని రాజకీయ పార్టీలకు వినతిపత్రాలు అందించి మద్దతు కోరుతామని చెప్పారు. 11న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. 'చేనేతను జిఎస్‌టి నుంచి మినహాయించి, ప్రత్యేక పాలసీని ప్రకటించాలి..' అని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపి, తెలంగాణ చేనేత కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. చేనేత రంగ నిపుణులు డాక్టర్ డి నర్సింహారెడ్డి జిఎస్‌టి వల్ల చేనేతరంగంపై పడే ప్రభావాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏపి చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు పిల్లలమర్రి బాలక్రిష్ణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో చేనేత రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నదని తెలిపారు. రంగులు, రసాయనాలు, నూలు తదితరాలపై 18 శాతం పన్ను విధించారని తెలిపారు. ఫలితంగా వస్త్రాల ఉత్పత్తి, వాటి అమ్మకాల పైనా విపరీతమైన ప్రభావం పడుతోందని చెప్పారు. వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ జిఎస్‌టి వల్ల రాష్ట్రంలో చేనేత, వస్త్ర పరిశ్రమ కుదేలయిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లలమర్రి బాలకృష్ణ, కోలా రామాంజనేయులు, నాయకులు జేఎన్ శేషయ్య, చేనేత కళాకారుడు పద్మశ్రీ గజం అంజయ్య, వృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎమ్‌వి రమణ, తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గంజి మురళీధర్, సీనియర్ నాయకులు జెల్లా మార్కండేయులు, చిక్కా దేవదాసు, ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు సభ్యుడు కర్నాటి ధనుంజయ, పాశికంటి లక్ష్మీనరసయ్య, అవ్వారు వేణు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68